ప్రధాన అంశం ''విజయవంతమైన'' నూతన రాజధానిని నిర్మించడం మాత్రమే కాదు. (ఆ మాట కొస్తే విజయం లేదా సాఫల్యాన్ని కొలవడానికి మనకు డజన్లకొద్దీ కొలబద్దలున్నాయి): మన ప్రథమ లక్ష్యం ఒక విజయవంతమైన రాజ్యాన్ని అభివృద్ధి చేసి నిర్వహించడం.''

– **బ్లెయిర్ ఎ. రూబుల్,** డైరెక్టర్, ప్రోగ్రాం ఆన్ గ్లోబల్ సస్టెయినబిలిటీ అండ్ రిసైలియన్స్ వాషింగ్టన్, డి.సి.

# ఎవరి రాజధాని అమరావతి?

## ఐ వై ఆర్ కృష్ణారావు


ఫౌండేషన్ ఫర్ సోషల్ అవేర్‌నెస్

హైదరాబాదు

**WHOSE CAPITAL AMARAVATHI?**
**I.Y.R. Krishna Rao**

**ఎవరి రాజధాని అమరావతి?**

**ఐ వై ఆర్ కృష్ణారావు**


ముద్రణ
**మార్చి, 2018**

మూల్యం : రూ. **60/-**

ప్రింటర్స్
**రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

పబ్లిషర్స్
**ఫౌండేషన్ ఫర్ సోషల్ అవేర్‌నెస్**
ఫ్లాట్ నం. 306, తులిప్స్ రెసిడెన్సీ
సివిల్ సప్లై భవన్ దగ్గర
6-3-655, సోమాజిగూడ,
హైదరాబాదు - 500 482.

# అంకితం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు,
రైతు బాంధవులు, నిజాయతీ కలిగిన రాజకీయ నాయకులు
**శ్రీ వడ్డె శోభనాద్రీశ్వరరావు**గారికి

# ప్రస్తావన

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అని రెండు చిన్న రాష్ట్రాలుగా విభజించడం, ముఖ్యంగా చిన్న రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ విషయంలో ఎంతో బాధనూ ఇబ్బందులనూ కల్పించడమే కాక భారీ వ్యయాన్ని కూడా మీద వేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ రాజధానీ నగరాన్ని మళ్లీ నిర్ణయించుకొని సంపూర్ణంగా ఆ కొత్త ప్రాంతానికి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్–6 ప్రకారం భారత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాజధానీ స్థలాన్ని నిర్ణయించడానికి ప్రత్యామ్నాయాలను అధ్యయనం చేయడానికి శివరామకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ముందు వున్న లక్ష్యాలలో జనం స్థానభ్రంశం కావడం కనిష్ఠ స్థాయిలో జరగాలి. వ్యవసాయానికి, పర్యావరణానికి అతితక్కువ నష్టం జరగాలి. ప్రభుత్వ కోశాగారంపై అతితక్కువ భారం పడాలి. కమిటీ సరిగ్గా ఈ లక్ష్యాన్నే నిర్వహించింది. దాని సిఫారసులను ఆమోదించినట్లయితే అది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సుదీర్ఘ భవిష్యత్తులో ఎంతో ప్రయోజనం కలిగించి ఉండేది.

ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకత్వం మరోవిధంగా ఆలోచించింది. శివరామకృష్ణన్ కమిటీ సూచనలను ఏమాత్రం పట్టించుకోకుండా అది ఏక పక్షంగా నిర్ణయం తీసుకుంది. ఎక్కువమంది జనాన్ని నిర్వాశికులను చేయడం వ్యవసాయానికి, స్థానిక పర్యావరణానికి నష్టం కలిగించడం.

సామాజికంగానూ నగదురూపేణా కూడా ప్రస్తుత రాబోయే తరాల రాష్ట్రప్రజల మీద భారీ వ్యయాన్ని మోపడం. కమిటీ సూచనలు అంగీకరించినట్లయితే జరిగేవి కావు.

రాజధానీ నగరం ఎక్కడ ఉండాలన్నది రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకూ సంబంధించిన విషయం. అట్లాగే అన్ని వర్గాల ప్రజలకూ సంబంధించిన విషయం. వాస్తవానికి నేటితరమే కాక, రాబోయే తరాల వారికి కూడా ఇది ముఖ్యమైన విషయమే. మనవంటి ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి విషయాలమీద నిర్ణయాలు ఏకపక్షంగా కాక అందరినీ కలుపుకొని తీసుకోవలసి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందేమిటి? రాష్ట్రంలో అధికారంలో వున్న కొద్దిమంది పలుకుబడి కలిగిన వ్యక్తుల ఇష్టాయిష్టాల మీద ఆధారపడి నిర్ణయాలు జరిగాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల ప్రజలను చీకట్లో ఉంచడం జరిగింది. గుంటూరు కృష్ణా ప్రాంతంలో రాజధానీ నగర ఏర్పాటును వ్యతిరేకించిన వారి గొంతులను నొక్కివేయడమో, నిర్లక్ష్యం చేయడమో జరిగింది. కేంద్రప్రభుత్వ చట్టంలోని ప్రగతిశీలకమైన నిబంధనలను పక్కనపెట్టడం జరిగింది. ముఖ్యంగా లాండ్ ఎక్విజిషన్ రిహాబిలిటేషన్ రీ సెటిల్‌మెంట్ చట్టం, 2013 లోని నిబంధనలను తోసిరాజని లాండ్ పూలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. తత్ఫలితంగా రైతులు బలాత్కార పరిస్థితులలో తొందరపడి తమ హక్కులను తాకట్టుపెట్టి తమకు వాగ్దానం చేసిన అతితక్కువ నగదు పరిహారానికి భూములను ఇచ్చివేయవలసి వచ్చింది. నిజమైన వ్యవసాయదారులకు బదులుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం విజృంభించింది. రైతులు, వారిపై ఆధారపడిన వ్యవసాయకూలీలు, వృత్తికారులు నష్టపోయారు.

రాజధానీ నగరాన్ని మరోచోటికి తరలించవలసిన సమస్య చాలా కఠినమైన సవాళ్లను ఏర్పరచినప్పటికీ నిర్ణయాలు తీసుకునే స్థానంలో వున్నవారికి సృజనాత్మకమైన కొత్తబాటలు వేసే సువర్ణావకాశాన్ని కూడా ఇచ్చింది. గతంలో ఏర్పడిన రాజధానీ నగరాలు సాధారణంగా ఒకేచోట ఎక్కువ జనాభా కేంద్రీకృతమైనవి, పట్టణప్రాంతాలు కలిసి

ఏర్పడినవి. కానీ డిజిటల్ కనక్టివిటీ, వేగవంతమైన రవాణా లభ్యమైన నేటి పరిస్థితులలో రాజధానులు ఒకచోట కేంద్రీకృతమై ఉండవలసిన అవసరం లేదు. ప్రభుత్వ కేంద్రాన్ని ప్రజలకు మరింత దగ్గరగా తీసుకొని వెళ్లవచ్చు. ప్రస్తుతం మనకు లభిస్తున్న సాంకేతకతలు ఆధికారిక సమాచారాన్ని డిజిటల్ స్టోరేజ్ రూపంలో నిలువచేయడానికి, ఆన్‌లైన్‌లో వ్యవహారాలు జరుపుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. ఇటువంటి పరస్థితులలో ఒకేచోట భారీ భవనాలు నిర్మించి అధికారాన్ని కేంద్రీకృతం చేయడం, వాటి నిర్మాణానికి విపరీతమైన డబ్బు ఖర్చుపెట్టడం దానికి సారవంతమైన వ్యవసాయభూములను నాశనం చేయడం ఏ మాత్రం అవసరం లేదు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకత్వం సృజనాత్మకంగా ఆలోచించదలచుకున్నట్లయితే ప్రజాప్రధానమైన ప్రభుత్వం విషయంలో తక్కిన దేశానికి ఒక ఆదర్శాన్ని నెలకొల్పగలిగి ఉండేది. దురదృష్టవశాత్తు రాష్ట్ర రాజకీయ నాయకత్వం తన దృక్పథంలో పూర్తిగా చత్వారంతో వ్యవహరించింది. ఇటువంటి అతిముఖ్యమైన నిర్ణయం తీసుకోవడంలో విశ్లేషణాత్మకంగానూ, సంయమంతోనూ ఆలోచించే అవకాశాన్ని వదిలిపెట్టింది. దురదృష్టవశాత్తు ఇటువంటి నిర్ణయం వల్ల కలిగే సామాజిక కష్టనష్టాలను భరించవలసిన వారు ప్రస్తుత రాబోయే తరాల ఆంధ్రప్రదేశ్ ప్రజలే తప్ప ఈ రాజకీయ నాయకులు కారు.

ఈ పుస్తకాన్ని రచించిన ఐ.వై.ఆర్. కృష్ణారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోను విభజన తరువాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోను చాలా ముఖ్యమైన ఉన్నత స్థానాలలో పనిచేశారు. ఆయన పదవీవిరమణ సమయానికి రాష్ట్రప్రధాన కార్యదర్శిగా రాష్ట్రంలోని సివిల్ సర్వీసెస్‌కు నాయకత్వం వహించారు. అందువల్ల ప్రభుత్వంలో అంతర్గతంగా నిర్ణయాలు తీసుకునే పద్ధతులను అతిసమీపంనుండి ఆయన చూడగలిగారు. ప్రజలకు ఇటువంటి దృక్కోణం అందుబాటులోనికి రావడం చాలా అరుదు. ఆయన ఈ పుస్తకంలో చెప్పిన విషయాలు, బహిరంగ పరచిన విషయాలు చాలా విలువైనవి. అందువల్ల వాటిని అంతే గంభీరంగా చదివి అర్థం చేసుకోవలిసిన అవసరం ఉంది.

కృష్ణారావు ఈ రచనలో చూపించిన సూక్ష్మ విశ్లేషణ నిజంగా గణనీయమైనది. ప్రపంచంలో నగరీకరణ ఎలా జరిగింది, ముఖ్యంగా రాజధానీనగరాలు ఎలా ఏర్పడ్డాయి, అన్న విషయంలో భారతదేశంలోనూ, ఇతరత్రా జరిగిన పరిశోధనల ఫలితాలను ఆయన చర్చించారు. రాజధానీ నగరంగా అమరావతిని నిర్ణయించడంలో జరిగిన లోపాలను, నగరప్రణాళికలో లోపాలను, తత్కారణంగా భవిష్యత్తులో ఏం జరగవచ్చునో అన్న విషయాలను ఆయన సూక్ష్మంగా పరిశీలించారు. గతకాలపు అనుభవాల దృష్ట్యా కృష్ణారావు తెలిపిన విషయాలనుండి రాష్ట్ర రాజకీయ నాయకత్వం పాఠాలను నేర్చుకున్నా, శివరామకృష్ణన్ కమిటీ వివేకవంతమైన సూచనలను పట్టించుకున్నా ప్రస్తుత, భవిష్యత్తరాల ప్రజలపై ఈ ప్రాజెక్టు సామాజిక వ్యయ భారాన్ని గణనీయంగా తగ్గించగలుగుతుంది. రాజధానీ నగరాన్ని ఒకేచోట కేంద్రీకరించకుండా భిన్నప్రదేశాలలో పంపిణీ చేసి ప్రభుత్వ పాలనను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలకు సమీపంలోకి తేగలుగుతుంది.

ఇప్పుడు ప్రణాళికీకరిస్తున్న పద్ధతిలో అమరావతీ నగరం, భూపరిహారపు సింహభాగం ధనికులైన ఆబ్సెంటీ రైతుల, మధ్యదళారీ రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. పేదలు నష్టపోతారు, ధనికులు లాభపడతారు. ఇటువంటి పక్షపాత ధోరణి కలిగిన ఏ పట్టణ విస్తరణ నమూనా అయినా సమాజంలో ప్రజల మధ్య విభేదాలను, అంతరాలను పెంపొందిస్తుంది. దేశంలోని పెద్దపెద్ద నగరాలలో జరిగింది ఇదే. అమరావతి ప్రణాళికాకారులు రాబోయే సంవత్సరాలలో దీన్ని ఎదుర్కోవలసి ఉంటుంది.

భవిష్యత్తులో రాబోయే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలన్నీ సుప్రసిద్ధ గ్రీకుతత్త్వవేత్త ప్లేటో(క్రీ.పూ. 4వ శతాబ్ది) భవిషద్వాణిని జాగ్రత్తగా గుర్తుపెట్టుకోవడం మంచిది.

***"ఏ నగరమైనా అదెంత చిన్నదైనా వాస్తవానికి రెండుగా విభాజితమై ఉంటుంది. ఒకటి పేదల నగరం. రెండవది ధనికుల నగరం. ఈ రెండూ ఎప్పుడూ ఒకదానితో ఒకటి పోరాటంలో ఉంటాయి."***

మానవ వనరులపై తగినంత ఊనికలేని పట్టణప్రణాళిక ఎప్పుడూ నష్టదాయకంగానే పరిణమిస్తుంది.

**'ఎవరి రాజధాని అమరావతి?'** అన్న ఐ.వై.ఆర్. కృష్ణారావు విశ్లేషణాత్మక రచనను సాధ్యమైనంతమంది ఆంధ్రప్రదేశ్‌లోనే దాని వెలుపలా కూడా చదవాలని నా కోరిక. అది అమరావతిని ఎలా ప్రణాళికీకరించారు. భవిష్యత్తులో ప్రజలపై దాని ప్రభావం ఎలా ఉంటుంది. అన్న విషయాలపై ఈ గ్రంథం లోతైన పరిశీలనను అందిస్తున్నది.

**– ఇ.ఎ.ఎస్. శర్మ**
భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి

# ముందుమాట

'ఎవరి రాజధాని అమరావతి?' అన్న ఈ పుస్తకం ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల రాజధానీ నగరాల గురించి విపులమైన సమాచారాన్ని అందిస్తూ ఉంది. రాజధానీ నగరాలను ఏర్పాటుచేయవలసిన ప్రదేశాల ఎంపికకు వెనుకవున్న వివిధ అంశాలను ఈ పుస్తకం చర్చించింది. అనేక రాజధానీ నగరాల గురించి విస్తృతంగా చర్చించింది. వాటి స్థలాల ఎంపికకు వెనుక వున్న ఆర్థిక, సాంస్కృతిక, జాతి, ప్రాంతాది కారణాలను వివరించింది. చండీగఢ్, గాంధీనగర్, భువనేశ్వర్, నయా రాయపూర్ వంటి కొత్త రాజధానీ నగరాల గురించిన సమాచారాన్ని వాటి ఆర్కిటెక్టులు ప్రణాళికల ప్రత్యేక లక్షణాలను గురించిన సమాచారాన్ని ఇచ్చింది. ఇక రాష్ట్రవిభజన తరువాత ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానీ విషయానికి వస్తే శ్రీ కృష్ణారావు సి.సి.ఎల్.ఏ. గాను, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగాను నవ్యాంధ్రప్రదేశ్ రాజధానీ స్థలం కోసం అందుబాటులో వున్న ప్రభుత్వ భూముల సమాచారాన్ని శ్రమకోర్చి సంపాదించారు.

ప్రకాశం జిల్లా దొనకొండలో కానీ, కృష్ణాజిల్లాలో నూజివీడుకు సమీపంలో కానీ రాజధానీ నగర నిర్మాణానికి తగిన స్థలం వున్నదన్న శ్రీ ఐ.వై.ఆర్. కృష్ణారావు అభిప్రాయం కొందరికి నచ్చలేదు. మద్రాసు రాష్ట్రంనుండి ఆంధ్ర విడిపోయే సమయంలోనే రాయలసీమ ప్రజలు వ్యక్తం చేసిన భయాల నేపథ్యంలోనూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజిస్తున్న సమయంలో రాయలసీమకు చెందిన కొందరు 'రాయల తెలంగాణ'

ను సూచించిన నేపథ్యంలోనూ దొనకొండను రాజధానిగా సూచించడం జరిగింది. రాయలసీమ ప్రజల ప్రాంతీయ మనోభావాలు, ఆకాంక్షలను పరిగణనలోనికి తీసుకున్నప్పుడు దొనకొండ రాజధానిగా వుండడం వల్ల ప్రకాశం జిల్లా, రాయలసీమ జిల్లాల వెనుకబడిన ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి.

అదే విధంగా నూజివీడు సమీపంలో రాజధానిని ఏర్పరచాలని ఆయన సూచనకు కూడా బలం ఉంది. ఎందుకంటే ఇక్కడ కొన్ని వేల ఎకరాల ప్రభుత్వ భూమి లభ్యమవుతూ ఉంది. అట్లాగే శిథిలమైన అటవీభూములు కూడా ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో అవసరమయితే రాజధానీ నగర  నిర్మాణం కోసం అటవీ భూములను కూడా వాడుకోవడానికి అవకాశమిస్తామని కేంద్రప్రభుత్వం వాగ్దానం చేసింది. జాతీయ రహదారులకు, పోలవరం కాలువకు, ఎన్.ఎస్.పి. కాలువకు, విజయవాడ విమానాశ్రయానికి సమీపంగా వుండడం కూడా దీన్ని బలపరుస్తున్నాయి.

నవ్యాంధ్రప్రదేశ్‌కు కొత్తరాజధానీ స్థల ఎంపికలో తగిన స్థలాన్ని సూచించడానికి శివరామకృష్ణన్ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికకు ఇవ్వవలసిన ప్రాధాన్యాన్ని ఇవ్వకపోవడం కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పొరపాటు. తమ 'టెర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్'  దృష్ట్యా కమిటీ సిఫారసులు చేసింది. ఈ టెర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌తో పాటు కమిటీ '2013 భూసేకరణ చట్టా'న్ని కూడా దృష్టిలో పెట్టుకొని ఉంటుంది. ఈ చట్టాన్ని భారత పార్లమెంటు 2013లో ఆమోదించింది. సరిగ్గా ఈ కారణాల దృష్ట్యా విజయవాడ పరిసరాలలో సంపద్వంతమైన వ్యవసాయ భూములలో అనేక పంటలు పండించే ప్రదేశంలో ఒక పెద్ద హరితక్షేత్ర రాజధానీ నగరాన్ని ఈ కమిటీ సిఫారసు చేయలేదు.

నిపుణుల కమిటీ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తూ వివిధ క్షేత్రాలనుండి సూచనలను స్వీకరిస్తూ వున్న సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వం

పురపాలకశాఖామంత్రి శ్రీ కె. నారాయణ నేతృత్వంలో కొంతమంది ప్రజాప్రతినిధులు కొంతమంది పారిశ్రామికల వేత్తలతో మరో కమిటీని నియమించడం సముచితంగా లేదు. ఈ కమిటీ ఎటువంటి నివేదికను సమర్పించకపోవడం మరీ ఆశ్చర్యకరం. ముఖ్యమంత్రి ప్రస్తుత ప్రదేశంలో నదీతీరాన రాజధానిని నిర్మించాలని ముందుగానే తీసుకున్న నిర్ణయానికి కొంత విశ్వసనీయతను కల్పించడానికి ఒక యుక్తిమాత్రమే ఇది.

చండీగఢ్ లేదా నయా రాయపూర్ కొత్తరాజధానీ నగరాల నిర్మాణానికి కేవలం 20,000 ఎకరాల భూమిని మాత్రమే సేకరించారు. నయా రాయపూర్ విషయంలో చాలావరకు భూమిని రైతుల అంగీకారం మీద సేకరించారు. 1894 భూసేకరణ చట్టం ప్రకారం ఇవ్వవలసిన పరిహారంకంటే చాలా ఎక్కువ, మెరుగైన పరిహారాన్ని చెల్లించినందువల్ల రైతుల అంగీకారం లభించింది. ఇక చండీగఢ్ విషయంలో చాలావరకు అది ప్రభుత్వభూమి కాని అమరావతి విషయానికి వస్తే దాదాపు 15,000 ఎకరాల భూములు జరీబు భూములు. చాలా సారవంతమైనవి. దాదాపు నూరు రకాల పంటలు పండుతాయి. ముఖ్యంగా ఆహారపంటలు, పండ్లతోటలు, పూలతోటలు మొదలైనవి ఇక్కడ పెంచుతారు. వేలాది ఎకరాల మెట్టభూముల్లో అనేక ఎత్తిపోతల పథకాల ద్వారా ఏడాదికి ఒకటి లేదా రెండు పంటలు పండిస్తున్నారు. ఈ భూములపై వేలాదిమంది రైతులు, కవులు రైతులు, వ్యవసాయ కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. రాజధానికోసం దాదాపు 54,000 ఎకరాల భూమిని సేకరించడం రాష్ట్రప్రభుత్వం చేస్తున్న పెద్ద తప్పు.

ఇక్కడ భూమిలేని పేదల సగటు నెలవారీ సంపాదన ఒక్కొక్క కుటుంబానికి 15,000 వేల రూపాయలు వుండగా సి.ఆర్.డి.ఏ. వారికి నెలకు 2,500 మాత్రమే చెల్లించడం చాలా విచారకరం. వందలాది కుటుంబాలు ఉపాధి వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకి వలసపోవలసి వస్తున్నది.

జరీబు భూములను వరదమైదానాలు అని కూడా అంటారు. వీటిలో భూగర్భంలో సుమారు అరవై మిలియన్ క్యూబిక్ మీటర్ల తాగునీరు నిలువలుంటాయి. పది లక్షల మంది జనాభా తాగునీరు అవసరాలను ఈ నీరు తీర్చగలుగుతుంది. రాజధానీ నగర ప్రాంతంలో కృష్ణానదిమీద ఒక ఆనకట్ట కట్టడమో, రెండు మూడు చోట్ల తాగునీటి జలాశయాలు నిర్మించడమో – అదీ కొన్ని వందలకోట్ల ఖర్చుతో – పూర్తిగా అనవసరం.

ఎక్కువ ధరలు వస్తాయనో లేకపోతే రాజకీయ సామాజిక కారణాలవల్లో చాలామంది రైతులు దాదాపు 32,000 ఎకరాలను లాండ్ పూలింగ్ పథకం కింద ఇచ్చారు. ఈ భూములతో రాష్ట్రప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం అత్యంత దురదృష్టకరం. ప్రభుత్వం ప్రాథమిక ధరగా ఎకరానికి 4 కోట్ల రూపాయలు నిర్ణయించింది. ఇది ఆర్.బి.ఐ. వంటి కేంద్రప్రభుత్వ సంస్థలకు తదితరాలకు కేటాయించిన భూములకు నిశ్చయించిన ధర. అదే సమయంలో ప్రభుత్వం చాలా ఉదారంగా వందలాది ఎకరాల భూములను ప్రైవేటు విద్యాసంస్థలకు, వాణిజ్య సంస్థలకు ఎకరానికి 50 లక్షల ధరకు కేటాయిస్తూ ఉంది.

1691 ఎకరాల 'స్టార్ట్ అప్ ఏరియా' లో భూమిని చదరం చేయడం, రోడ్లు వేయడం, డ్రైనేజి, ఎలక్ట్రిసిటీ వంటి మౌళిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం సుమారు 5,500 కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నదన్న విషయం చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ఇది సింగపూరు కన్సార్టియంకు అప్పజెప్పారు. అందులో 42% వాటా పొందడానికి ప్రభుత్వం 221 కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టింది. సింగపూరు కన్సార్టియంకి కేవలం 306 రూపాయలు పెట్టుబడితో 58% వాటా ఇచ్చింది. కన్సార్టియంకు స్టార్ట్‌అప్ ఏరియా అభివృద్ధిని అప్పగించడానికి రాష్ట్రప్రభుత్వం ఎ.పి.ఐ.డి.ఇ.ఏ చట్టం 2001 నిబంధనలను సడలించింది. పైగా ఏదైనా వివాదం తలెత్తినట్లయితే దాన్ని లండన్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్‌లో పరిష్కరించుకోవాలన్నా నిబంధనకు లజ్జా రహితంగా అంగీకరించింది.

2050 నాటికి జనాభా 25 లక్షలకు చేరుకునే ప్రపంచ స్థాయి మహానగరాన్ని నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం ఉద్దేశిస్తున్నది. ఇది వాస్తవానికి చాలా దూరం. ఎందుకంటే 3 రాష్ట్రాలకి రాజధాని అయిన చండీగఢ్ నగరం 35 సంవత్సరాల తర్వాత కేవలం 10 లక్షలు మాత్రమే. గత ఎనిమిదేళ్లలో చత్తీస్‌గఢ్ రాజధాని నయా రాయపూర్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం కేవలం 600 కోట్ల రూపాయలు మాత్రమే ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ విషయంలో గవర్నర్ బంగళా, సచివాలయం శాసనసభ, హైకోర్టుల శాశ్వత భవన నిర్మాణం ఇంకా ప్రారంభం కాకముందే కేంద్ర ప్రభుత్వం 2500 కోట్ల రూపాయలు ఇచ్చింది. మరో వెయ్యి కోట్ల రూపాయలు వాగ్దానం చేసింది. జనవరి 2016లో పురపాలక శాఖామంత్రి శ్రీ కె. నారాయణ 26 ఎకరాలలో 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో తాత్కాలిక సచివాలయ భవనాన్ని 180 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మిస్తామని ప్రకటించాడు. మరీ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక సలహాదారు 'మౌలిక సదుపాయాలతో తాత్కాలిక సచివాలయం' నిర్మాణ ఖర్చు 1542 కోట్ల రూపాయలని చెప్పాడు. ఎటువంటి ఆర్థిక క్రమశిక్షణా రాహిత్యంతో రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుంటే గౌరవనీయ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరిక మేరకు ప్రపంచస్థాయి రాజధానీ నగరం అమరావతి నిర్మాణానికి ఎన్ని వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయో ఎవరైనా ఊహించుకోవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం రాజధానీ నగరంలో వ్యవసాయం, ఉద్యానవనాలు, పశుపోషణ, కోళ్లపరిశ్రమ, మత్స్యపరిశ్రమ, తదితర కార్యకలాపాలకు అవకాశమే లేదు. అది పూర్తిగా అర్బన్ కాంక్రీట్ జంగిల్. ఇంకా శాశ్వత ప్రభుత్వ భవనాల నిర్మాణం మొదలు కాలేదు కాబట్టి రాష్ట్రప్రభుత్వం కృష్ణా కుడిఒడ్డు పొడుగునా వున్న జరీబు భూములను 'స్పెషల్ ఆర్గానిక్ ఎగ్రికల్చరల్ ఎక్స్‌పోర్ట్ జోన్' గా ప్రకటించి కౌలు రైతులతో సహా రైతులందరికీ అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను పండించడానికి తోడ్పడాలి. ఇది వారికి అధిక

ఆదాయాన్ని ఇవ్వడమే కాక స్వీయ ఉపాధిని కూడా కల్పిస్తుంది. అప్పుడు మాత్రమే అమరావతీ రాజధానీ నగరాన్ని 'అమరావతి – ప్రజారాజధాని' అని పిలవవచ్చు.

ఈ పుస్తకం  చరిత్రను అధ్యయనం చేసేవారికే కాక సాధారణ ప్రజానీకానికి కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పుస్తకం తెలుగు అనువాదం కూడా త్వరలో వెలువడి ఆంధ్రప్రదేశ్‌లోని సామాజిక ప్రజానీకానికి రాజధాని అమరావతిని గురించిన ఎంతో సమాచారాన్ని అందిస్తుందని ఆకాంక్షిస్తున్నాను. ఈ పుస్తక రచనలో శ్రీ ఐ.వై.ఆర్. కృష్ణారావుగారి కృషిని నేను ఎంతో అభినందిస్తున్నాను.

**– వడ్డె శోభనాద్రీశ్వరరావు**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీమంత్రివర్యులు

# కృతజ్ఞతలు

గత ఆరు మాసాల నుండి నేను ఈ పుస్తక రచనకు సమాచారాన్ని సేకరిస్తూ వున్నాను. ఎ.ఎస్.సి.ఐ. (ASCI) లో సెంటర్ ఫర్ అర్బన్ గవర్నన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొ. వి. శ్రీనివాసాచారి గారి మార్గదర్శకత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఎమ్.సి.ఆర్.హెచ్.ఆర్.డి. డైరెక్టర్ జనరల్ బిపి ఆచార్య గారికి, సెంటర్ ఫర్ అర్బన్ డెవలప్‌మెంట్ స్టడీస్ అధ్యక్షులు డా. దీపా నాయర్ గారికి వారితో సంభాషణలలో ఇచ్చిన విలువైన సమాచారానికి గాను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అదే విధంగా సెస్ (Cess) ప్రొ. సి. రామచంద్రయ్య గారికి కృతజ్ఞతలు. ఉండవల్లి అరుణ్ కుమార్, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కె. రామచంద్రమూర్తి గార్లతో సంభాషణలు విషయ స్పష్టతకు నాకు తోడ్పడ్డాయి. వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

నాకు గురువు, శ్రేయోభిలాషి, బహుకాలంగా మార్గదర్శకుడు శ్రీ రాపాక ఏకాంబరాచార్యులు ఆంధ్రదేశపు రాజధానీ నగరాలను గురించిన చారిత్రక వివరాలపై ఒక వ్యాసాన్ని నాకందించారు. ఇది ఒక అధ్యయానికి ఆధారంగా ఉపయోగపడింది. వారికి నా మనఃపూర్వక కృతజ్ఞతలు.

ఈ పుస్తకానికి ముందు మాట రాసిన నా శ్రేయోభిలాషి నా సీనియర్ సహోద్యోగి శ్రీ ఇ.ఎ.ఎస్. శర్మగారికి కృతజ్ఞతలు. ఈ పుస్తకాన్ని అంకితం తీసుకొమ్మని, ఒక పరిచయం రాయమని నేను కోరిన వెంటనే అంగీకరించినందుకు శ్రీ వడ్డె శోభనాద్రీశ్వరరావుగారికి నా కృతజ్ఞతలు.

పవన్ కల్యాణ్‌తో నా పరిచయం మరీ ఇటీవలిది. ఆయన నిజాయతీ, సమాజానికి సేవచేయాలన్న తపన నన్ను చాలా ఆకర్షించాయి. ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడానికి ఆయన అంగీకరించడం నాకు గౌరవంగా భావిస్తాను.

చివరిగా  పదవీ విరమణ తర్వాత కూడా నాతో కలిసి పనిచేస్తూ ఈ పుస్తకం పూర్తిచేయడానికి తోడ్పడిన నా వ్యక్తిగత కార్యదర్శి శేషగిరికి కృతజ్ఞతలు.

**– ఐ.వై.ఆర్. కృష్ణారావు**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | ఉపోద్ఘాతం | 19 |
| 1. | అమరావతి ప్రదేశం | 23 |
| 2. | సైద్ధాంతిక నేపథ్యం | 28 |
| 3. | రాజధానీనగర నిర్మాణంలో అంతర్జాతీయ అనుభవం | 37 |
| 4. | భారతదేశం ప్రణాళికీకరించిన తొలి రాజధానులు | 47 |
| 5. | 21వ శతాబ్దపు రాజధానీనగరాలు | 54 |
| 6. | శతాబ్దాల కాల పరిణామంలో ఆంధ్రుల రాజధానీనగరాలు | 57 |
| 7. | శివరామకృష్ణన్ కమిషన్ – అమరావతి | 60 |
| 8. | తటస్థ రాజధానిగా దొనకొండ: విఫలమైన ప్రతిపాదన | 70 |
| 9. | రాజధానీనగరాలుగా కర్నూలు, అమరావతుల ఎంపికలో భేదం<br>దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడికీ,<br>వ్యూహాత్మక చాణక్యనాయకత్వానికీ ఉన్న భేదం | 75 |
| 10. | లాండ్ పూలింగ్ – అమరావతి | 82 |
| 11. | ప్రపంచ బాంకు – అమరావతి | 89 |
| 12. | స్విస్ ఛాలెంజి – సింగపూరు సంబంధం | 91 |
| 13. | అమరావతి – ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర నగరాలు | 95 |
| 14. | చైనా ఘోస్ట్ నగరాలు – నేర్చుకోవలసిన పాఠాలు | 97 |
| 15. | ముగింపు/ఉపసంహారం | 99 |
| | References | 108 |

# ఉపోద్ఘాతం

వలసపాలన రోజుల్లో రాజధానీనగరం రేవు పట్టణమై ఉండేది. దేశం లోతట్టు ప్రాంతాలనుండి వలసరాజ్యానికి ముడి సరకులు ఎగుమతి చేయడానికి, వాణిజ్యానికి ఇది అనుకూలంగా ఉంటుంది. బ్రిటిషువారి కాలంలో 1911 వరకు దేశ రాజధాని 'కలకత్తా'. తక్కిన సంపన్నమైన ప్రెసిడెన్సీలు 'బొంబాయి', 'మద్రాసు' ప్రెసిడెన్సీల రాజధానులు బొంబాయి, మద్రాసులు కూడా రేవు పట్టణాలే. ఆ నాడు మద్రాసు ప్రెసిడెన్సీ పెద్ద ప్రెసిడెన్సీ. ఈ ప్రెసిడెన్సీలలో భిన్నభాషలు మాట్లాడే ప్రాంతాలున్నాయి. మద్రాసు (చెన్న పట్టణమని కూడా అంటారు) నుండి పరిపాలింపబడే మద్రాసు ప్రెసిడెన్సీలో, తమిళుల తర్వాత బహుళసంఖ్యలో ఉన్న ప్రజలు తెలుగువారే. కన్నడం, మలయాళం మాట్లాడే ప్రజలు కూడా ఉండేవారు కాని, వారిసంఖ్య తమిళులు, తెలుగువారి కంటే తక్కువ. ముందుగా ఇంగ్లీషు భాష నేర్చుకొని, దాని సహాయంతో ప్రభుత్వోగాలు సంపాదించుకున్నవారు తమిళులు. ప్రభుత్వోద్యోగాలలో అధికభాగం వారి చేతుల్లోనే ఉండేవి. ఇది తక్కిన భాషలు మాట్లాడేవారికి, ముఖ్యంగా అధికసంఖ్యలో ఉన్న తెలుగువారికి బాధాకరంగా పరిణమించింది. భాషాపరంగా ప్రత్యేకరాష్ట్రం కోసం అన్వేషణకు నాయకత్వం వహించినవారు ఆంధ్రులు. జాతీయోద్యమకాలంలో ఇదొక బలమైన ఉద్యమం. జాతీయోద్యమంలో అదొక ప్రధానభాగం. ఆ సమయంలో తెలుగు మాట్లాడే ప్రజల్లో కొంత భాగం నిజాం పరిపాలనలో ఉన్న హైదరాబాదు రాజ్యంలో నివసించేవారు. హైదరాబాదు రాజ్యప్రజలు కూడా స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారు. క్రమంగా తెలుగు సెంటిమెంటు ప్రబలమై, హైదరాబాదు రాజ్యంలోని తెలుగు ప్రాంతాలు, మద్రాసు ప్రెసిడెన్సీలోని తెలుగు ప్రాంతాలు భాషాప్రాతిపదికన కలిసి, రాష్ట్రంగా ఏర్పడాలనే అభిలాష పెంపొందింది. 1948 లో పోలీస్ యాక్షన్ జరిగింది. హైదరాబాదు స్వతంత్రభారత సమాఖ్యలో ప్రత్యేక రాష్ట్రమయింది. తక్కిన

తెలుగువారు 1947 తర్వాత కూడా మద్రాసు ప్రెసిడెన్సీలోనే కొనసాగవలసి వచ్చింది. భాషా ప్రాతిపదికన ప్రత్యేకరాష్ట్ర ఆకాంక్ష ఆంధ్రులలో చాలా దృఢంగా ఉంది. కాని అదే సమయంలో మద్రాసు ప్రెసిడెన్సీలోని ఆంధ్రప్రాంతంలోని రెండు ప్రధానప్రాంతాలు కోస్తాంధ్ర, రాయలసీమల మధ్య అనుమానాలు కూడా ఉన్నాయి. రాయలసీమ అంటే దత్తమండలాలు. 1802 లో నిజాం బ్రిటిషువారితో చేసుకున్న సైన్యసహకార ఒప్పందంలో భాగంగా, ఈ జిల్లాలను నిజాం బ్రిటిషు వారికి దత్తం చేశాడు. ఆ విధంగా ఈ ప్రాంతానికి ఒక స్వీయ ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. నంద్యాల ఆంధ్రమహాసభ దత్తమండలాల ప్రత్యేకతను కొనసాగించడం కోసం 1928 లో రాయలసీమ అని నామకరణం చేసింది. విజయనగరసామ్రాజ్యంలో శ్రీకృష్ణదేవరాయల పాలనలో ఈ ప్రాంతం ప్రాముఖ్యం పొందింది. వాళ్ల భయమేమిటంటే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రంలో కోస్తా జనాభా ఎక్కువ కాబట్టి, ప్రబలం కాబట్టి తమ గుర్తింపు, ప్రయోజనాలకు సరైన రక్షణ ఉండదేమోనని. ప్రత్యేకరాష్ట్రం కోసం ఐక్యంగా పోరాడవలసిన అవసరం ఉంది కాబట్టి, ఆ నాటి రాయలసీమ, కోస్తా నాయకులు కలిసి శ్రీబాగ్ ఒడంబడిక అనే ఒప్పందం చేసుకున్నారు. ఆంధ్ర పత్రిక అధిపతి శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు గారి మద్రాసు (చెన్నై) ఇంట్లో 16.11.1937 న ఈ ఒడంబడిక జరిగింది. దీని మీద శ్రీయుతులు కె. కోటిరెడ్డి, కల్లూరి సుబ్బారావు, పప్పూరి రామాచార్యులు తదితరులు రాయల సీమ తరపున, శ్రీయుతులు భోగరాజు పట్టాభిసీతారామయ్య, కొండా వెంకటప్పయ్య, తదితరులు కోస్తాంధ్ర తరపున సంతకాలు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు రాజధాని రాయలసీమలోను, హై కోర్టు కోస్తాలోను ఉండాలన్నది ఈ ఒడంబడికలోని ప్రధానాంశం. ముఖ్యంగా అంగీకరించిన విషయమేమంటే విశ్వవిద్యాలయం, ప్రభుత్వ ముఖ్యకార్యాలయాలు, హై కోర్టు వేరు వేరు ప్రదేశాలలో ఉండడం మంచిదన్న అభిప్రాయం. ఆ విధంగా ముఖ్యమైన కార్యాలయాలన్నీ ఒకే చోట కేంద్రీకరింపకూడదన్న సూత్రం ఎనభయ్యేళ్ల తర్వాత శివరామకృష్ణన్ కమిటీ పునరుద్ఘాటించిన సూత్రం. ఈ ఒడంబడికపై ఆధారపడి ప్రత్యేకరాష్ట్రం కోసం ఆంధ్రులు ఐక్యపోరాటం సాగించారు. భాషాప్రయుక్త రాష్ట్రాలకు నెహ్రూ అంత అనుకూలంగా లేకపోయినప్పటికీ, పొట్టి శ్రీరాములు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష, ఆయన అమరుడైన వెంటనే చెలరేగిన హింసాత్మకనిరసనలు ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం ఏర్పాటును ప్రకటించడం తప్ప నెహ్రూకు మరో ప్రత్యామ్నాయం లేకపోయింది. ఆ విధంగా అక్టోబరు 1, 1953 న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. శ్రీబాగ్

ఒడంబడికలో అంగీకరించినట్లుగా రాజధాని కర్నూలుగా ప్రకాశం పంతులుగారి నాయకత్వంలోని ప్రభుత్వం 1-10-1953 నుండి పనిచేయడం ప్రారంభించింది. మద్రాసు ప్రెసిడెన్సీలోని ప్రజలతోపాటు హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగువారికి కూడా విశాలాంధ్ర ఒక దీర్ఘకాలస్వప్నం. 1-10-1953 నుండి తెలుగు మాట్లాడేవారి రెండు రాష్ట్రాలు ఒకటి హైదరాబాదు రాజధానిగా, మరొకటి కర్నూలు రాజధానిగా పనిచేయసాగాయి. తెలుగు మాట్లాడే ప్రజల కలను సాకారం చేసుకోవడానికి విశాలాంధ్ర నిర్మాణం కోసం ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అప్పటికి మద్రాసు ప్రెసిడెన్సీలోని ప్రజలకు ఇంగ్లీషు భాషతోనూ, ఆధునికవిద్యలోనూ నిజాం కింద ఉన్న తెలంగాణ ప్రజలకంటే ఎక్కువ పరిచయం ఏర్పడింది. అది తెలంగాణ ప్రజలలో భయసందేహాలకు కారణమయింది. ఉమ్మడి రాష్ట్రం తమ ప్రయోజనాలకు నష్టదాయకమవుతుందేమోనన్న అనుమానం వారిలో కలిగింది. ఈ భయాలు పోగొట్టడానికి 1956 లో పెద్ద మనుషుల ఒప్పందం జరిగింది. ఈ పెద్దమనుషుల ఒప్పందపు సూత్రాలపై ఆధారపడి హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగువారు, ఆంధ్రరాష్ట్రంతో కలిసి విశాలాంధ్ర ఏర్పడింది. హైదరాబాదు రాజధాని అయింది. హైదరాబాదు రాష్ట్రంలోని కన్నడం మాట్లాడే జిల్లాలు కర్ణాటకలోను, మరాఠీ మాట్లాడే జిల్లాలు బొంబాయి రాష్ట్రంలోను కలిసిపోయాయి. ఆ విధంగా 1-11-1956 న మూడు కోట్ల తెలుగువారితో భాషాప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది.

ఈ కలయిక నల్లేరుపై నడకగా సాగలేదు. అంత సంతోషాన్నీ కూర్చలేదు. సచివాలయం, హై కోర్టు హైదరాబాదులో ఉండడంతో, తెలంగాణేతర ప్రాంతంనుండి ప్రజలు భారీ సంఖ్యలో ఉద్యోగాలు వెత్కుకుంటూ హైదరాబాదుకు రావడం ప్రారంభమయింది. తెలంగాణ ప్రాంతంలో విద్యాస్థాయి తక్కువగా ఉండడం, ఇంగ్లీషు విద్యలో అంతగా పరిచయం ఉండకపోవడంతో ఆంధ్రప్రాంతం నుండి చాలామంది వచ్చి ఉపాధ్యాయ, వైద్య ఉద్యోగాలలో చేరడం, న్యాయవాదవృత్తి నవలంబించడం ప్రారంభమయింది. సచివాలయంలో ఉద్యోగాలు సరేసరి. పెద్దమనుషుల ఒప్పందంలో ఇచ్చిన రక్షణలు ఆచరణలో అటకెక్కాయి. స్థానికప్రజలలో ఇది అయిష్టాన్ని సృష్టించింది. క్రమంగా ఇది బలమైన ప్రత్యేకరాష్ట్ర ఉద్యమానికి దారితీసింది. 1969 లో తెలంగాణలో ప్రత్యేకరాష్ట్ర ఉద్యమం రాజుకుంది. 1972 లో సుప్రీం కోర్టు ముల్కీ నిబంధనలకు ఆమోదం తెల్పడంతో, ప్రత్యేకాంధ్ర రాష్ట్రోద్యమమొకటి ప్రారంభమైంది.  ఈ రెండు ఉద్యమాలూ సఫలం కాకపోవడానికి ప్రధానకారణం,

శ్రీమతి ఇందిరాగాంధీ దృఢవైఖరి. ఈ రెండు ప్రత్యేకరాష్ట్రోద్యమాల తీవ్రత, ప్రజల తీవ్ర ఆకాంక్షలను పరిగణనలోకి తీసికున్నప్పుడు, వాటి విజయం దాదాపు అనివార్యమన్న పరిస్థితిలో నాటి ప్రధాని దృఢవైఖరి రాష్ట్రవిభజన జరగకుండా అడ్డుకుంది. తరువాత ఒక కృత్రిమ ఐక్యత పైకి కనిపించినప్పటికి అంతర్గతంగా విభజన ఆకాంక్ష తెలంగాణలో కొనసాగుతూనే ఉంది. ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో కాంగ్రెసును ఓడించి ఎన్.టి. రామారావు అధికారంలోకి వచ్చాడు. కాని అంతర్గతంగా ఈ నినాదం ఆంధ్రులలో ఐకమత్య సాధనలో సఫలీకృతం కాలేదు. తెలంగాణ ప్రాంతం ప్రత్యేకరాష్ట్ర ఆకాంక్ష పునరుజ్జీవమై బలమైన నాయకుడి కోసం ఎదురుచూస్తూ ఉంది. ఈ లక్ష్యాన్ని కె. చంద్రశేఖరరావు చేపట్టి, ఒక దశాబ్దం పాటు ఉద్యమం నడిపించాడు. 2013 లో కాంగ్రెసు పార్టీ తన స్వీయ ఎన్నికల కారణాలతో సూత్రప్రాయంగా 30-07-2013 నాటి సిడబ్ల్యుసి తీర్మానంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిర్ణయం తీసికొంది. తదనుసారంగా అవసరమైన బిల్లును తయారుచేసి 01-03-2014 న పార్లమెంటులో ఆమోదింపజేశారు. రాష్ట్ర విభజనకు అపాయింటెడ్ తేదీగా 02-06-2014 ను నిర్ణయించారు. ఆ ప్రకారంగా పదేళ్లకు మించకుండా హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా రెండు రాష్ట్రాలేర్పడ్డాయి. పదేళ్ల తర్వాత హైదరాబాదు కేవలం తెలంగాణ రాష్ట్రరాజధాని అవుతుంది. చట్టంలోని సెక్షన్-6 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధానికి సంబంధించి వివిధ ప్రత్యామ్నాయాలను పరిశీలించడానికి ఒక నిపుణుల కమిటీ ఏర్పాటుకు అవకాశం కల్పించింది. కమిటీ ఆర్‌ఓఆర్ చట్టం చేసిన తేదీనుండి ఆరు నెలలలోగా తగిన సిఫారసులు చేయవలసి ఉంటుంది. హైదరాబాదును యూనియన్ టెరిటరీ చేసి, రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధానిగా ప్రకటించి ఉంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధానికోసం వెతకవలసిన అవసరమేర్పడేది కాదు. పునర్వ్యవస్థీకరణ చట్టం రాజధానీనగరం హైదరాబాదు పరిపాలన బాధ్యతను తెలంగాణ ప్రభుత్వానికి ఇస్తూ, గవర్నరుకు కొన్ని అసాధారణ అధికారాలను ఇచ్చింది. హైదరాబాదు 10 సంవత్సరాలు మాత్రమే ఉమ్మడి రాజధానిగా ఉంటుందనీ, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర రాజధానిగా మాత్రమే ఉంటుందని ప్రకటించింది. అందువల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధానికోసం అన్వేషణ, అసలు అపాయింటెడ్ డే 02-06-2014 కంటే ముందే ప్రారంభమయింది. ఇప్పుడు కాకపోయినా ఎప్పుడైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తనకు విడిగా రాజధానిని చూసుకోకతప్పదు, హైదరాబాదు వదిలి వెళ్లక తప్పదు.

# 1. అమరావతి ప్రదేశం

ఈ నేపథ్యంలోనే పార్లమెంటుకు, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు 2014 ఏప్రిల్, మే నెలల్లో ఎన్నికలు జరిగాయి. కేంద్రంలో బిజెపి, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెలంగాణ, మిగిలిన ఆంధ్రప్రదేశ్‌లుగా అపాయింటెడ్ డే 02-06-2014 న విభాజితమై ఉనికిలోకి వచ్చినప్పటికీ, 19 మంది మంత్రుల శ్రీ చంద్రబాబు నాయుడు మంత్రివర్గం జూన్ 8, 2014 న ప్రమాణస్వీకారం చేసింది. శుభముహూర్తంగా భావించిన ఆ రోజు గుంటూరులో నాగార్జున విశ్వవిద్యాలయానికి ఎదురుగా ఉన్న స్థలంలో, ప్రమాణస్వీకార మహోత్సవం బహిరంగసభలో జరిగింది. ఆ సమయంలో రాజధానీనగరం నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంతంలోనో, మంగళగిరి పోలీస్ బెటాలియన్ ప్రాంతంలోనో ఏర్పడుతుందని చెప్పుకున్నారు. మంత్రివర్గంలో శ్రీ నారాయణ కూడా ఉన్నారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ శాఖలు ఇవ్వబడిన నారాయణ, ముఖ్యమంత్రితోపాటు రాజధానీనగర స్థలనిర్ణయంలో కీలకపాత్ర వహించవలసి ఉంది. ఆయన శాసనసభలో కాని, శాసన మండలిలో కాని అప్పటికి సభ్యుడు కాదు. తరువాత 2014 ఆగస్టులో శాసనమండలికి ఎన్నికయ్యారు. ఎన్నికల సమయంలో శ్రీ చంద్రబాబు నాయుడితో పాటు తెలుగుదేశం పార్టీకోసం పనిచేసిన ఆంతరంగికవర్గంలో ఆయన కూడా ఒక భాగం.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం, భారతప్రభుత్వం శ్రీ శివరామకృష్ణన్ నేతృత్వంలో మరో నలుగురు సభ్యులతో రాజధాని నగరానికి తగిన చోటును సూచించడానికి ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ ఆగస్టు 31, 2014 వ తేదీలోపు తన నివేదికను సమర్పించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసిన వెనువెంటనే కొత్త రాజధానీనగరస్థలంపై దృష్టి

కేంద్రీకరించింది. రాజధానీనగరం ఎక్కడ ఉండాలన్న విషయంపై నిర్ణయం, పైకి కనిపించని తెలుగుదేశం పార్టీ థింక్ టాంక్ (మేధావివర్గం) ముందే తీసేసుకుంది. దానికి కావలసింది ఇప్పుడు ఆ నిర్ణయాన్ని ఆధికారికం చేయడానికి అవసరమైన ప్రక్రియలు మాత్రమే. ఈ ప్రభుత్వ కార్యకలాపాలన్నీ దాదాపు ఇటువంటివే. రాజధానీనగర నిర్మాణస్థలం ఎంపిక కోసం అన్వేషిస్తున్న శివరామకృష్ణన్ కమిటీ వంటి ప్రొఫెషనల్ బాడీ తమ ఉద్దేశానికనుగుణంగా పనిచేయదని తెలిసిన ముఖ్యమంత్రి, రాజధానీనగరస్థలం ఎంపిక కోసం వేరే ఒక కమిటీని నియమించుకోవడం మంచిదని భావించాడు. శివరామకృష్ణన్ కమిటీ ఆగస్టు 31, 2014 లోపునే తన నివేదికను సమర్పించవలసి ఉండగా జులై 21, 2014 న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రి నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ ఎం.పి.లు సుజనాచౌదరి, గల్లా జయదేవ్, తెలుగుదేశం పార్టీ కార్యకర్త బేద మస్తాన్‌రావు, స్థానిక పారిశ్రామికవేత్తలు సంజయ్ రెడ్డి, శ్రీనివాస్ శ్రీనిరాజు, ప్రభాకర్ రావులతో ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ పరిశీలించవలసిన అంశాలలో భూమి, నీళ్లు, విద్యుత్తు, రవాణా సౌకర్యాలను సమర్థంగా వినియోగించుకోవడం, గ్రీన్ టెక్నాలజీలు, గ్రీన్ స్పేస్‌లు నదీతీరంలో స్థిరమైన సంవర్ధవంతమైన అభివృద్ధి ఉన్నాయి. దీనితో శివరామకృష్ణన్ కమిటీకి ఇచ్చిన పరిశీలనాంశాలను పోల్చండి. శివరామకృష్ణన్ కమిటీ దృష్టి ప్రధానంగా ప్రస్తుతం ఉన్న వ్యావసాయికవ్యవస్థలకు భంగం కలగకుండా చూడడం, స్థానిక పర్యావరణాన్ని పరిరక్షించడం, నిర్మాణవ్యయాన్ని కనిష్ఠస్థాయిలో ఉంచడం, ప్రకృతి ఉత్పాతాల వల్ల కలిగే అవకాశాలున్న నష్టాల అంచనా. వీటని పోల్చి చూసినప్పుడు, శివరామకృష్ణన్ కమిటీ పరిశీలనాంశాలు ప్రత్యేకంగా రాజధానీనగరానికి స్థలం ఎంపికపై దృష్టి కేంద్రీకరిస్తే, మునిసపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రి నేతృత్వంలోని కమిటీ పరిశీలనాంశాలు అప్పటికే నిర్ణయించుకున్న స్థలం దృష్ట్యా భూమిని సమర్థంగా వినియోగించుకోవడం, జల, విద్యుత్ సరఫరా సౌకర్యాలు, గ్రీన్ టెక్నాలజీలు, వాటర్ ఫ్రంట్ వంటి వాటిపై కేంద్రీకరించాయి. వాటర్ ఫ్రంట్‌ను పేర్కొనడం నదీతీరంలో రాజధానీనగరనిర్మాణం జరగాలన్న నిర్ణయం అప్పటికే తీసికొన్న సూచన నిస్తుంది. ప్రభుత్వం మనస్సులో ఉన్నది కృష్ణానదీతీరం అని ఎవరైనా తేలికగా ఊహించగలరు.

రాష్ట్ర ప్రభుత్వానికి తమ సిఫారసులు ఇష్టం లేదనీ, రాష్ట్రప్రభుత్వం అప్పటికే రాజధానీనగరస్థల నిర్ణయం చేసేసిందనీ తెలుసుకోవడానికి శివరమకృష్ణన్ కమిటీకి ఎక్కువ సేపు పట్టలేదు. తమ కృషి అంతా వృథా అని తెలుసుకున్నారు. దీనికి

అదనంగా కమిటీకి సమాచారం అందించడం వంటి విషయాలలో రాష్ట్రప్రభుత్వం నుండి సహకార నిరాకరణ కూడా స్పష్టంగా కనిపిస్తూ ఉంది. ఈ విషయాన్ని కమిటీయే స్వయంగా పేర్కొంది. ఈ అననుకూల పరిస్థితులలోనే కమిటీ తన శక్తి మేరకు నివేదిక తయారుచేసింది. కమిటీ ప్రభుత్వం తనకిచ్చిన కాలవ్యవధిని పాటించింది. ఆగస్టు 31, 2014 లోపుననే తన నివేదికను సమర్పించింది. కమిటీ సిఫారసులపై విపులమైన చర్చ మరో అధ్యాయంలో చేద్దాం. ఈ ఔపచారిక కార్యక్రమం ముగియడం కోసమే ఎదురు చూస్తున్నట్లుగా, సెప్టెంబరు 1, 2014 న ఆం.ప్ర. మంత్రివర్గం సమావేశమై విజయవాడ చుట్టుపట్ల రాజధాని నిర్మాణాన్ని నిర్ణయించింది. గౌరవనీయ ముఖ్యమంత్రి అప్పుడు జరుగుతున్న శాసనసభ సమావేశాలను అవకాశంగా తీసికొని సెప్టెంబరు 4, 2014 న శాసనసభలో ప్రకటన చేశారు. రాజధానీనగరాన్ని విజయవాడ నగరం చుట్టుపక్కల నిర్మించాలని మంత్రివర్గం నిర్ణయించిందని చెప్తూ, పనిలోపనిగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో తాను చేపట్టనున్న వివిధ ప్రాజెక్టుల పట్టికను చదివారు. మూడు మెగా నగరాలు, 16 స్మార్ట్ సిటీలు నిర్మిస్తామని చెప్పారు. వ్యూహాత్మకంగా ప్రతిపక్ష అనుకూలతను సాధించినట్లు చేసి ముఖ్యమంత్రి ప్రకటనకు అనుకూలంగా ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదింపజేసుకున్నారు. శాసనసభలో ప్రకటన చేస్తూ ముఖ్యమంత్రి తనకనుకూలమైన అంశాల వరకు శివరామకృష్ణన్ కమిటీ నివేదికను పేర్కొన్నారు. కమిటీ పంపిన ప్రశ్నావళికి సమాధానం చెప్పిన ప్రజలలో ఎక్కువమంది రాజధాని విజయవాడ – గుంటూరు ప్రాంతంలో ఉంటే బావుంటుందన్నారన్నది వీటిలో ఒకటి. పూర్తి నివేదికను, ముఖ్యమైన కమిటీ సిఫారసులను పరిగణనలోనికి తీసికోకుండా, ప్రభుత్వం రాజధాని స్థలానికి విజయవాడ ప్రాంత అభ్యర్థిత్వాన్ని బలపరచడానికి పనికివచ్చే భాగాన్ని మాత్రమే తీసికొంది. శాసనసభ తీర్మానాన్ని సాధనంగా చేసికొని ముఖ్యమంత్రి – ఎన్నికల కంటే ముందే నిర్ణయం జరిగిన ప్రాంతంలో రాజధాని ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఈ నిర్ణయం ముందే తెలిసిన అస్మదీయులు, ఈ ప్రాంతంలో గణనీయంగా రియల్ ఎస్టేట్, వాణిజ్య ఆసక్తిని నిర్మించేశారు – ముందుకు వెళ్లి రాజధానీనగరం కృష్ణానది దక్షిణతీరంలో 21 గ్రామాలతో కూడిన మూడు మండలాలలో ఉంటుందనీ, లాండ్ పూలింగ్ విధానం ద్వారా భూయజమానుల నుండి భూసేకరణ జరుగుతుందని ప్రకటించివేశారు. ఆ విధంగా ముందుగా అనుకూలతను అధ్యయనం చేయకుండానే, సర్వే చేయకుండానే రాజధాని స్థలాన్ని నిర్ధారణ చేసిన ప్రాంతంగా అమరావతి చరిత్ర

కెక్కింది. భారతప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ వికేంద్రీకరణ పద్ధతిని సూచించింది. నాలుగు భౌగోళిక ప్రాంతాలను సిఫారసు చేసింది. కాని వాటిలో అమరావతి ప్రాంతం లేదు. పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నేతృత్వంలోని కమిటీకి ఇచ్చిన పరిశీలనాంశాలు నగరనిర్మాణస్థలాన్ని ఎంపిక చేయడం కాక, నిర్ణయించుకున్న స్థలంలో ఒక నగరానికి ప్రణాళిక రచించడానికి అనుగుణమైనవి. ఏది ఏమైనా ఈ కమిటీ ఏ విధమైన సిఫారసూ చేసినట్లు లేదు, అటువంటి నివేదిక ఏదీ ప్రజలకోసం బహిరంగపరచలేదు. దీనికి భిన్నంగా నయారాయపూర్‌ను రాజధానిగా నిర్ణయించిన సందర్భంలో 11 అంతర్జాతీయ కంపెనీలకు స్థలాన్ని ఎంపిక చేసే పనిని అప్పగించినప్పుడు, ముప్పైమూడు ప్రమాణాలు నిర్దేశించడం జరిగింది. రాయపూరు చుట్టుపక్కల ప్రాంతంలో అత్యంత అనుకూలమైన స్థలాన్ని నయారాయపూర్ కోసం సూచించవలసిందిగా కోరడం జరిగింది. పదకొండు కంపెనీలలో తొమ్మిది ప్రస్తుత నయారాయపూర్ స్థలాన్ని సూచించాయి. ఆ విధంగా స్థలనిర్ణయం జరిగింది. ఆ సమయంలో నయారాయపూర్ అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ బైజేంద్ర కుమార్ నాకు ఈ విషయం తెలిపారు. దీన్ని అమరావతి స్థలనిర్ణయంతో పోల్చి చూడండి. అదే విధంగా ప్రస్తుత రాజధాని టోక్యో నగరానికి భిన్నంగా కొత్త రాజధాని నిర్మించాలని తలపెట్టినప్పుడు, ముప్పై సదస్సులలో తీవ్రంగా చర్చించడం జరిగింది. పదహారు ప్రమాణాలు ఆధారంగా మూడు స్థలాలను ఎంపిక చేశారు. కాని అమరావతి ఎంపికలో ఎటువంటి సర్వే, అధ్యయనమూ జరగలేదు. ఆ విధంగా ఎటువంటి అధ్యయనమూ, యోగ్యతా నివేదికా లేకుండా నిర్ణయించిన రాజధాని స్థలం భూమి విలువ దృష్ట్యాకాని, రాజధాని నిర్మాణానికి అనుకూల్య విషయంలో కాని ఎంత మాత్రమూ తగిన స్థలం కాదు. పైగా ఇది వరదలకు అవకాశం ఉన్న చోటు, బహుళ పంటలు పండే సాగుభూమి.

చట్టం ద్వారా రాజధానీప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసి, అవసరమైన భూమిని అంగీకారం, కోఆప్షన్, మోసం, బలాత్కారపద్ధతుల ద్వారా సేకరించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం 2015 మధ్య నాటికి కొత్త రాజధానీనగరానికి శంకుస్థాపనకు సిద్ధమయింది. చరిత్రలో నిలిచిపోయే ఒక మహాసందర్భంగా ప్రజలు గుర్తుంచుకొనేటట్లు ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించాలని చంద్రబాబు నాయుడు తలపెట్టారు. దానికి అనుగుణంగా దసరా సమయంలో అక్టోబరు 22, 2015 విజయదశమినాడు గౌరవనీయ ప్రధానమంత్రి ముఖ్యఅతిథిగా శంకుస్థాపన

కార్యక్రమం నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ముందు దేశంలోని నదుల నుండి నీళ్లు, రాష్ట్రంలోని విభిన్నప్రాంతాల నుండి మట్టి తెప్పించారు. ఈ బ్రహ్మాండమైన శంకుస్థాపన మహోత్సవానికి సింగపూరు వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి ఈశ్వరన్, జపాన్ ఆర్థికవ్యవస్థ, వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి యోసుకె టాకగి సూకి, తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు, పలువురు కేంద్రమంత్రులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర నూతనరాజధాని కోసం భారీ ఆర్థికసహాయం ఈ సందర్భంలో ప్రకటిస్తాడని రాష్ట్ర ప్రభుత్వం ఆశించినా, భారత ప్రధాని అటువంటి వాగ్దానమేమీ చేయలేదు కాని, తన వంతు సహాయానికి చిహ్నంగా యమునానదీ జలాన్ని, పార్లమెంటు మట్టిని తెచ్చాడు.

ఆంధ్రప్రదేశ్ ప్రజల నూతన రాజధానిగా అమరావతి ప్రస్థానం ఆ విధంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి అభిప్రాయంలో అది ప్రజారాజధాని, మరికొందరి దృష్టిలో కేవలం భ్రాంతి మాత్రమే అయిన భ్రమరావతి. తరువాతి అధ్యాయాలలో రాజధానీనగర స్థలాల ఎంపికలో స్థూలంగా సైద్ధాంతిక విధివిధానాలు, రాజధానీనగరస్థలాల ఎంపికలో అంతర్జాతీయ, జాతీయ అనుభవాలను, రాజధానీనగరం అమరావతికి ప్రత్యేకమైన సమస్యలను, ప్రజల ఆకాంక్షల దృష్ట్యా సరిగ్గా అమరావతి స్థానాన్ని, స్వాతంత్ర్యానంతరం ఆంధ్రప్రదేశ్ చరిత్రను, ఆంధ్రుల రాజధానిగా రాబోయే సుదీర్ఘ భవిష్యత్తులో అమరావతి ఎంతవరకు నిలవగలుగుతుందనే విషయాలను చర్చిద్దాం.

# 2. సైద్ధాంతిక నేపథ్యం

'**కా**పిటల్ సిటీస్ వెరైటీస్ అండ్ పాటర్న్స్ అఫ్ డెవలప్‌మెంట్ అండ్ రీలొకేషన్' అన్న తన గ్రంథంలో వాదిమ్ రాస్‌మన్ రాజధానీనగరాల స్థలాల సైద్ధాంతిక నేపథ్యాన్ని విపులంగా చర్చించాడు. అతని అభిప్రాయంలో ఏ రాజధానీనగరానికి స్థల నిర్ణయం చేయాలన్నా ఉండవలసిన ప్రాథమిక ఆలోచనావిషయాలు, ప్రామాణిక సూత్రాలు కొన్ని ఉన్నాయి. వాటిలో రాజ్యభద్రత, ఆర్థిక, పరిపాలనాపరమైన ప్రభావశీలత, నిష్పాక్షికత, గుర్తింపు ఉన్నాయి. ఒక రాష్ట్ర రాజధాని ఎక్కడ ఉండాలన్న విషయంలో భద్రత అంత ఆవశ్యకమైన లక్షణం కాకపోవచ్చు. కాని తక్కిన మూడూ నిష్పాక్షిత, గుర్తింపు, పరిపాలనా సౌలభ్యం అన్నవి ముఖ్యమే. రాజధాని ఎంపికలో నిష్పాక్షికత లేనప్పుడు ప్రభుత్వానికి విశ్వసనీయత ఉండదు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలకు రాజధానిలో సరైన ప్రాతినిధ్యం ఉందా? రాజధానిలో వారు తమకు ఉనికి ఉందని భావిస్తున్నారా? రాజధాని నుండి వచ్చే ప్రయోజనాలు ఆ రాజధాని అన్ని ప్రాంతాలనూ ఎంత కలుపుకొని ఉందన్న విషయాన్ని నిర్ధారిస్తాయి. ఈ నిష్పాక్షికత, అందరినీ కలుపుకోవడం అన్న సూత్రం ప్రభుత్వానికి న్యాయసమ్మతిని ఇస్తుంది. అది లేకపోతే ప్రభుత్వ న్యాయసమ్మతి పోతుంది లేదా తగ్గుతుంది. అతని అభిప్రాయంలో రాజధానీనగరాన్ని ఎంపిక చేసుకోవడానికి సహజస్థలాలేమీ లేవు, ఎవరైనా భిన్న ప్రత్యామ్నాయాలనుండి ఎంపిక చేసుకోవలసిందే. రాజధానీనగర అభివృద్ధి వాస్తవానికి దేశనిర్మాణ ప్రక్రియయే. అతని అభిప్రాయంలో రాజధానీనగరపు ప్రధానలక్ష్యం దేశం లేదా రాష్ట్రం తనను తాను దర్శించుకోవడంలో తోడ్పడడం, దేశం లేదా రాష్ట్రాన్ని తక్కిన ప్రపంచానికి, దేశాలకు దర్శనీయం చేయడం, దేశం లేదా రాష్ట్రానికి ఒక ఐక్యతాకేంద్రం లేదా సమ్మేళనకేంద్రం కావడం.

అతని అభిప్రాయంలో అతి పెద్ద రాజధానీనగరం దేశ రాజకీయ పాలనా వ్యవస్థ అవినీతిమయమన్నదానికి సూచన. అటువంటి రాజధానీనగరాలు దేశ వనరులన్నిటినీ తామే ఉపయోగించుకొని, దేశ లేదా రాష్ట్రం సమగ్రాభివృద్ధిని కుంటుపరుస్తాయి.

రాజధానీనగరం ఒక సమైక్యతాబాధ్యతను నిర్వహించగలదు. అది తాత్కాలికంగా దేశం లేదా రాష్ట్రంలోని విభిన్నశక్తులు, ఆసక్తులకు సమతులన బిందువుగా అవుతుంది. ముఖ్యంగా రాజధానీనగరం ఉండే ప్రదేశమే పోటీపడుతున్న ఆసక్తుల సర్దుబాటు ఫలితం. దాని వాస్తులో చక్కగా ప్రతిఫలించే ప్రతీకాత్మక కార్యవిధిని కూడా నిర్వహిస్తుంది. అది వాస్తవానికి రాష్ట్రానికి హృదయంగానూ, ఆత్మగానూ పనిచేస్తుంది.

రాజధానీనగరాల మూలాన్ని రెండు విధాలుగా వర్గీకరించవచ్చు. ఒకటి ఉన్న నగరాలే రాజధానులుగా రూపొందడం. రెండు ప్రణాళికీకరించిన రాజధానులు. పారిస్, లండన్, టోక్యో మొదలైనవి రాజధానీనగరాలుగా రూపొందినవి. దీనికి భిన్నంగా ఒక ప్రణాళిక ప్రకారం ఒక ప్రత్యేకప్రయోజనం కోసం రాజధానులను రూపొందించుకోవడం. వాషింగ్టన్ డి.సి., న్యూ ఢిల్లీ, కేన్‌బెర్రా ఈ వర్గంలోకి వస్తాయి.

ప్రాదేశికవ్యాప్త రాజధానీనగరాలను కేంద్రీకృతరాజధానులు, విభాజిత రాజధానీనగరాలని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. విభాజిత రాజధానీనగరాలలో భిన్ననగరాలలో అధ్యక్ష సచివాలయం, న్యాయస్థానాలు భిన్ననగరాలకు పంపిణీ చేస్తాయి. ఈ విభాజిత రాజధానీనగరాల వ్యవస్థ అనేకదేశాలలో ఉంది. వాటిలో ముఖ్యమైనవి దక్షిణాఫ్రికా, రష్యా, జర్మనీ. కాలపరంగా విభాజిత రాజధానులు కూడా ఉంటాయి. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో రాజధాని శ్రీనగర్, జమ్మూల మధ్య ఋతువులమీద ఆధారపడి మారుతూ ఉంటుంది.

చివరిగా ఒక శాశ్వతరాజధాని ఏర్పడే లోపు అనేక తాత్కాలికరాజధానులుండడం కూడా అసాధారణమేమీ కాదు. జపాన్ రాజధాని క్యోటోకు మారడానికి ముందు ఇరవై మధ్యంతర రాజధానులున్నాయి. అమెరికా సంయుక్తరాష్ట్రాలలో కూడా బహునగరాలు తాత్కాలికరాజధానులుగా వ్యవహరించాయి. చివరిగా ఫిలడెల్ఫియా నుండి వాషింగ్టన్ డి.సి.కి రాజధాని మారింది.

కేంద్రీకృత పరిపాలనావిధానం ఆధారంగా రాస్మన్ హార్డ్ కాపిటల్స్, సాఫ్ట్ కాపిటల్స్ అని ఒక విభాగం చేశాడు. హార్డ్ కాపిటల్ లక్షణం పెద్ద కేంద్రీకృత

ప్రభుత్వాధికారాన్ని సూచిస్తుంది. సాఫ్ట్ కాపిటల్ పొంకంగా ఉంటుంది. హార్డ్ కాపిటల్స్ దేశం లేదా రాష్ట్రంలో ఇతరనగరాల అభివృద్ధిని కుంటుపరిచే ధోరణిలో ఉంటాయి. దానికి కారణం అన్ని పెట్టుబడులనూ, సౌకర్యాలనూ ఆకర్షించే తేనె కుండ అది. దీనికి భిన్నంగా సాఫ్ట్ కాపిటల్ అన్నిటినీ తనవైపే లాక్కోవాలన్నట్లుండదు. దేశం లేదా రాష్ట్రంలోని ఇతరనగరాల అభివృద్ధికి ఆటంకం కాదు. ఈ కారణంగానే ఇటలీలో రాజధానిపై చర్చ వచ్చినప్పుడు రాజకీయనాయకులు రాజధానికి హార్డ్ కాపిటల్ నమూనాను తిరస్కరించారు. మాకు పారిస్, లండన్‌లాగా అవసరానికి మించి భారమైన రాజధాని వద్దన్నారు.

రాస్మన్ ప్రాచీన కాలపు రాజధానులను కూడా రెండు వర్గాలుగా విభజించాడు. ఒక రకం రాజధానులు మతపరంగా పవిత్రమైన పుణ్యక్షేత్రాలు. మతపరంగా ముఖ్యమైనవి. మచ్చుపిచ్చు(పెరూ), పెర్సిపోలిస్ (పర్షియా), జెరూసలేం లాంటివి. రెండోరకం రాజరిక రాజధానులు, రాజు లేదా చక్రవర్తితో అవినాభావసంబంధం కలిగి ఉంటాయి. స్పెయిన్‌లోని టొలెడో, ఫ్రాన్స్‌లోని ఫోంటెయిన్‌బ్లూ, పోలాండ్‌లోని క్రాకో వీటికి ఉదాహరణలు.

ఫ్రెంచి తత్త్వవేత్త రూసో ప్రకారం అసలు రాజధానీనగరాలుండడమే తక్కిన జనాభాకు, ప్రభుత్వానికీ భారం. విపరీతంగా పెరిగి పతనానికి, శైథిల్యానికి గొప్ప కారణాలంటాడు రూసో.

నార్వేకి చెందిన సమాజ శాస్త్రవేత్త స్టెయిన్ రోకెన్ ఏక శీర్షక పట్టణనిర్మాణానికీ, బహుశీర్షక పట్టణనిర్మాణానికీ భేదం చెప్పాడు. మొదటి దానిలో దేశ నగరాల నిర్మాణంలో రాజధానీనగరం ప్రాబల్యం వహిస్తుంది. రెండో దానిలో అది తక్కిన పట్టణాల అభివృద్ధికి తావిస్తుంది. నగరాలు దట్టంగా ఉన్న ప్రాంతంలో రాజధానీనగరానికి తక్కువ పాత్ర ఉంటుంది. ఇక్కడ బహుశీర్షక పట్టణనిర్మాణం ఏర్పడుతుంది. అదే విధంగా నగరాలు పలచగా ఉన్న ప్రాంతంలో రాజధానీనగరానికి ఎక్కువ పాత్ర ఉంటుంది.

రాజధానీనగరాలను ఎక్కడ ఏర్పరచాలో, వాటిని మార్చే సమయంలో ఎటువంటి వ్యూహాలు అవలంబించాలో వాదిమ్ రాస్మన్ చర్చించాడు. రాజధానీనగరాన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయంలో అతను ఆరు వ్యూహాలను సూచించాడు.

స్థలం సర్దుబాటు వ్యూహం, చారిత్రిక సమైక్యతా వ్యూహం, భౌగోళిక రాజకీయ పునఃస్థాపన వ్యూహం, ఆర్థిక సమైక్యతా వ్యూహం భూభాగాల సమైక్యతా వ్యూహం, వికేంద్రీకరణ వ్యూహం.

## స్థలంసర్దుబాటు వ్యూహం (Spacial Compromise)

రెండు సమానమైన బలం కలిగిన ప్రాంతాలు కలుసుకునేటప్పుడు ఈ వ్యూహాన్ని అవలంబిస్తారు. ఇటువంటి సందర్భంలో రాజధానీనగరానికి ఉత్తమమైన చోటు ఆ రెండు ప్రాంతాలకూ సరిహద్దు ప్రాంతంలో ఉన్న తటస్థప్రదేశం. ఇటువంటి ప్రయోజనంతో రాజధానీనగరాల ఎంపిక ప్రాచీనకాలం నుండీ జరుగుతూ ఉన్నదే. ఉదాహరణకు ప్రాచీన ఈజిప్టులో రాజధానీనగరం మెంఫిస్, దిగువ ఎగువ ఈజిప్టులకు మధ్యలో ఉంది. ఆ రెండు ప్రాంతాలకూ సమతులంగా ఉందని చెప్తారు. అలాగే వాషింగ్టన్ డిసి చారిత్రకంగా అమెరికా ఉత్తర – దక్షిణ ప్రాంతాల మధ్య ఉన్న ఒక సర్దుబాటు రాజధానీనగరం. ఒటావా కెనడాలో ఇంగ్లీషు మాట్లాడే ప్రజలకు, ఫ్రెంచ్ మాట్లాడే ప్రజలకు మధ్య సర్దుబాటుగా ఉన్న నగరం. అలాగే నైజీరియాలోని అబూజా, ఉత్తరాన ఉన్న ముస్లిములకు, దక్షిణాన ఉన్న క్రైస్తవులకూ మధ్య రాజకీయంగా తటస్థప్రాంతం.

భిన్నప్రాంతాలలో పంపకంగా ఉన్న రాజధానీనగరం కూడా ఒక సర్దుబాటు ప్రక్రియే. రెండు మూడు లేదా అంతకంటే ఎక్కువ శక్తిమంతమైన కేంద్రాలు ఒక రాష్ట్రంలో ఉన్నప్పుడు, ప్రభుత్వవిధులు భిన్ననగరాలలో జరిగేటట్లు చేస్తుంది ఈ ప్రక్రియ. దీనికి సౌత్ ఆఫ్రికా మంచి ఉదాహరణ. ప్రభుత్వం ప్రిటోరియా నుండి పనిచేస్తుంది. పార్లమెంటు కేప్‌టౌన్‌లో ఉంటుంది. న్యాయస్థానం బ్లూమ్ ఫౌంటేన్‌లో ఉంటుంది. పలు ప్రాంతాల్లో పంపకం జరిగిన రాజధాని, స్థలం సర్దుబాటు జరిగిన రాజధాని – ఈ రెండూ రాజధాని స్థలం విషయంలో ఒక సర్దుబాటుకు వచ్చే పద్ధతులు. రాస్మన్ అభిప్రాయంలో పంపకపు రాజధాని కంటే స్థలం సర్దుబాటే ఉత్తమం.

## చారిత్రక సమైక్యతవ్యూహం

ఇటీవలే వలసపాలన నుండి స్వాతంత్ర్యం పొందిన దేశాలు తమ రాజధానీనగరాన్ని తమ చారిత్రకకేంద్రాలలో ఒకదానిలో స్థాపించుకుంటాయి. ముఖ్యంగా తమ నివాసభూమి నుండి సుదీర్ఘకాలంపాటు విడదీయబడిన దేశాల

విషయంలో ఇది ఎక్కువగా జరుగుతుంది. చారిత్రక సమైక్యంతో అనుబంధించిన రాజధానీనగరాలకు ఉదాహరణలుగా ఏథెన్స్, రోమ్, జెరూసలేమ్ లను చెప్పవచ్చు. ఇటువంటి రాజధానీనగరాలు తమ జాతీయస్మృతిని దృఢపరచుకోవడానికీ, ప్రజలు తమ గతంతో పునఃసంధానించుకోవడానికీ ఉపయోగపడతాయి.

## భౌగోళిక రాజకీయ పునఃస్థాపన వ్యూహం (Geopolitical Repositioning)

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక, రాజకీయ, అధికార కేంద్రాలకు సమీపంలో రాజధానీనగరస్థలాన్ని నిర్ణయిస్తారు. దీని ప్రణాళికీకరణ బాహ్యాముఖీనం. బ్రిటిష్ భూగోళ శాస్త్రజ్ఞుడు ఆస్కర్ స్పేట్ దీన్ని 'హెడ్ లింక్ కేపిటల్' అన్నాడు. సూర్యకాంత పుష్పం సూర్యుడు ఏ వైపు ఉంటే ఆ వైపు తన ముఖం తిప్పినట్లుగా, ఈ రాజధాని, అత్యంతకీలకమైన ప్రదేశం వైపు ముఖం పెడుతుంది. ఉదాహరణకు రష్యాలో సెయింట్ పీటర్స్‌బర్గ్. ఇది యూరప్ వైపునకు ఒక త్రోవగా పనికివస్తుందని ఎంపిక చేసుకున్నారు. జపాన్‌లో రాజధాని నగరాన్ని క్యోటో నుండి టోక్యోకు మార్చడం దేశం ఆధునీకరణకు తోడ్పడింది. లాటిన్ అమెరికాలో కూడా కొన్ని ఉదాహరణలున్నాయి. అర్జెంటీనా, పెరూలలో రాజధానీనగరస్థలం ఎంపిక బాహ్యాముఖ కేంద్రీకరణ మీదే ఆధారపడి జరిగింది.

## ఆర్థిక సమైక్యతా, పునస్సమతుల్యతా వ్యూహం (Economic Integration and Rebalancing)

ఈ వ్యూహాన్ని పురోగమన చోదక రాజధానుల వ్యూహం అని కూడా అంటారు. ఒక రాష్ట్రం లేదా దేశంలో భిన్నప్రాంతాలు భిన్న అభివృద్ధి స్థాయిల్లో ఉన్నప్పుడు, వాటి అభివృద్ధిలో అంతరాలు ఉండి, ప్రాంతాలమధ్య అపనమ్మకం ఏర్పడి విడిపోవాలనే డిమాండుకు దారి తీసినప్పుడు ఈ వ్యూహాన్ని అవలంబించాలి. ఇటువంటి పరిస్థితులలో ఉద్దేశపూర్వకంగానే రాజధానీనగరాన్ని అతి తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతంలో నిర్ణయిస్తారు. ఆ నిర్దిష్ట ప్రాంతంలో అభివృద్ధికి ఇది తోడ్పడుతుంది. ఇటువంటి కేసుల్లో రాజధానీనగరాన్ని అక్కడ ఏర్పాటు చేయడమే ఆ ప్రాంత అభివృద్ధికి ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. ఈ సూత్రం మీద ఆధారపడి రాజధానీనగరాల ఏర్పాటుకు అనేక ఉదాహరణలున్నాయి. బ్రెజిల్ కేపిటల్‌గా బ్రెసీలియా ఎంపిక ఒక ఉదాహరణ. అట్లాగే కజకిస్తాన్ రాజధానిని మార్చడం కూడా ఈ వ్యూహాన్ని అనుసరించే జరిగింది.

1953 లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు కర్నూలును రాజధానిగా నిర్ణయించడం కూడా ఈ సూత్రం ఆధారంగానే జరిగింది.

## వికేంద్రీకరణ వ్యూహం

రాజధానీనగరం ఒక పెద్ద నగరంలో ఏర్పడినప్పుడు నగరం ఇరుకవుతుంది. మౌలికసదుపాయాల కొరత ఏర్పడుతుంది. ఇటువంటి సందర్భంలో ఆ మహానగరానికి సమీపంలో రాజధానీనగరాన్ని పునఃస్థాపించవచ్చు. అది మహానగరానికి సమీపంలోనే ఉన్నప్పటికీ విడిగా దూరంగా ఉంటుంది. ప్రాంతీయ అంతరాలు ప్రధానసమస్య కానప్పుడు నూతన రాజధానీనగరం ప్రస్తుతరాజధానికి చాలా దూరంగా ఉండవలసిన అవసరం లేదు. ప్రస్తుతరాజధానికి సమీపంలో ఒక పరిపాలనపరమైన రాజధానిని నిర్మించుకోవచ్చు. మలేషియాలో పుత్రజయ, గుజరాత్‌లో గాంధీనగర్ ఇటువంటివి. ప్రస్తుత రాజధానీనగరపు ఇరుకుతనాన్ని తొలగించుకోవడం కోసం కొత్త రాజధానిని ఏర్పరచుకోవచ్చు.

పైన చెప్పిన విషయాలు ఒక రాజధాని స్థలాన్ని ఎంపిక చేసుకోవడానికి కాని, రాజధానిని మరొకచోటికి మార్చడానికి కాని అనుకూలమైన వ్యూహాలు. అయితే రాజధాని స్థలంలో మార్పుకు అనుకూలమైన వ్యూహాన్నికాక, నకారాత్మక ప్రమాణాలను (negative factors) కూడా ఉపయోగించిన సందర్భాలున్నాయి. కొన్నిటినుండి వేరుచేయడానికి ఉపయోగించే సూత్రాలివి. ముఖ్యంగా రాజధానీనగరాన్ని తమకు విధేయంగా ఉన్న ప్రాంతాలకూ, లేదా ప్రస్తుతం ఉన్న నగరం నుండి దూరంగా మార్చడానికి ప్రధాన కారణం నిరసన ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం. సాధారణంగా రాజధానీనగరాలు నిరసన ఆందోళనలకు జన్మస్థలాలు. అటువంటి నిరసన ఆందోళనలకూ, రాజధాని ఉన్న మహానగరపు అలజడులకూ రాజధానిని దూరంగా తీసికొని వెళతారు. బర్మాలో రాజధానీనగరాన్ని తరలించడానికి ఇది ఒక కారణం. అదే విధంగా పాకిస్తాన్‌కు కరాచీ రాజధానిగా ఉన్నంతకాలం నిరంతరం ఆందోళనలు చెలరేగుతుండేవి. పాకిస్తాన్ రాజధానిని కరాచీ నుండి తరలించడానికి ఇది ప్రధానకారణం.

ప్రత్యేకించిన రాజధానీనగరాన్ని స్థాపించడానికి మరొక ప్రధానకారణం స్వజాతి పక్షపాతం, స్వీయ తెగతో ఏకీభావం. ఈ సందర్భాలలో పాలకవర్గం రాజధానిని తమ స్వజాతి లేక వర్గం ప్రబలంగా ఉన్న ప్రాంతంలో ఏర్పరస్తుంది. తన తెగ లేదా జాతి

విధేయతను దృఢపరచుకోవడానికి ఇదొక అవకాశం. ఇటువంటి సందర్భాలలో రాజధాని స్థలనిర్ణయం అందరినీ కలుపుకొనిపోవడం, భిన్నజాతివర్గాల ఏకీకరణం, భిన్న ప్రయోజనాల మీద ఆధారపడి ఉండదు. అది ఒక ప్రత్యేకవర్గానికి ప్రయోజనాలు చేకూర్చేదిగా ఉంటుంది. వాదిం రాస్‌మన్ ప్రకారం ఇటువంటి రాజధానీనగరాలు బలహీనమైనవి. ఆ రాజధానీనగరాన్ని బలపరిచే రాజవంశంపై కానీ, వ్యక్తిపై కానీ దాని అభివృద్ధి, అస్తిత్వం ఆధారపడి ఉంటాయి.

ప్రత్యేకించిన రాజధానీనగరాలకు, విస్థాపిత రాజధానీనగరాలకు చాలా పోలికలున్నాయి. ఈ మాటను వాడుకలోకి తెచ్చినవాడు అమెరికన్ పురాతత్త్వశాస్త్రవేత్త అలెగ్జాండర్ హెచ్ జోఫ్. విస్థాపిత (disembedded) రాజధాని అంతర్గత ముఠా ఘర్షణల్లో పోటీపరమైన ఆధిక్యాన్ని సంపాదించుకోవడం కోసం ఇట్టి రాజధానులను ఏర్పాటుచేస్తారు. అట్టి సందర్భాలలో రాజధాని ఆమోదయోగ్యత, కార్యసాధకత ఒక ప్రత్యేకవ్యక్తి లేదా వంశం మీద ఆధారపడి ఉంటుంది. అందువల్ల వారసులు అదే కారణంచేత దాని నుండి విడిపోవాలనుకుంటారు. రాజధానీనగరాలను స్థాపించిన రాజులు ఇటువంటి రాజధానీనగరాల కోసం అనైక్యత, పరాయీకరణ వ్యూహాలను అవలంబించారు. సమైక్యతావ్యూహాన్ని అనుసరించలేదు. జోఫ్ ప్రకారం ఈ రాజధానులు ఎక్కువకాలం మనలేదు. ఇవి చాల అస్థిరమైనవీ, వీటి నిర్మాణానికీ, వినియోగానికీ విపరీతమైన ఖర్చు అవుతుంది. ఇవి లఘుకాలిక పరిష్కారాలు, దీర్ఘకాలిక భారాలు. విస్థాపిత రాజధానులు ముఠాపోటీలకు సాధనాలుగా ప్రణాళికీకరించినవి. ఆధునిక నమూనా రాజధానులు భిన్నవర్గాలు, రాజకీయశక్తుల మధ్య సమతుల్యత కోసం ప్రణాళికీకరించినవి. ప్రాచీనకాలం నుండీ ఇటువంటి విస్థాపిత రాజధానులకు ఈజిప్టు, తదితరదేశాల నుండి అనేక ఉదాహరణలు లభిస్తాయి. అటువంటి ఉదాహరణలలో ఒకటి జపాన్ రాజధాని క్యోటోను కియోమోరీ ఫుకుహారాకు తరలించడం. క్యోటోలోని బౌద్ధమతాచార్యుల ప్రాబల్యాన్ని తొలగించడం కోసం ఈ మార్పు జరిగింది. కానీ ఇందులో ఒక రహస్య అజెండా కూడా ఉంది. ఫుకుహారా ప్రాంతంలో తియరా తెగ ప్రాబల్యం ఉంది. కియోమోరీ ఈ తెగకు చెందినవాడు. ఇది కియోమోరీకి బలమైన విధేయతను సంపాదించిపెట్టడానికే కాక, ఈ ప్రాంతంలోని తియరా తెగవారి భూములకు అధిక లాభాలు సంపాదించి పెట్టడానికి రాజధాని క్యోటో నుంచి ఫుకుహారాకు తరలింపబడింది.

రాజధానీనగర స్థలాల నిర్ణయంలో తరచుగా బహిరంగ అజెండాతోపాటు రహస్య అజెండా ఉంటుంది. స్వలాభం లేదా రాజధానీనగర నిర్మాణాన్ని కొన్ని వర్గాల వారి ప్రయోజనాలకు అనుగుణంగా లాభదాయకంగా చేయడం అన్నది రహస్య అజెండా. అసలు ఫలానా చోట రాజధానీనగర నిర్మాణమే ప్రజలలోని ఒక వర్గం విధేయతను సంపాదించే మార్గం కావచ్చు. దానికి అనుగుణంగానే ఏర్పాటు జరుగుతుంది. ఈ రహస్య అజెండాను బహిరంగంగా వ్యక్తీకరించడం పాలకులకు కష్టమవుతుంది. అందువల్ల  అధికంగా ఆమోదనీయమైన బహిరంగ అజెండాతో బయటికి వస్తారు. అసలు అజెండా రహస్యంగానే ఉంటుంది. ఒక రాజధానీనగర నిర్మాణస్థలం మంచిచెడ్డలు నిర్ణయించేటప్పుడు మనం ఈ రహస్య అజెండాను కూడా దృష్టిలో ఉంచుకోవాలి.  తమంతవారు లేరని గర్వించే అహంకారప్రభువులు, నిరంకుశ ప్రభువులు కూడా ఉంటారు. వాళ్లు రాజధానీనగర నిర్మాణం ద్వారా చరిత్రలో తమ అడుగుజాడలు నిలపాలనుకుంటారు. ఇటువంటి పాలకులు బ్రహ్మాండమైన భవనాలు నిర్మిస్తారు. చరిత్ర ఇసుకదారుల్లో తమ అడుగుజాడలను ప్రజలు గుర్తుపెట్టుకోవాలనుకుంటారు. వాళ్లు ఒక ప్రకటన చేసి తమను తాము అంతర్జాతీయస్థాయిలో నాయకులుగా ప్రమోట్ చేసుకుంటారు. మలేషియాకు చెందిన మహమ్మద్ మహాతిర్, టర్కీకి చెందిన అతాతుర్క్, కజకిస్తాన్‌కు చెందిన నజర్ బేయర్ ఇటువంటి పాలకుల జాతిలోకి వస్తారు.

ఉదార ఫెడరలిస్ట్ పాలకవర్గాలు ఆంగ్లోసాక్సన్ దేశాలలో రాజధానీనగరాలను ఎంతో విజయవంతంగా నిర్మించారు. ఇక్కడ తమను తాము ఒక దేశంగా సమీకృతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న భిన్నవర్గాల మధ్య సర్దుబాటు, రాజీ ఫలితంగా రాజధానీనగరం ఎంపిక జరిగింది. అయితే సహజంగానే ఇటువంటి రాజధానీనగరాలు ఆ దేశాల్లోని ప్రధాన ఆర్థికకేంద్రాలకంటే చిన్నవి. ఈ దేశాలన్నిటిలో రాజధానీనగరాలు గొప్ప విజయాలు సాధించాయి. వీటిలో కొన్ని రాజధానీనగరాల గురించి తరువాతి అధ్యాయంలో చర్చిద్దాం.

రాజధానీనగరం చోటు నిర్ణయాన్ని ప్రభావితం చేసే మరో ముఖ్యమైన అంశం భూశకున శాస్త్రం, జ్యోతిశ్శాస్త్రం. ప్రాచీన మధ్యయుగాలలో రాజధాని స్థల నిర్ణయానికి ఇవి రెండూ ప్రముఖపాత్ర వహించాయి. కొన్ని దేశాలలో ఇప్పటికీ ఇవి ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. ఆయా దేశాలలో ఆ ప్రత్యేకకాలంలో ఇటువంటి

ధోరణిని అంగీకరించడంపై బహిరంగ అజెండా లేదా రహస్య అజెండా ఆధారపడి ఉంటుంది. గ్రహాలు, నక్షత్రాల ప్రభావం దృష్ట్యా జ్యోతిశ్శాస్త్రం రాజధానీనగరాలపై దృష్టి పెడ్తే, భూశకునశాస్త్రం భూమి లక్షణాల ప్రభావాన్ని పరిశీలిస్తుంది. బైజాన్‌టైన్ సామ్రాజ్యంలో పర్షియాలో, అరేబియాలో రాజధాని స్థలాల ఎంపికలో జ్యోతిశ్శాస్త్రం ప్రాధాన్యం వహిస్తే, చైనా సంబంధిత దేశాలలో ఫెంగ్ షూయీ పేరిట భూశకున శాస్త్రం ప్రాధాన్యం వహించింది. ఇటీవలి కాలంలో సంపూర్ణంగా జ్యోతిశ్శాస్త్ర నియమాలను అనుసరించి స్థలాన్ని ఎంపిక చేసిన రాజధానీనగరం మాయన్మార్‌లోని నేపెడ్‌వాయ్. భూశకునశాస్త్రానికి భారతీయ పర్యాయరూపం వాస్తు. రాజధానీనగరంగా అమరావతి స్థలం ఎంపికను నిర్ణయించడంలో ప్రధానపాత్ర వహించింది. రాజధాని నగరం అమరావతికి స్థలం ఎంపికలో ఇదే మార్గదర్శకసూత్రం అయి ఉండవచ్చు.

# 3. రాజధానీనగర నిర్మాణంలో అంతర్జాతీయ అనుభవం

పై సైద్ధాంతిక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రపంచవ్యాప్తంగా వివిధదేశాలలో రాజధానీనగరస్థలాల విషయంలో వాస్తవ అనుభవాలను పరిశీలించడం బాగుంటుంది. స్థలవిశ్లేషణలో రాజధానీనగరాల స్థల నిర్ణయంలో పైవివరించిన ఒక సూత్రాన్నో, మరో సూత్రాన్నో లేదా ఆ సూత్రాల సమ్మిశ్రణాన్నో ఉపయోగించినట్లు తెలుస్తుంది.

**యుఎస్ఎ రాజధాని వాషింగ్టన్ డిసి**

అమెరికా సంయుక్తరాష్ట్రాల రాజధానీనగరంగా వాషింగ్టన్ డిసి రూపుదిద్దుకోవడం వివిధ దేశాలలో వివిధ ఫెడరల్ రాజధానీనగరాలకు స్ఫూర్తినిచ్చింది. వాషింగ్టన్ డిసి అమెరికా రాష్ట్రాలన్నిటి ప్రయోజనాలకూ సమప్రాధాన్యం వహించేటట్లు ప్రణాళికీకరించబడింది. తదనుగుణంగానే దాని పాలన బాధ్యత ఫెడరల్ ప్రభుత్వానిదే. స్థానిక పురపాలక వ్యవస్థ పాత్ర అత్యల్పం మాత్రమే. అమెరికా దేశంలోని ఉత్తరదక్షిణ రాష్ట్రాల మధ్య సర్దుబాటుగా ఈ నగరం రూపొందింది. అంతర్యుద్ధానంతరం అప్పుల బాధ్యతను ఫెడరల్ ప్రభుత్వం స్వీకరించాలని ఉత్తర రాష్ట్రాలు కోరుకున్నాయి. దక్షిణ రాష్ట్రాలు దీనికి అభ్యంతరం తెలిపాయి. రాజీగా ఒక అంగీకారం కుదిరింది. రాజధానీనగరం దక్షిణ రాష్ట్రాలకు సమీపంగా ఉంటుంది. యుద్ధకారణంగా ఏర్పడ్డ ఋణాలను ఫెడరల్ ప్రభుత్వం చెల్లిస్తుంది. తదనుగుణంగా పోటొమాక్ నదీతీరంలో మేరీలాండ్, వర్జీనియా రాష్ట్రాలనుండి భూమిని తీసికొని నగరాన్ని నిర్మించారు. దీన్ని కాపిటల్ హిల్ మీద ఉన్న గ్రామంగా ఆ రోజులలో వర్ణించారు. దేశ వాణిజ్యకేంద్రాలుగా న్యూ యార్కు, ఫిలడెల్ఫియా వంటి పట్టణాలను వదిలి, కేవలం పరిపాలనస్వభావానికి మాత్రమే ఇది పరిమితమైంది. వాషింగ్టన్ డిసి ఒక ప్రధాన మహానగరంగా రూపొందడానికి దాదాపు ఒక శతాబ్దం పట్టింది.

అదే పద్ధతిలో అమెరికా సంయుక్తరాష్ట్రాలలోని రాష్ట్రాల రాజధానులను కూడా ఇదే తర్కాన్ని ఉపయోగించి ఎంపిక చేశారు. కాలిఫోర్నియా రాజధాని శాక్రమెంటో, టెక్సాస్ రాజధాని ఆస్టిన్, న్యూ యార్కు రాజధాని ఆల్బనీ, ఆయా రాష్ట్రాల పెద్దపెద్ద నగరాలతో పోలిస్తే ఈ రాజధానులు చాలా చిన్నవి. ఆ రాష్ట్రంలో ఆ రాజధాని ప్రదేశపు తటస్థస్థితి ఆధారంగా దాని ఎంపిక జరిగి ఉంటుంది.

**ఆస్ట్రేలియా రాజధాని కాన్ బెరా**

ఆరు రాష్ట్రాల సమాఖ్యగా ఆస్ట్రేలియా ఒక దేశంగా రూపొందింది. రాజధానీనగరస్థాన నిర్ణయంలో ఉద్దేశపూర్వకంగానే ఏ ఒక్క రాష్ట్రానికో తక్కిన వాటిపై ఆధిక్యం లేకుండా చూసే ప్రయత్నం జరిగింది. దేశంలోని అతి పెద్ద నగరాలైన సిడ్నీ, మెల్బోర్న్ నగరాలకది సమదూరంలో ఉండాలని కూడా నిర్ణయించారు. తదనుగుణంగా రాజధానీనగరం కాన్ బెరా ప్రస్తుతస్థలాన్ని ఎంపిక చేశారు. ఈ ప్రదేశం ఆదిమ తెగల సమావేశ ప్రదేశం. స్థానిక భాషలో కాంబెరా అంటే సమావేశ స్థలమని అర్థం. అందుకే ఈ పేరు ఎంపిక చేశారు. వాషింగ్టన్ డిసి నిర్మాణం నమూనాపై ఆధారపడి వాస్తు ప్రణాళికలో మూడు కొండలు కీలక ప్రాంతాలుగా ఉండేటట్లు నగరాన్ని నిర్మించారు.

**దక్షిణాఫ్రికా పంపకపు రాజధాని**

స్థలం సర్దుబాటులో భాగంగా రాజధానీప్రదేశాన్ని ఒక తటస్థ ప్రాంతంలో నిర్మించవచ్చు లేదా విశిష్ట గుర్తింపు ఉన్న భిన్నప్రాంతాల మధ్య సమతుల్యత కోసం ప్రభుత్వ కార్యకలాపాలను భిన్న ప్రాంతాలకు పంపిణీ చేయవచ్చు. దక్షిణాఫ్రికాలో ఈ రెండో విధానాన్ని అనుసరించారు. అధికారస్థానాన్ని మూడు ప్రాంతాల మధ్య విభజించారు. ఆంగ్లో – బోయర్ యుద్ధానంతరం ట్రాన్స్‌వాల్, కేప్ రాష్ట్రం, ఆరెంజ్ రిపబ్లిక్, నాటల్ అన్న భిన్న భూభాగాల కలయికతో దక్షిణాఫ్రికా ఏర్పడింది. ఈ ప్రాంతాలన్నిటి మధ్యా ప్రాంతీయ సమతుల్యతను పాటించడానికి దేశాధ్యక్షుడు ప్రిటోరియాలోను, పార్లమెంటు కేప్‌టౌన్‌లోనూ, సుప్రీం కోర్టు బ్లోమ్ ఫొంటెయిన్ లోనూ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జాతి వివక్షావిధానం ముగిసిన తర్వాత రాజ్యాంగ న్యాయస్థానాన్ని జొహాన్నెస్‌బర్గ్‌కు మార్చారు. ఆ విధంగా ప్రభుత్వ విధులను దక్షిణాఫ్రికాలో మూడు భిన్న ప్రాంతాలనుండి నిర్వహిస్తున్నారు.

## నైజీరియా రాజధాని అబూజా

బ్రిటన్ నుండి నైజీరియా స్వాతంత్ర్యం పొందినప్పుడు లాగోస్ రాజధానిగా ఉండేది. మొదటి దేశాధ్యక్షుడు రాజధానిని లాగోస్ నుండి దేశానికి కేంద్రస్థానంలో ఉండే అబూజాకు మార్చాలన్న ఆలోచన చేశాడు. అతని వారసులు కూడా ఈ అభిప్రాయాన్ని సొంతం చేసుకున్నారు. రాజధానిని మార్చడానికి ఒక కారణాన్ని లాగోస్‌లో అధిక జన సమ్మర్దం. నగర జనాభాలో కొంత భాగాన్ని రాజధానీనగరాన్ని మార్చడం ద్వారా తరలించినట్లయితే లాగోస్‌లో జీవన పరిస్థితులు మెరుగుపడతాయన్నది అభిప్రాయం. అంతర్గతంగా రాజధానిని దేశకేంద్ర ప్రాంతానికి మార్చడంలో మరోకారణం కూడా ఉంది. అది మతపరమైన తెగలు ముస్లిములు, క్రైస్తవుల మధ్య రాజీగా రాజధాని తరలింపు నిర్ణయం జరగటం. ఉత్తరాదిలో ముస్లిములు, దక్షిణాదిలో క్రైస్తవులు ఉండడం వల్ల రాజధానీనగరాన్ని తటస్థ స్థానంలో ఏర్పరచవలసి వచ్చింది. స్థలం సర్దుబాటుగా తటస్థసూత్రంగా అబూజాలో రాజధాని ఏర్పాటు జరిగింది. రాజధానీనగర నిర్మాణానికి పెట్టుబడులు నైజీరియా పెట్రోలియం ఆదాయం నుండి ఉపయోగించారు. రాజధాని నిర్మాణంలో అవినీతి విపరీతంగా పెచ్చరిల్లిపోయింది. ఈ కాంట్రాక్టులకు అబూజా కాంట్రాక్టులన్న పేరు వచ్చింది. ప్రాజెక్టు వ్యయంలో 25% అంచనాలు పెంచి ఈ కాంట్రాక్టులు ఇచ్చారు. రాజధాని తరలింపులో ఉద్దేశించిన రెండు ప్రయోజనాలను కొత్త రాజధాని సాధించిందా అన్నది సందేహాస్పదం. రాజధాని అబూజాకు మారిన తర్వాత కూడా లాగోస్‌లో అధిక జనసమ్మర్దం అలాగే ఉంది. జాతి పరమైన ఒత్తిడులు కూడా మరింత పెరిగాయి. తటస్థ రాజధానిగా ఉండడానికి బదులు అది ముస్లిం ప్రాబల్యంలోకి వచ్చి క్రైస్తవుల నిరసనకు దారితీసింది. ఇటీవల అబూజాకు ప్రాధాన్యం పెరుగుతూ ఉంది.

## మలావీ రాజధానీనగరం

మలావీ ఆఫ్రికాలో జల సరిహద్దులేని దేశం. తన రాజధానిని 1975 లో దక్షిణాన ఉన్న జోంబా నుండి ఉత్తరాన ఉన్న లిలోంగ్వే పట్టణానికి తరలించింది. రాజధానిని మార్చడానికి పైకి కనిపించే ప్రధాన కారణం దేశ మౌలిక ప్రాంతంలో స్వతంత్ర అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పరచడం. ఆ విధంగా దేశంలో అభివృద్ధిని సమతుల్యం చేయడం. అయితే ఇందులో ఒక రహస్య అజెండా ఉంది. అప్పటి దేశాధ్యక్షుడి తెగ ప్రజలు అధికంగా ఉండే ప్రాంతానికి ఇది దగ్గరగా ఉంది. ప్రకటించిన అజెండాకు

భిన్నంగా రహస్య అజెండా కారణంగా రాజధానిని తరలించిన సందర్భాలకు ఇదొక ఉదాహరణగా నిలుస్తుంది.

## బోస్ట్వానా రాజధానిని గబొరోన్‌కు తరలించడం

మొదటి బోస్ట్వానా రాజధాని మఫెకింగ్. ఇది దేశంలోని పలుకుబడి కలిగిన తెగలలో ఒకటైన బారోలాంగ్ తెగకు సాంప్రదాయిక స్థావరం. ఇది తక్కిన తెగలలో నిరసనకు దారితీసింది. దేశంలోని అన్ని తెగలకూ అంగీకారయోగ్యమైన మరోస్థానంలో రాజధానిని స్థాపించవలసిన అవసరం ఏర్పడింది. ఆ విధంగా 1969 లో రాజధాని గబొరోన్‌కి మారింది. ప్రభుత్వం రాజధాని మార్పులో రాజకీయపు సర్దుబాటు నిర్ణయాన్ని తీసికొంది.

సొమాలియా, సెనెగల్ వంటి ఇతర ఆఫ్రికా దేశాలలో రాజధానిని మరింత కేంద్రప్రాంతాలకు తరలించే విషయంలో చర్చలు జరుగుతున్నాయి.

ఆ విధంగా ఆఫ్రికాలో రాజధాని స్థలం విషయంలో జాతి, ప్రాంత సమతుల్యత, నగరాలలో సమ్మర్దాన్ని తగ్గించడం ప్రధానపాత్ర వహిస్తున్నాయి. రహస్య అజెండాలో దేశ నాయకుని జన్మస్థలం, లేదా అతని తెగ ప్రాబల్యం వంటివి కూడా ప్రధానమవుతున్నాయి.

## మలేసియా రాజధాని పుత్రజయ

1857 లో బ్రిటిష్ వారు మలేసియా రాజధానిగా కౌలా లంపూర్‌ను స్థాపించారు. 1993 లో మహాతిర్ మొహమ్మద్ రాజధానిని మరో చోట ఏర్పాటు చేయాలని నిర్ణయించేంతవరకు ఇదే రాజధానిగా కొనసాగింది. పుత్రజయ కౌలా లంపూరుకు 25 కి.మీ. దూరంలో ఉంది. రాజధాని మార్పుకు రెండు ప్రధాన కారణాలు. ఒకటి వరదలు. రెండు రాజధాని ఇరుకైపోవడం. మరో అంతరంగ కారణం కూడా ఉంది. అన్ని ఆగ్నేయాసియా దేశాల్లాగానే కౌలా లంపూరుతో సహా ప్రధాన నగరాలన్నింటిలో నగరప్రదేశాలన్నిటినీ చైనీయులు ఆక్రమించుకున్నారు. కౌలా లంపూరులో 80% జనాభా చైనీయులే. వలస రాజ్యకాలంనుండి వాణిజ్యమంతా చైనీయుల నియంత్రణలోనే ఉంది. స్థానిక మలే జాతీయులు వాణిజ్యంలో చైనీయుల పాత్రను తగ్గించి, వాణిజ్యంలోను, పరిపాలననేతృత్వంలోను స్థానికజాతి వారి ప్రాబల్యాన్ని

పెంచుకోవాలని భావించారు. అందువల్ల రాజధానిని కౌలా లంపూరు నుండి పుత్రజయకు మార్చడంలో రాజకీయ, వాణిజ్య రంగాలలో స్థానిక నాయకత్వాభివృద్ధి ఒక ప్రధాన లక్ష్యం. రాజధానీనగర ప్రాంతనిర్ణయం ఒక జాతిపరమైన మలే నగర స్థాపనకు, మలే నగర జనాభా సృజనకు ఒక చోదకశక్తిగా పనిచేయడానికి ఉద్దేశించినది. చారిత్రిక నగరాలలో చైనీయుల ప్రాబల్యానికి వ్యతిరేకంగా ఒక కౌంటర్ కాలనైజేషన్, కౌంటర్ అర్బనైజేషన్‌గా ఇది వచ్చింది. దేశపు పెట్రొనాస్ ఆయిల్ మోనోపలీ లాభాలనుండి నగర నిర్మాణానికి ప్రధానంగా నిధులు వినియోగించరు. నగరం ఆయిల్ పామ్ పొలాల నడుమ ఉంది. మలేసియాకు పరిపాలనపరమైన రాజధానిగా దీన్ని ఉద్దేశించారు. బయటికి కనిపించే కారణం అప్పటి రాజధాని సమ్మర్దాన్ని తగ్గించడం అయినప్పటికీ, సైద్ధాంతికంగా దీన్ని వికేంద్రీకరణ వ్యూహంగా అంతర్గత కారణం అభివర్ణిస్తుంది. మలే జాతీయుల పట్టణ మధ్యతరగతి అనే కొత్త వర్గాన్ని సృజించే లక్ష్యంతో రాజధాని తరలింపు జరిగింది. మలే గుర్తింపు, మత ఆధారంగా ఈ పట్టణంలో వాస్తునిర్మాణంపై ఇస్లామిక్ లక్షణాలకు ప్రాధాన్యమివ్వడం జరిగింది. ఆ విధంగా దీన్ని అందరినీ కలుపుకొని వెళ్లే నగరంగా కాక, ఒకవర్గానికి మాత్రమే పరిమితమై తక్కినవారిని వెలుపల పెట్టే నగరంగా భావించాలి.

ఇది విపరీతమైన వృథా ఖర్చు అనీ, వాస్తు ఆర్భాటమేననీ, మలయా సంస్కృతిని ప్రతిబింబించదని విమర్శలు వచ్చాయి. ప్రధానమైన చైనీయ, భారతీయ జనాభా నివసిస్తున్న దేశంలో ఇస్లామిక్ శైలి భవనాలతో నింపివేయడం అనుచితంగా తోస్తుంది. ఇటువంటి భవనాలు నిర్వహణ ప్రధానమైనవి. ప్రజాస్వామ్యంలో రాజభవనాల లాంటి నిర్మాణాలు అనుచితమైనవి, మొత్తంమీద ఆరు బిలియన్ల అమెరికన్ డాలర్లను రాజధాని నిర్మాణంపై ఖర్చుపెట్టడం మహాతిర్ మొహమ్మద్ లా తమని మించిన వారు లేరని అతి గొప్పలు చూపేవారి (megalomaniacs) పని అనీ, దాన్ని మరింత సముచితమైన విషయాలపై ఖర్చు పెట్టవలసిందనీ విమర్శకులంటున్నారు.

ఇండోనీసియాలో రాజధాని స్థానమన్నది చాలా పాత చర్చాంశం. జకార్తాలో జన సమ్మర్దాన్ని తగ్గించవలసిన అవసరం, భూకంపాల ప్రమాదం, పాలకులు కొత్త రాజధానిని అన్వేషించవలసిన అవసరాన్ని కల్పిస్తున్నాయి. ఇండోనీసియా ద్వీప సముదాయానికి నడుమన ఉన్న కాలీమంతన్ ద్వీపం దీనికి సహజమైన ఎంపిక. ఈ చర్చ చాలాకాలం నుండి జరుగుతూ ఉన్నప్పటికీ ఒక నిర్దిష్ట నిర్ణయం జరగలేదు.

## పాకిస్తాన్ రాజధానీనగర ప్రదేశం

పాకిస్తాన్ స్వాతంత్ర్యం పొందినప్పుడు కరాచీ రాజధాని. 1959 ప్రాంతంలో కరాచీ నుండి రాజధానిని మరికొంత లోపలికి మరింత కేంద్రస్థానానికి మార్చాలన్న నిర్ణయం జరిగింది. ఇస్లామాబాదును రాజధాని స్థానంగా నిర్ణయించడానికి వెనుక కొన్ని కారణాలున్నాయి. వాటిలో ఒకటి భారతదేశంనుండి పాకిస్తాన్ తనదిగా పేర్కొంటున్న కాశ్మీరుకు దగ్గరగా ఉండడం. ఇస్లామాబాదు పఖ్తూన్ ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో ఉంది. పఖ్తూన్‌లో వేర్పాటువాద ధోరణులు ప్రబలుతున్న సందర్భంలో రాజధాని దానికి సమీపంగా ఉండడం ఆ ప్రాంతంపై అధికనియంత్రణ నిస్తుంది. అప్పటికి కరాచీలో తరచుగా వలసవచ్చిన ముహాజిర్‌లు, స్థానిక సింధీల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. కరాచీ ముఖ్యమైన మహానగరం కావడం వల్ల ఆందోళనలు తరచుగా జరుగుతూ ఉంటాయి. అప్పటి పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ పఖ్తూన్ వాడు కావడం కూడా రాజధాని స్థలం ఎంపికలో ప్రధానపాత్ర వహించి ఉంటుంది. వాస్తవానికి తన సొంత ప్రదేశం అబ్బటాబాదులో రాజధానిని ఏర్పరచాలని అతని కోరిక. అయితే అది భూకంపాలు తరచుగా వచ్చే అవకాశాలున్న ప్రదేశం కావడం వల్ల దానికి సమీపంలోనే ఉన్న ఇస్లామాబాదు ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవడం జరిగింది. ఇస్లామాబాదుకు సమీపంలో ఉన్న రావల్పిండి నగరం ఒక ప్రధాన సైనికస్థావరం కావడం కూడా ఇస్లామాబాదు ఎంపికలలో కీలకపాత్ర వహించి ఉంటుంది. ఎందుకంటే దేశాన్ని పరిపాలిస్తున్నది సైనిక యంత్రాంగం కాబట్టి. మరో ముఖ్యకారణం లాహోరు, కరాచీ వంటి అధిక జనాభా కలిగిన నగరాలను సైన్యం తన నియంత్రణలోకి తెచ్చుకోవడం కష్టం కాని, ఇస్లామాబాదు వంటి విడిగా ఉన్న రాజధానీనగరాన్ని సైన్యం స్వాధీనంలోకి తెచ్చుకోవడం సులభం. నగరాన్ని గ్రీకు ఆర్కిటెక్టు చక్కగా ప్రణాళికీకరించాడు, సెక్టర్లుగా విభజించారు. వాతావరణం బాగుంటుంది. దీర్ఘకాలంగా ఇక్కడ పౌరజనాభా కంటే సైన్య జనాభా అధికంగా ఉండి, పౌరులు తక్కిన ప్రాంతాలతో పోల్చినప్పుడు మెరుగైన జీవన ప్రమాణాలను, జీవనస్థాయిని అనుభవిస్తున్నారు.

## భారత రాజధాని

భారత రాజధాని కలకత్తా నుండి 1911 లో కొత్త ఢిల్లీకి మారింది. కలకత్తా నుండి కొత్త ఢిల్లీకి రాజధానిని మార్చడానికి ప్రధాన కారణం బెంగాలు రాష్ట్రంలో

జాతీయోద్యమ తీవ్రత. ముస్లింల మెజారిటీ ఉన్న తూర్పు బెంగాలును 1905 లో విభజించడం ద్వారా జాతీయోద్యమాన్ని బలహీనపరచడానికి బ్రిటిష్ ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే వాస్తవానికి ఉద్యమం తీవ్రతరమయింది. బ్రహ్మాండమైన ప్రజావ్యతిరేకత వల్ల బ్రిటిష్ వాళ్లు బెంగాలును మళ్లీ కలపవలసి వచ్చింది. అయితే రాజధానిని ఢిల్లీకి తరలించాలన్న నిర్ణయం జరిగింది. దీనికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. కలకత్తాను రాజధానీనగరంగా ఎంపిక చేసికున్నప్పుడు, అది బ్రిటిషు వారికి ప్రధానమైన ప్రవేశద్వారంగానూ, ముఖ్యమైన రేవు పట్టణంగానూ ఉంది. బర్మా వంటి దేశాలమీద కూడా ప్రభావం చూపించడానికి అనుకూలంగా ఉండింది. 20 వ శతాబ్దంలో అడుగుపెట్టే సమయానికి బ్రిటిషువారికి తమ పశ్చిమ సరిహద్దులను ఆఫ్ఘాన్ల నుండీ, రష్యన్ల నుండీ ఎలా కాపాడుకోవాలో అనే సమస్య ప్రధానమైంది. జాతీయోద్యమం దేశంలోని ఇతరప్రాంతాలలో కూడా వ్యాపించి ఉన్నప్పటికీ, తక్కినచోట్ల బెంగాలులో ఉన్నంత తీవ్రంగా లేదు. రాజధానిని ఢిల్లీకి మార్చడంలో బ్రిటిషువాళ్లు భారతజాతీయవాదానికి బెంగాలు జాతీయవాదానికి భిన్నంగా ప్రోద్బలం కల్పించాలన్న భావన కనిపించింది. ఢిల్లీకి సుదీర్ఘమైన చారిత్రక ప్రాధాన్యముంది. మహాభారతకాలం నుండీ రాజధానిగా ఉండి, తొలి ముస్లిం రాజులు, మొఘలు వంశ రాజులకు కూడా రాజధానిగా ఉన్న చరిత్ర దానికి ఉంది. ఇదంతా ఢిల్లీకి ఒక చారిత్రకప్రాధాన్యాన్ని సంతరించింది. రాజధానిని ఢిల్లీకి మార్చడానికి బ్రిటిషు వారికి ఇదొక ముఖ్య కారణంగా భాసించింది. నగర ప్రణాళిక సామ్రాజ్యరీతికి (Imperial) చెందింది. ఆ కాలంలో నిర్మించిన భవనాలు స్వతంత్ర భారతదేశంలో కూడా ఉపయోగంలో ఉన్నాయి. నగరంలోని ప్రభుత్వ భవనాలను డిజైన్ చేసిన ముఖ్యమైన ప్రణాళికాకర్తలలో ఒకడైన హెర్బర్ట్ బేకర్ ఇలా అన్నాడు, 'ఈ నగరాన్ని భారతీయ నగరంగా గానీ, ఆంగ్లనగరంగా గానీ, రోమన్ నగరంగా గానీ నిర్మించలేదు. సామ్రాజ్యరాజధానిగా దీని నిర్మాణం జరిగింది.'

### మయన్మార్ రాజధాని

2005 లో మయన్మార్ సైనిక పాలకులు అప్పటి రాజధాని రంగూన్ నుండి దానికి సుమారు 300 కి.మీ.ల దూరప్రాంతంలో ఉన్న నేప్యిడాకు మార్చారు. స్థానిక విశ్వాసాల ప్రకారం జ్యోతిషశాస్త్ర పరంగా ముఖ్యమైన తేది, సమయాన కొత్త రాజధానిని ఏర్పరచడం జరిగింది. అప్పటినుండి ఈ నగరం ముఖ్యమైన నగరంగా

అభివృద్ధి చెంది, ప్రస్తుతం 10 లక్షల జనాభాకు చేరుకుంది. రాజధాని మార్పిడిలో జ్యోతిషశాస్త్ర పరమైన కారణాలతోపాటు, వ్యూహాత్మక కారణాలు కూడా ఉన్నాయి. అమెరికా, నాటోల దాడి అవకాశాలను ఊహించి మిలిటరీ పాలకులు రాజధానీ నగరాన్ని కొత్తచోటికి తరలించారు. రంగూన్‌తో పోల్చినప్పుడు దేశం లోపలివైపు దూరప్రాంతంలో కొత్త రాజధాని ఉండడం అధిక భద్రతగా సైన్యాధికారులు భావించారు. ఇతర కారణాల వల్ల కూడా రాజధానీనగర స్థలానికి న్యాయసమ్మతి ఉంది. వలసపాలకులు రాజధానిని రేవుపట్టణానికి మార్చకముందు మయన్మార్ రాజధాని ఎల్లప్పుడూ దేశానికి కేంద్రప్రాంతంలోనే ఉంది. రాజధానీనగరం దేశకేంద్రప్రాంతంలో ఉండడం భిన్న ప్రాంతాల ప్రయోజనాల మధ్య సమతుల్యతను కాపాడుతుంది. మయన్మార్ చరిత్ర, భౌగోళిక అస్తిత్వాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు రాజధానీనగర ప్రదేశం దేశ కేంద్రప్రాంతంలో ఉండడం సముచితంగానే ఉంది. నగర ప్రణాళికను చాలా భారీస్థాయిలో రూపొందించారు. దానివల్ల నగరంలో జనులు ఆవాసాలేర్పరచుకోవడానికి సుదీర్ఘకాలం పట్టింది. ఆ మధ్య కాలంలో అదొక నిర్మానుష్యమైన దయ్యపునగర భావన కల్గించింది.

### బ్రెజిల్ రాజధాని బ్రసీలియా

బ్రెజిల్ రాజధానిని రియో నుండి బ్రెజిల్ లోతట్టు ప్రాంతానికి తరలించాలనే నిర్ణయం 1956 లో జరిగింది. బ్రెజిల్‌లో సవాన అడవుల ప్రాంతంలో ఉన్న సెరాడో ప్రాంతంలో రాజధానిని నిర్మించాలని నిర్ణయించారు. రాజధానీనగరాన్ని దేశం లోపలి ప్రాంతానికి తరలించడానికి అనేక కారణాలున్నాయి. వలస రాజధాని అట్లాంటిక్ సముద్రతీరంలోని రియో డి జనీరో దీన్ని దేశం లోతట్టు ప్రాంతానికి మార్చడం ద్వారా ఆ ప్రాంతాల అభివృద్ధి వేగాన్ని పెంచే అవకాశం కలిగింది. బ్రెజిల్ దేశంలో అప్పటివరకు దేశం ఒక భౌగోళిక భావనేకాని జాతీయ భావనకాదు. ఒక కొత్త రాజధాని నిర్మాణం ద్వారా జాతీయభావన తెచ్చే యత్నం జరిగింది. పైగా రియోలో జనసమ్మర్దం విపరీతంగా పెరిగి, అసమానతలు పెచ్చుపెరిగాయి. ఒక నూతన సామాజిక వాతావరణాన్ని తీసికొని వచ్చి ఒక సామాజిక సమానీకరణ ప్రయత్నానికి కొత్త రాజధానీనగరం ఉపయోగపడుతుందని భావించారు. 2010 నాటికి బ్రసీలియా ఒక ప్రధాన నగరంగా రూపొందింది. 25 లక్షల జనాభాతో దేశంలోని వివిధ ప్రాంతాలనుండి రాజధానికి జనాన్ని ఆకర్షించింది. ఈ వలసలు

బ్రెజిల్ వంటి విశాలదేశపు అంతర్గత ప్రాంతాలకు అభివృద్ధి ద్వారాలను తెరిచాయి. వంపులు, విశాలమైన బహిరంగ స్థలాలపై గొప్ప ఉనికతో ఈ నగరం వాస్తుపరంగా కూడా బ్రెజిల్ సాంస్కృతిక స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తూ ఉంది.

మరో వైపున మురికివాడలు లేని నగరంగా దీన్ని ప్రణాళికీకరించారు. కానీ నగరనిర్మాణ కాలంలోనే మురికివాడలు అభివృద్ధి చెందసాగాయి. కొత్త రాజధానిని నిర్మాణంలో దేశపు వనరులను భారీగా ఉపయోగించడం వల్ల ఆర్థిక అస్తవ్యస్తత ఏర్పడి, చివరికి సైన్యం చేతిలోకి ప్రభుత్వం వెళ్లిపోయింది.

లాటిన్ అమెరికా దేశాలలో కూడా రాజధానీనగరాలను మరోప్రాంతానికి తరలించే విషయంపై తరచుగా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. దీనికి కారణం భూకంపాలు, తుపానులు వంటి జాతీయ ఉపద్రవాలకు ఈ నగరాలు గురికావడమే. బెలీజ్, హైతీ, నికరాగువా వంటి దేశాలలో ఈ సమస్య ఉంది. ఇతర దేశాలలో ప్రాంతీయ సమతుల్యతలు, ప్రస్తుత రాజధానులు అనియంత్రంగా పెరిగిపోవడం రాజధాని మార్పిడి చర్చలకు ప్రధానమైన హేతువులవుతున్నాయి.

## జర్మన్ రాజధాని బెర్లిన్

1991 లో బెర్లిన్ గోడ కూలిపోవడంతో సమైక్య జర్మనీకి ఏది రాజధానిగా ఉండాలన్న విషయంలో తీవ్రమైన చర్చ జరిగింది. చివరికి రాజధానిని బెర్లిన్‌కు మార్చాలని నిర్ణయించారు. సమైక్య రాజధానీనగరంగా అభివృద్ధి చేయాలని భావించారు. రెండు జర్మనీల సరిహద్దులో ఉండడం కూడా మరింత ప్రభావవంతమైన రాజకీయ, ఆర్థిక సమైక్యతకు అది తోడ్పడుతుందని భావించారు. భూమి అందుబాటులో ఉండడం, భవనాలు లభ్యమవడం కూడా ఈ నిర్ణయానికి తోడ్పడ్డాయి. తూర్పుకు ఉన్న బెర్లిన్ రాజధాని కావడం వల్ల మధ్య తూర్పు, యూరప్ దేశాలకు జర్మనీని నేతగా మార్చివేస్తుంది. మొత్తం యూరప్‌ను సమైక్యం చేయడంలో జర్మనీకి ఒక విశిష్టపాత్రనిస్తుంది అన్న భావన కూడా బెర్లిన్ ఎంపికకు దోహదం చేసింది.

## భారీ రాజధానీనగరాలు – రాజధాని మార్పిడిపై చర్చ:

రెండు చారిత్రక నగరాలు లండన్, పారిస్ ప్రపంచ వాణిజ్య కేంద్రాలుగా రూపొందాయి. అవి ఆయా దేశాల రాజధానులుగా కాక, ప్రపంచస్థాయిలో చూడదగిన పట్టణాలుగా రూపొందాయి. అందువల్ల ఈ రెండు దేశాల్లోనూ దేశ

అవసరాలకు మరింత స్పందనాత్మకంగా ఉండే రాజధానీనగరాల ఏర్పాటు అవసరాలపై చర్చ ప్రారంభమైంది. ఇంగ్లండులో ప్రభుత్వ విధానాలు దేశప్రయోజనాల దృష్ట్యా కాక, లండన్ ప్రయోజనాల దృష్ట్యా జరుగుతున్నాయనే భావన ఒకటి ఏర్పడింది. అదే విధంగా రూసో మొదలుకొని ఫ్రెంచి తత్త్వవేత్తలెందరో పారిస్ అభివృద్ధి చెందుతున్న రీతిపట్ల తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. 1881 లో పారిస్ జనాభా ఫ్రాన్స్ జనాభాలో 5 శాతం కాగా, అది 1975 నాటికి 19 శాతం అయింది. ఈ రెండు నగరాలలో ఈ విధమైన అభివృద్ధి, అవి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రపంచం ప్రయోజనాల దృష్ట్యా ఈ రెండు దేశాలలోనూ రాజధానిని మరింత కేంద్రస్థలానికి మార్చడం ద్వారా దేశంలోని మిగతా ప్రాంతాల అవసరాలకు అనుకూలతను కల్పించడం వీలవుతుందన్న అంశంపై చర్చ జరుగుతున్నది.

# 4. భారతదేశం ప్రణాళికీకరించిన తొలి రాజధానులు

## 1. పంజాబ్ హర్యానాల రాజధాని చండీగఢ్

బ్రిటిష్ ఇండియా విభాజితమైనప్పుడు పంజాబు రాష్ట్రం భారత పాకిస్తాన్‌ల మధ్య విభాజితమైంది. పంజాబు రాష్ట్ర రాజధాని అయిన లాహోరు పాకిస్తాన్ భాగంలోకి వెళ్లింది. అందువల్ల భారత సమాఖ్యలో భాగమైన తూర్పు పంజాబుకోసం ప్రత్యేక రాష్ట్ర రాజధానిని నిర్మించవలసి వచ్చింది. దీనికితోడు పశ్చిమ పాకిస్తాన్ నుండి వస్తున్న కాందిశీకులకు నివాసస్థానం కల్పించడం కోసం ఒక నగరాన్ని నిర్మించవలసిన అవసరం కూడా ఏర్పడింది. ఈ రెండు ప్రయోజనాలనూ నెరవేర్చడానికి ఉపయోగపడేటట్లు చండీగఢ్‌ను ఒక ఆధునిక ప్రణాళికీకృత నగరంగా రూపొందించారు. ఆధునిక నగరంగా చండీగఢ్ అభివృద్ధిలో జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా శ్రద్ధ తీసుకున్నారు. రాజధాని చండీగఢ్ నిర్మాణంలో ఒక భవిష్యద్దృష్టి కనబరిచాడు. భారత స్వాతంత్ర్యానికది ప్రతీకగా ఉండాలని, గత సంప్రదాయ బంధాలు దాన్ని అడ్డుకోకూడదని, భవిష్యత్తుపై దేశ విశ్వాసానికది ఒక ప్రతిబింబంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డాడు. శివాలిక్ పర్వతశ్రేణి పాదాలవద్ద తగిన స్థలాన్ని ఎంపిక చేశారు. సమీపంలో చండీ మందిరపు చండీమాత పేరునే నగరం పేరుగా నిర్ణయించారు. దీని మౌలిక మాస్టర్ ప్లాన్ రచించింది ఆల్బర్ట్ మయర్. కాని ఫ్రెంచి ఆర్కిటెక్ట్ లె కర్బ్యూజ్యె, అతని జట్టు నగరాన్ని నిర్మించారు. ఫలితం చండీగఢ్ నగరం. ఈ హరిత క్షేత్ర నగర స్థాపనలో అద్భుత ఆర్కిటెక్చరల్ మేధావి లె కర్బ్యూజ్యె కీర్తి ఎటువంటిదో, నాటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ దూరదృష్టి, నిబద్ధత అంతే కీర్తనీయమైనవి.

లె కర్బ్యూజ్యె చండీగఢ్ మాస్టర్ ప్లాన్‌ను మానవశరీరం పోలికతో రచించాడు. నాలుగు ప్రధాన లక్ష్యాల నిర్వహణపై ఆధారపడిన నగర భావన ఇది; జీవించడం,

పనిచేయడం, శరీరం మనస్సు, ఆత్మల భద్రత, రక్త ప్రసరణం (రవాణా). అతని నగర సాధారణ ప్రణాళికను సెక్టర్లుగా విభజించి డిజైన్ చేశాడు. లె కర్బ్యూజ్యె అతి పెద్ద 'తెరచిన చేయి' నిర్మాణాలు చండీగఢ్‌లో ఉన్నాయి. అవి 26 మీటర్ల ఎత్తుంటాయి. లె కర్బ్యూజ్యె ఆర్కిటెక్చర్‌లో పునరుక్తమయ్యే లక్షణమిది. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ప్రణాళికీకృత నగరాలలో మొదటివాటిలో ఒకటి చండీగఢ్. ఇది వాస్తు శిల్పానికీ, పట్టణం నమూనాకీ అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందింది.

చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతం. పదిలక్షల జనాభాతో పంజాబ్, హర్యాణా రాష్ట్రాల రాజధాని.

2016 లో చండీగఢ్ రాజధాని కాంప్లెక్సును యునెస్కో వరల్డ్ హెరిటేజ్‌గా ప్రకటించింది. "లె కర్బ్యూజ్యె వాస్తుకృషి ఆధునిక ఉద్యమానికి అసాధారణమైన భాగదేయం" అని పేర్కొన్నారు.

## 2. ఒడిశా రాజధాని భువనేశ్వర్

బ్రిటిష్ పాలన కాలంలో భాషాపరంగా ఏర్పడిన తొలిరాష్ట్రం ఒడిశా రాష్ట్రం. ఒరియా మాట్లాడే ప్రజలు మూడు బ్రిటిష్ ప్రావిన్సులలో విభాజితమై ఉన్నారు. కలకత్తా, సెంట్రల్, మద్రాసు ప్రెసిడెన్సీ లివి. తమ దోపిడి జరుగుతున్నదన్న భావన ఒరియా ప్రజలలో బలంగా ఉండేది. ముఖ్యంగా తమ ప్రాంతంలో ప్రభుత్వోద్యోగాలలో అధికభాగం బెంగాలీల చేతిలో ఉండడం వారిలో నిరసనకు దారితీసింది.

19వ శతాబ్ది ద్వితీయార్ధంలో ఒరియా భాషాసంస్కృతుల పరిరక్షణ కోసం ఉత్కళ సభ, ఆ తర్వాత ఉత్కళ సంఘసమితి వంటి సంఘాలు ఏర్పడి, ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటంలో ప్రముఖపాత్ర వహించాయి. పిల్లలకు విద్యాబోధనలో బెంగాలీని తప్పనిసరి చేసే ప్రయత్నాలు కూడా ఈ ప్రాంతీయాభిమానానికి బలమిచ్చాయి. 1911 లో బీహార్, ఒరిస్సాలను కలిపి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పరిచారు. దీనికి మొదట రాంచీ, తర్వాత పాట్నా రాజధానులయ్యాయి. ఇది ఒరియా భాష ఆకాంక్షలను తృప్తి పరచలేకపోయింది. 1920 నాగపూర్ కాంగ్రెస్‌లో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తీర్మానాన్ని ఒరిస్సా ప్రజలు స్వాగతించారు. చివరికి మధ్య రాష్ట్రం, మద్రాసు రాష్ట్రం, బీహారు ఒరిస్సా రాష్ట్రాలు మూడింటిలోను ఒరియా మాట్లాడుతున్న ప్రాంతాలను ఏకం చేసి 1936 ఏప్రిల్ ఒకటవ తేదీన ఒరిస్సాను ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పరిచారు. భారతదేశంలో భాషా ప్రాతిపదికన ఏర్పడిన తొలిరాష్ట్రం ఒరిస్సా. 1953 లో

ఆంధ్రరాష్ట్రం దేశ స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రత్యేక భాషారాష్ట్ర మైనప్పటికీ, వాస్తవానికి తొలి భాషాప్రయుక్త రాష్ట్రం ఒరిస్సాయే.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లకు గాని నూతన రాజధాని స్థల నిర్ణయం జరగలేదు. భువనేశ్వర్ అన్నదసలు మొదటిదశలో దృష్టిలోనే లేదు. కటక్, బరంపురం, పూరీ, అంగుల్ పట్టణాలే రాజధాని పోటీలో ఉన్నాయి. చివరికి పోటీలో కటక్, పూరీలు మిగిలాయి. నాటి రాజకీయ ప్రభుత్వం ఈ రెండిటి మధ్యా నిర్ణయించుకోలేకపోవడంతో, రాజధానీనగర నిర్ణయానికి ఒక దశాబ్దం పట్టింది.

చివరికి ఇరుకుగా ఉండడం వల్ల కటక్, ఉన్నత మతకేంద్రం కాబట్టి పూరీ రెండూ రాష్ట్ర రాజధానిగా ఉండడానికి తగినవిగా కనిపించలేదు. అందువల్ల భువనేశ్వర్ ముందుకు వచ్చింది ప్రత్యామ్నాయంగా. ఇదొక ముఖ్యమైన యాత్రాస్థలం, ఒరియా స్వీయగౌరవానికి చిహ్నం, కొత్త భవనాలు కట్టడానికి తగినంత స్థలం ఉంది. గవర్నరుకు ఆ సమయంలో ప్రత్యేక సలహాదారుగా ఉన్న మహారాష్ట్రకు చెందిన గోఖలే భువనేశ్వర్‌కు అనుకూలంగా నిర్ణయం జరగడంలో కీలకపాత్ర నిర్వహించాడు. అతని దృష్టిలో కటక్ ముఖ్యమైన వాణిజ్య కేంద్రం, భువనేశ్వర్ పాలన రాజధాని. 1946 లో ఒరిస్సా ప్రధానమంత్రి అయిన (స్వాతంత్ర్యం తర్వాత ముఖ్యమంత్రి) హరే కృష్ణ మెహతాబ్‌ను ఒప్పించగలిగాడు. భువనేశ్వర్‌కు అనుకూలంగా శాసనసభ తీర్మానించింది. రాజధాని కానందుకు కటక్‌కు ఉత్కళ విశ్వవిద్యాలయం, హై కోర్టు లభించాయి.

భువనేశ్వర్‌లో రాజధాని ఉంటుందన్న నిర్ణయం జరిగిన తర్వాత కూడా, నిధుల కొరత వల్ల కట్టడపు పనులు ప్రారంభం కావడం చాలా ఆలస్యమయింది. ఈ మధ్యకాలంలో ప్రభుత్వం మారింది. కొత్త ప్రభుత్వానికి రాజధాని నిర్మాణ విషయంలో హరేకృష్ణ మెహతాబ్ కున్నంత ఆసక్తి లేకపోయింది. 1956 లో ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయిన తర్వాత, భువనేశ్వర్‌లో రాజధాని నిర్మాణానికి పూర్తి సమర్థన లభించింది. రాజధానిని భువనేశ్వర్‌లో నిర్మించే పని ప్రారంభమయింది.

పంజాబు రాజధానిగా చండీగఢ్ నిర్మాణం జవహర్‌లాల్ పూర్తి సమర్థనతో ఫ్రెంచి ఆర్కిటెక్టు లె కర్బ్యూజ్యె ఆధ్వర్యంలో వేగం పుంజుకుంది. ఎటువంటి ఆటంకాలూ లేకుండా ముందుకు సాగింది. భువనేశ్వర్ విషయంలో ఈ బాధ్యత జర్మన్ ఆర్కిటెక్టు ఓటో కోనిగ్స్ బెర్జర్ భుజస్కంధాలపై పడింది. అతనప్పటికే మైసూరు రాజ్యంలో పని

చేస్తున్నాడు. అప్పటికే టాటా నగరం జంషెడ్‌పూర్‌కు ప్రణాళిక రచించాడు. మరో ఆర్కిటెక్టు బొంబాయి నుండి వచ్చిన జూలియస్ లాజరస్ వాజ్ అప్పుడు ఒరిస్సా ప్రభుత్వంలో ఛీఫ్ ఆర్కిటెక్టుగా పనిచేస్తున్నాడు. ఈ మధ్య కాలంలో భారతప్రభుత్వం నుండి కోనిగ్స్‌బెర్జర్ నియామకం పొందాడు. దూరాన ఉండే పనులను పర్యవేక్షించసాగాడు. అతని ముఖ్యమైన పని మాస్టర్ ప్లాన్ తయారుచేయడం. ఛీఫ్ ఆర్కిటెక్టు వాజ్ కూడా పూర్తిగా భువనేశ్వర్‌లో నివసించడం లేదు. వీరిద్దరి మధ్య సరైన సహకారం లేకపోవడం వల్ల భువనేశ్వర్ నిర్మాణం బాగా ప్రభావితమైంది.

భువనేశ్వర్‌ను రాజధానీనగరంగా నిర్మించడంలో కోనిగ్స్‌బెర్జర్ నిర్వహణ సౌలభ్యం కలిగిన చిన్న ఇరుగుపొరుగుల్ని నిర్మించాలన్న ప్రతిపాదన చేశాడు. కోనిగ్స్‌బెర్జర్, వాజ్ లిద్దరూ రాజధాని నిర్మాణస్థలంలో స్థిరంగా ఉండకపోవడంతో, కొత్త రాజధాని నిర్మాణ పర్యవేక్షణ బాధ్యత పిడబ్ల్యుడి శాఖపై పడింది. ఇంత పెద్ద కార్యాన్ని నిర్వహించడానికి అది సన్నద్ధంగా లేదు. ఒరిస్సా ఆలయ వాస్తుతో ఆధునిక నిర్మాణశిల్పాన్ని సమ్మేళనం చేసి మిశ్రమ నిర్మాణం చేశారు. దీనికి గొప్ప నిర్మాణ శిల్పపు విలువ లేకుండా పోయింది. ప్రభుత్వ గుమాస్తాల కోసం కార్యాలయ భవనాలు నిర్మించడమే ప్రధానలక్ష్యంగా నిర్మితమైన ఏ నగరమూ కూడా గొప్పదనాన్ని ఆశించలేదని ఎం.ఎస్. బుచ్ అనే ప్రభుత్వాధికారి వ్యాఖ్యానించాడు. ఇది భువనేశ్వర్ విషాదం. అది చివరికి పిడబ్ల్యుడి టౌన్‌షిప్‌గా తయారయింది. కిప్లింగ్ మాటలలో ఇది బంగలోత్ సమ్ (వెగటు కలిగించే ప్రభుత్వ బంగళాలు). భువనేశ్వర్‌ను వర్ణించడానికి ఈ ఒక్కమాట సరిపోతుంది. ఒరిస్సా గొప్ప నాయకుడు బిజూ పట్నాయక్ భువనేశ్వర్ నిర్మాణాన్ని గురించి క్లుప్తంగా ఇలా వ్యాఖ్యానించారు: భువనేశ్వర్ పేదవాడి పట్టణం. ఒరిస్సా పేదరికాన్ని దృష్టిలో పెట్టుకొని చూసినప్పుడు అది చండీగఢ్ వంటి వైభవోపేతమైన పట్టణం కాజాలదు. దాని సామర్థ్యం ప్రజల పేదరికం, ప్రణాళికాకారుల ఊహాశక్తి పరిమితులకు లోబడి ఉంది.

## 3. గుజరాత్ రాజధాని గాంధీ నగర్

గుజరాతీల ప్రత్యేక రాష్ట్రకాంక్ష 1920 నాటి నాగపూరు కాంగ్రెస్ సమావేశం నుండి స్ఫూర్తి పొందింది. ఈ సమావేశంలో రాష్ట్రాలను భాషాపరంగా పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయం తీసుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గుజరాతీ మాట్లాడే ప్రాంతాన్ని మూడు భాగాలుగా విభజించారు. 1. బొంబాయి

రాష్ట్రంలో ఉన్న ప్రధాన గుజరాతీ ప్రాంతం. అనేక సంస్థానాలతో కూడి ఉన్న సౌరాష్ట్ర ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఆ సమయంలో భారత సమాఖ్యలో భాగమైంది. పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న కచ్ ప్రాంతాన్ని కేంద్రప్రభుత్వ అధీనంలో ఉంచడం జరిగింది. ఈ మూడింటినీ కలిపి మహాగుజరాత్ అన్న భావన గుజరాతీలకు ఇష్టమైన భావన. భాషాప్రయుక్త రాష్ట్రాలుగా రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించడానికి నియమింపబడిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం, బొంబాయి రాష్ట్రాన్ని ద్విభాషారాష్ట్రంగా ఏర్పరచాలని సిఫారసు చేసింది. కానీ ఈ ప్రయోగం పనిచేయలేదు. గుజరాత్‌లో విస్తృతమైన ఆందోళనకు ఇది దారితీసింది. చివరికి 1960 లో బొంబాయి రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ఆమోదింపబడింది. దీని ప్రకారం మహారాష్ట్ర, గుజరాత్ రెండు ప్రత్యేకరాష్ట్రాలుగా ఏర్పడ్డాయి.

గుజరాత్ రాష్ట్రం ఏర్పడడంతోనే కొత్త రాష్ట్రానికి రాజధానీనగరం ఎక్కడ ఉండాలనే ప్రశ్న తలెత్తింది. రాజరిక పట్టణం బరోడా, పారిశ్రామిక పట్టణం అహ్మదాబాదు రెండూ పోటీ పట్టాయి.

స్వాతంత్ర్యం రాకముందే శాయాజీ రావు ప్రతాప్‌సింగ్ ఆధిపత్యంలో బరోడా, పురోగమనశీలంగా అభివృద్ధి చెందింది.ఈ రాజులు విద్య మీద కేంద్రీకరించారు. చివరికి రాజధానిపోటీలో బరోడా వెనకబడిపోయింది. బరోడా పాలకులు మహారాష్ట్ర అనుకూల విధానాన్ని అనుసరించారని భావించడం దీనికొక కారణమైతే, ఇతర కారణాలు అధిక జనసమ్మర్దం, తగినంత విద్యుచ్ఛక్తి లభించకపోవడం.

ఇప్పుడు రాజధానీనగరం ఎంపికకు పోటీలో అహ్మదాబాదు మాత్రమే మిగిలింది. అహ్మదాబాదు పారిశ్రామిక వర్గాలు అహ్మదాబాదులో రాజధాని స్థాపనను సమర్థించాయి. అహ్మదాబాదు రాజధాని అవుతుందని ముందుగానే ఊహించి, నగరం చుట్టుపక్కల భూములు కొనుక్కున్నారు. అహ్మదాబాదు నగరంలో కూడా ఉన్న అధిక జనసమ్మర్దం, అది నూతన రాష్ట్ర రాజధాని కావడంలో ఆటంకంగా పరిణమించింది.

ఇక ప్రత్యామ్నాయం అహ్మదాబాదుకు ఉత్తరంగా 15 మైళ్ల దూరంలో ఉన్న గాంధీనగర్. కొత్త రాష్ట్రం ఏర్పాటు ప్రకటనకు రెండు నెలలముందు అప్పటి ముఖ్యమంత్రిగా ప్రకటింపబడిన వ్యక్తి కొత్త రాజధానీనగరప్రాంతాన్ని గుర్తించి, ప్రకటించారు.

ఈ స్థలాన్ని ఎంపిక చేయడంలో ముఖ్యమైన కారణాలు తక్కువ ధరలో భూమి అందుబాటులో ఉండడం సబర్మతీనదికి సమీపంలో ఉండడం వల్ల నీటి సరఫరాకు సమస్య లేకపోవడం. భవన నిర్మాణానికి అనుగుణమైన నేల ఉండడం, జాతీయ రహదారికి సమీపంలో ఉండడం.

చండీగఢ్ పట్టణాన్ని నిర్మించిన లీ కార్బూజియర్‌కు భిన్నంగా స్థానిక పారిశ్రామిక ఆసక్తులు కొత్త నగర నిర్మాణానికి అమెరికన్ ఆర్కిటెక్టు లూయిస్ కాన్‌ను కోరుకున్నాయి. అప్పటికతను ఐఐఎం అహ్మదాబాదును నిర్మిస్తున్నాడు. అహ్మదాబాదులోని పారిశ్రామిక వర్గం రాజధానీనగర నిర్మాణం ఇతను చేపట్టాలని కోరుకున్నప్పటికీ, విదేశీ మారకద్రవ్యంలో అతనికి డబ్బు చెల్లించే సమస్య కేంద్రప్రభుత్వంతో పరిష్కారం కాకపోవడంతో, అతను ఈ పని చేపట్టలేకపోయాడు. చండీగఢ్ నిర్మాణంలో లె కర్బూజ్యె కింద పనిచేసిన భారతీయ ఆర్కిటెక్టు మేవాడ గాంధీనగర్ రాజధానీనగర ప్రణాళికీకరణ నిర్మాణబాధ్యతలు స్వీకరించాడు. ఆ విధంగా భారతీయ వాస్తు నిపుణులే ప్రణాళికీకరించి, నిర్మించిన నిజమైన భారతీయ నగరంగా గాంధీనగర్ రూపొందింది. గుజరాత్ రాష్ట్రం 1960 లో ఏర్పడినప్పటికీ రాజధానీనగరం పూర్తి రూపం దాల్చటానికి ఒక దశాబ్దం పట్టింది. 1970 లో సచివాలయం సిబ్బంది గాంధీనగర్‌కు మారింది. కానీ హై కోర్టు అహ్మదాబాదు నుండే పనిచేస్తూఉంది.

ఆ విధంగా మూడు భిన్నరాష్ట్రాల నూతన రాజధానులుగా మూడు పెద్ద నగరాల నిర్మాణాన్ని ప్రణాళికీకరించడం, నిర్మించడం అన్నది భిన్నంగా జరిగింది. ఫలితాలు భిన్నంగానే ఉన్నాయి. వీటిలో అత్యుత్తమ ఉదాహరణ చండీగఢ్. నాటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ వ్యక్తిగతమైన ఆసక్తి తీసికొని ఆర్కిటెక్టు లె కర్బూజ్యెకు స్వాతంత్ర్యమిచ్చి ఆధునిక పద్ధతిలో సంప్రదాయపు అడ్డంకులు లేకుండా నిర్మింపజేశారు. తదనుగుణంగా స్వల్పసమయంలోనే చక్కగా ప్రణాళిక రచించిన పట్టణంగా చండీగఢ్ ఏర్పడింది. పాకిస్తాన్ నుండి వచ్చిన కాందిశీకుల ప్రభావాన్ని తట్టుకోగలిగింది. అవిభాజిత పంజాబు రాష్ట్రానికి అనంతరం పంజాబు – హర్యానాలకు ఉమ్మడి రాజధానిగా పనిచేస్తూ ఉంది. రెండవ స్థానం గాంధీనగర్‌ది అయితే, భువనేశ్వర్‌ది మూడవస్థానం. గాంధీ తాత్త్వికతను కలుపుకోవడంపై ఊనిక గాంధీనగర్ నిర్మాణంలోనూ, ఆలయ నిర్మాణరీతిని కలుపుకోవడం భువనేశ్వర్

నిర్మాణంలోనూ ఒక సమ్మిశ్రమ ధోరణిని కల్పించింది కానీ, అది ఉన్నతస్థాయిని అందుకోలేకపోయింది. నెహ్రూ చూపించిన గొప్ప ఆసక్తి చండీగఢ్ నిర్మాణంలో బాగా పనిచేసింది. నగర పథకం రచించడానికీ, మార్గదర్శకత్వం వహించడానికీ, నిర్మాణపర్యవేక్షణకూ తగిన ఆర్కిటెక్టులు లభించకపోవడం, నిధుల కొరత మిగిలిన రెండు నగరాల నిర్మాణంలో లోపాలకు కారణమయ్యాయి.

# 5. 21వ శతాబ్దపు రాజధానీనగరాలు

**21**వ శతాబ్దపు ప్రారంభంలో ఎన్డీఏ ప్రభుత్వ పరిపాలన కాలంలో దీర్ఘకాలంనుంచి ప్రత్యేక రాష్ట్రం కోసం చేస్తున్న మూడు డిమాండ్లను అంగీకరించడం జరిగింది. దాని ప్రకారం అప్పటి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుండి పర్వత ప్రాంతాలను వేరు చేసి ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని ఏర్పరిచారు. బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల గిరిజన ప్రాంతాలను వేరుచేసి, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఏర్పరిచారు. ఈ రాష్ట్రాల రాజధానీనగరాల స్థలాల గురించి ఈ అధ్యాయంలో చర్చిద్దాం.

## భారతీయ అనుభవం – ఉత్తరాఖండ్

ఉత్తరప్రదేశ్ నుండి వేరుచేసి దాదాపు కుమావ్, గడువాల్ ప్రాంతాలనన్నింటినీ కలిపి నవంబర్ 2000 లో ఉత్తరాఖండ్ ప్రత్యేకరాష్ట్రాన్ని ఏర్పరిచారు. ఉత్తరాఖండ్ తాత్కాలిక రాజధాని డెహ్రాడూన్ రాష్ట్రంలోని పెద్ద నగరం, దేశ రాజధాని కొత్త ఢిల్లీకి సమీపంలో ఉంది. హై కోర్టు మాత్రం నైనిటాల్‌లో ఉంది. వీరేంద్ర దీక్షిత్ చైర్మన్‌గా 2001 లో రాష్ట్రానికి శాశ్వత రాజధానీ స్థలాన్ని గుర్తించడానికి ఏకసభ్య కమిటీని నియమించారు. కమిటీ 2008 లో నివేదిక సమర్పించింది. ప్రభుత్వం నుంచి సరైన సమర్థన లేకపోవడం వల్ల నివేదికనివ్వడానికి ఏడేళ్ల సమయం పట్టిందని కమిటీ చెప్పింది. రాష్ట్రానికి శాశ్వత రాజధానిని నిర్ణయించడంలో కమిటీ చేస్తున్న జాప్యానికి వ్యతిరేకంగా హై కోర్టులో ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారు. ఆ తరువాత కమిటీకి సిబ్బంది సహాయం వంటి వాటి లోపాన్ని చూపిస్తూ, చివరికి కమిటీ తన నివేదికను సమర్పించింది. తాత్కాలిక రాజధాని అయిన డెహ్రాడూనే శాశ్వత రాజధానిగా అనుగుణమైందని నివేదిక తెల్పింది. దీనికి ప్రధాన కారణాలు దేశ రాజధానికి దగ్గరగా ఉండడం, కేంద్రీకృత జనాభా, జాతీయ ఉత్పాతాలు సంభవించే అవకాశం ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండడం.

కాని ప్రజల ఎంపిక చెమోలీ జిల్లాలో ఉన్న గైర్ సైన్. ఇది కుమావ్, గడువాల్ ప్రాంతాలకు సమానదూరంలో ఉంటుంది. ఈ రెండు ప్రాంతాలూ తమ స్వీయసాంస్కృతిక గుర్తింపును కలిగి ఉండి, రాజకీయంగా పోటీ పడుతున్నాయి. గైర్‌సైన్‌ని ఎంచుకోవడం ఈ రెండు ప్రాంతాల మధ్య వివాదాన్ని తొలగించడం కోసం. కాని ఈ నాటికీ కూడా శాసన సభ వంటి కొద్ది భవనాలు తప్ప రాజధానిని డెహ్రాడూన్ నుంచి గైర్‌సైన్‌కు మార్చే ప్రయత్నాలేమీ జరగలేదు. అప్పుడప్పుడూ రాజధాని తరలింపు కోసం ఆందోళనలు కూడా జరుగుతున్నాయి. రియల్ ఎస్టేట్ ఆసక్తులు, లేదా పెద్ద నగరంలో నివసించాలనుకునే అధికారులు, తదితరులు, రాజధానిని గైర్‌సైన్‌కు తరలించాలనే పర్వతప్రాంత ప్రజల కోరిక – వీటిలో ఏది చివరకు విజయం సాధిస్తుందో వేచి చూడాలి. రాష్ట్రం ఏర్పడిన 18 ఏళ్ల తరువాత కూడా ఈ నాటికీ తాత్కాలిక రాజధాని డెహ్రాడూనే కొనసాగుతూ ఉంది.

## ఝార్ఖండ్ రాజధాని రాంచీ

2000 సంవత్సరంలో బీహార్ నుండి ఝార్ఖండ్ విడిపోయినప్పుడు రాజధానిగా రాంచీ ఎంపిక యాంత్రికమే. బీహార్, ఒరిస్సా కలిసి ఉన్న కాలంలో రాంచీయే అసలు రాజధాని. తరువాత బీహార్ రాజధాని పాట్నాకు మారింది. అయినా బీహార్ రాష్ట్ర వేసవి రాజధానిగా రాంచీయే పనిచేసింది. బ్రిటిషు వారి కాలంనుండీ రాంచీలో రాజధానికి కావలసిన కొన్ని మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ కార్యాలయ భవనాలు ఏర్పడ్డాయి. జంషెడ్‌పూర్, ధన్‌బాద్ వంటి పెద్ద పట్టణాలు ఉన్నప్పటికీ వాటి విషయంలో పెద్ద చర్చ జరగలేదు. అప్పటికే నిర్మితమైన మౌలిక సదుపాయాలు ఉండడం, వాతావరణం అనుకూలంగా ఉండడం వల్ల ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీ రాజధానిగా నడవడం ప్రారంభించింది.

## ఛత్తీస్‌గఢ్ – దాని రాజధాని

2000లో మధ్యప్రదేశ్ నుండి ఛత్తీస్‌గఢ్ విడిపోయినప్పుడు దాని రాజధాని ఎక్కడ ఉండాలన్న విషయంలో చర్చ అవసరం కాలేదు. పెద్ద రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌కు కేంద్ర ప్రాంతంలో ఉన్న రాయపూర్ సహజంగానే రాజధాని అయింది. అది అప్పటికే ఒక ముఖ్యమైన పట్టణం. బిలాస్‌పూర్, కోర్బా వంటి పట్టణాలు ఉన్నప్పటికీ అవేవీ జనాభా విషయంలో రాయపూర్‌తో పోటీ పడలేవు. అందువల్ల రాయపూర్ సహజమైన ఎంపిక

అయింది. అయితే త్వరలోనే రాయపూర్‌లో  ఉన్న మౌలిక సదుపాయాలు సరిపోవని ప్రభుత్వం గ్రహించింది. అందువల్ల ఒక ఆధునిక నగరంగానూ, రాష్ట్ర రాజధానిగానూ కూడా వ్యవహరించడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి ఒక ప్రణాళికాబద్ధమైన కొత్త నగరాన్ని నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆలోచన 2008 లో వచ్చింది. తదనుగుణంగా రాయపూర్ నగరానికి 30 కి.మీ.ల దూరంలో నయా రాయపూర్ అన్న కొత్తనగరానికి ప్రణాళిక వేసి నిర్మించడం జరిగింది. నయా రాయపూర్ అభివృద్ధి సంస్థ 8 వేల హెక్టార్ల ప్రదేశంలో ప్రపంచస్థాయి నగరాన్ని నిర్మించడానికి ప్రణాళిక రూపొందింది. నయా రాయపూర్ జనాభా 2031 నాటికి 5.6 లక్షలకు చేరుతుందని అంచనా. రాజధానీనగరానికి కావలసిన మొత్తం భూమిని భూసేకరణ పద్ధతి ద్వారా సేకరించడం జరిగింది. ఎక్కువ భూమిని భూయజమానుల అంగీకారం ద్వారా సేకరించారు. నయా రాయపూర్ అభివృద్ధి సంస్థ చైర్మన్ బైజయేంద్ర కుమార్‌తో నేను వ్యక్తిగతంగా చాలాసార్లు మాట్లాడాను. నయా రాయపూర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆయన ఏడేండ్లపాటు సంస్థ చైర్మన్‌గా ఉన్నారు. రాజధానిని రాయపూర్ నుండి తరలించాలని తీసుకున్న నిర్ణయానికి కారణం రాయపూర్‌లో తగినన్ని మౌలిక సదుపాయాలు లేకపోవడం, పెద్దసంఖ్యలో స్పాంజి ఐరన్ కర్మాగారాలు ఉండడం వల్ల ఏర్పడుతున్న కాలుష్యం ముఖ్యమైనవి. రాయపూర్‌కి దూరంగా మరో రాజధాని కట్టవలసిన ఆవశ్యకత ఏర్పడింది. భారత ప్రభుత్వం నుండి ధనసహాయం ఏమీ రాలేదు. నయా రాయపూర్ అభివృద్ధి సంస్థ రాష్ట్రప్రభుత్వం నుండి 500 కోట్ల రూపాయలు అప్పు తీసుకుని, ప్రాజెక్టు ప్రారంభించింది. 11 అంతర్జాతీయ కంపెనీలు స్థలం ఎంపిక బాధ్యతను చేపట్టాయి. ఎంపికకు 33 ప్రమాణాలు రూపొందించారు. 11 కంపెనీలలో 9 విభిన్న స్థలాలను పరిశీలించి, ప్రస్తుత స్థలాన్ని ఎంపిక చేశాయి. గ్రామస్థులకు తగినంత పరిహారం చెల్లించారు. భూసేకరణలో అధికభాగం కాన్‌సెంట్ అవార్డు పద్ధతిలో జరిగింది. ఛత్తీస్‌గఢ్‌లో చేసిన ఒక లాండ్ పూలింగ్ ప్రయోగం పూర్తిగా విఫలమైంది. శ్రీ చంద్రబాబు నాయుడు, వారి జట్టు 2014 లో ఛత్తీస్‌గఢ్‌ను సందర్శించినప్పుడు, ఆయనకు ప్రత్యేకంగా రాజధానీనగర స్థలం వ్యవసాయభూమిలో ఉండకూడదనీ, లాండ్ పూలింగ్ పద్ధతిని అనుసరించడం వల్ల సమస్యలు వస్తాయనీ హెచ్చరించామని బైజయేంద్రకుమార్ నాకు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో లాండ్ పూలింగ్ ప్రయోగం ఎలా ఒక వైఫల్యంగా మిగిలిపోయిందీ కూడా తెలియజేశారు.

# 6. శతాబ్దాల కాల పరిణామంలో ఆంధ్రుల రాజధానీనగరాలు

మహాభారతం కురుక్షేత్ర యుద్ధంలో ఆంధ్రులు కౌరవుల పక్షాన యుద్ధం చేసినట్లు చెప్తున్నది. వింధ్యపర్వతాలకు దక్షిణప్రాంతంలో నివసిస్తున్న ఒక జాతిగా ఐతరేయబ్రాహ్మణం ఆంధ్రులను పేర్కొంది. వీరు విశ్వామిత్ర మహర్షి కుమారులనీ, ఆయన వల్ల శాపం పొంది వింధ్యపర్వతాలకు దక్షిణాన స్థిరపడ్డారని పురాణకథనం.

ఆంధ్రులకు సంబంధించి క్రీ.పూ. 2వ శతాబ్ది నుండి క్రీ.శ. 2వ శతాబ్ది వరకు భారతదేశంలోని ప్రధాన భూభాగాలను పరిపాలించిన అతి ప్రాచీన రాజవంశం శాతవాహన వంశం. శాతవాహనుల రాజధాని ధాన్యకటకం నేటి ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతికి సమీపంలో ఉంది. పురాతత్త్వశాస్త్రవేత్తలు ఇక్కడ ఆ నాటికి చెందిన బౌద్ధనిర్మాణాల శిథిలాలను కనుగొన్నారు. శాతవాహనులు తమ రెండవ రాజధానిగా ప్రస్తుత మహారాష్ట్ర ప్రాంతంలోని ప్రతిష్ఠానపురాన్ని ఎంచుకున్నారు. విదేశీయుల దండయాత్రలను – ముఖ్యంగా హూణుల దండయాత్రలను – ఎదుర్కొనడానికి ఇది తోడ్పడుతుందని వాళ్లు భావించారు. భారతదేశమంతటా వ్యాపించిన ఒక బలమైన సామ్రాజ్యాన్ని శాతవాహనులు స్థాపించారు. మంచి పరిపాలనను అందించారు. హిందూ బౌద్ధమతాలు రెండింటినీ ప్రోత్సహించారు.

శాతవాహన సామ్రాజ్యపతనం తరువాత అనేక చిన్నచిన్న రాజ్యాలు నేటి ఆంధ్రప్రదేశ్ విభిన్నప్రాంతాలలో స్థాపించబడ్డాయి. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని గణనీయమైన భూభాగాన్ని పరిపాలించిన తూర్పుచాళుక్యులు ఆవిర్భవించేంతవరకూ ఈ చిన్నరాజవంశాల పరిపాలన కొనసాగింది. ఇక్ష్వాకు రాజులు విజయపురి రాజధానిగా నేటి గుంటూరు, ప్రకాశం, కడప, కర్నూలు ప్రాంతాలను నూరేళ్లపాటు

పరిపాలించారు. బృహత్పలాయనులు నేటి కృష్ణాజిల్లా ప్రాంతాన్ని పరిపాలించారు. వీరి రాజధాని కుందూరు. అవనిగడ్డ లేదా మచిలీపట్నానికి సమీపంలో ఉంది. శాలంకాయనులు ఏలూరుకు దగ్గరగా ఉన్న పెదవేగి కేంద్రంగా పరిపాలించారు. ఆనంద గోత్రికులు కృష్ణానదికి దక్షిణాన ఉన్న కర్మ రాష్ట్రాన్ని పరిపాలించారు. వీరి రాజధాని కందరపురం. నేటి గుంటూరు జిల్లాలోని కంతేరు.

వింధ్య పర్వతాలకు దక్షిణాన ఉన్న అధికప్రాంతాన్ని పరిపాలించిన ముఖ్యమైన రాజవంశాలలో విష్ణుకుండినులు ఒకరు. వారి పరిపాలన నేటి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలకు వ్యాపించింది. వీరి రాజధాని కొంతకాలం బెజవాడ, మరికొంత కాలం దెందులూరు.

శాతవాహన సామ్రాజ్యం పతనమైన తరువాత ఈ చిన్న చిన్న రాజ్యాలు రాష్ట్రంలోని భిన్నప్రాంతాలను పరిపాలించాయి. తూర్పుచాళుక్యులు క్రీ.శ. 7వ శతాబ్ది నుండి 11వ శతాబ్ది వరకు మొదట పెదవేగి రాజధానిగా, తరువాత రాజమహేంద్రవరం రాజధానిగా, దాదాపు మొత్తం తీరాంధ్ర ప్రాంతాన్ని పరిపాలించారు. వేంగీ చాళుక్యుల పరిపాలన కాలంలోనే 9వ శతాబ్దిలో తూర్పుచాళుక్యుల సేనాని పండరంగు బెజవాడ కందుకూరు మధ్య బోయకొట్టాలను మట్టుబెట్టినట్టు అద్దంకి శాసనం చెపుతుంది. తెలుగులో ఇది తొలి పద్యశాసనం. తూర్పు చాళుక్యులు రాజమహేంద్రవరాన్ని తమ రాజధానిగా చేసుకున్న తరువాత, రాజరాజ నరేంద్రుని పరిపాలన కాలంలో ఆయన ఆస్థానకవి నన్నయ వ్యాసమహాభారతాన్ని తెలుగులోకి అనువదించడం ప్రారంభించాడు. ఇదే తెలుగులో మొదటి కావ్యం.

తూర్పు చాళుక్యుల తరువాత తెలుగు మాట్లాడే ప్రాంతాలను పరిపాలించిన ముఖ్యమైన రాజవంశం ఓరుగల్లు రాజధానిగా పరిపాలించిన కాకతీయవంశం. వీరి మతం శైవం. వీళ్లు ఎన్నో దేవాలయాలను కట్టించారు. సాగునీటికోసం ఎన్నో చెరువులు తవ్వించారు. ఢిల్లీ నుండి దండెత్తి వస్తున్న ముస్లిం ఆక్రమణదారులను కాకతీయులు చాలాకాలం విజయవంతంగా నిలువరించారు. కాని చివరికి ఓటమి పాలయ్యారు.

కాకతీయుల పరిపాలనానంతరం సింహాచలం నుంచి నెల్లూరు వరకు మొత్తం తీరాంధ్ర దేశాన్ని వందేళ్లపాటు రెడ్డి రాజులు పరిపాలించారు. రెడ్డి రాజుల మొదటి రాజధాని ప్రకాశం జిల్లాలోని అద్దంకి. తరువాత వారు తమ రాజధానిని గుంటూరు జిల్లాలోని కొండవీడుకు మార్చారు.

ఆంధ్రులు స్థాపించిన మహోన్నతమైన సామ్రాజ్యం 1336 లో స్థాపించిన విజయనగర సామ్రాజ్యం. ఈ సామ్రాజ్యాన్ని 1336 – 1565 మధ్య సంగమ, సాళువ, తుళువ అన్న మూడు భిన్న వంశాలు పరిపాలించాయి. వీరి రాజధాని తుంగభద్ర తీరంలోని హంపి. హంపి ఆ నాడు కేవలం ఒక రాజధాని పట్టణమే కాక, ఒక ముఖ్యమైన వాణిజ్యకేంద్రం కూడా. విజయనగర పతనం తరువాత తిరుమల రాయలు నేటి అనంతపురం జిల్లాలోని పెనుగొండ నుంచి పరిపాలన ప్రారంభించాడు. ఈ ఆరవీటి వంశ రాజులు తరువాతి కాలంలో చంద్రగిరిని రాజధానిగా చేసుకున్నారు. చెన్న పట్టణంలో వాణిజ్యకేంద్రాన్ని స్థాపించడానికి ఈస్టిండియా కంపెనీకి భూదానం చేసిన పాలకులు ఈ చంద్రగిరి పాలకులే.

ఈ ప్రాంతాన్ని పరిపాలించిన చివరి రెండు ముఖ్యమైన రాజవంశాలు కుతుబ్ షాహీలు, ఆసఫ్ జాహీలు. కుతుబ్ షాహీలు గోల్కొండ రాజధానిగా ఈ ప్రదేశాన్ని రెండు శతాబ్దాలు పరిపాలించారు. ఆసఫ్ జాహీలు మొదట తమ పరిపాలనను ఔరంగాబాదు నుండి ప్రారంభించి, తరువాత హైదరాబాదుకు మార్చారు. ఆసఫ్ జాహీల పరిపాలన మొదటి ఈస్టిండియా కంపెనీ నియంత్రణలోనూ, తరువాత బ్రిటిషు ప్రభుత్వ నియంత్రణలోనూ సాగింది. ఆసఫ్ జాహీలు హైదరాబాదు రాజ్యం స్వతంత్ర భారత సమాఖ్యలో విలీనమయ్యే వరకూ తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించారు.

# 7. శివరామకృష్ణన్ కమిషన్ – అమరావతి

రాజధానీనగర సైద్ధాంతిక నేపథ్యాన్నీ, అంతర్జాతీయ జాతీయ అనుభవాలనూ పరిశీలించిన తరువాత, ఈ అధ్యాయంలో మన అమరావతి స్థల నేపథ్యాన్నీ, అమరావతికి సంబంధించిన ప్రత్యేక సమస్యలను విశ్లేషిద్దాం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం కింద సెక్షన్–6 ఏర్పడబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన రాజధానికి వివిధ ప్రత్యామ్నాయాలను అధ్యయనం చేయడానికి ఒక నిపుణుల కమిటీని నియమించడానికి అవకాశం ఇస్తుంది. తదనుగుణంగా భారతప్రభుత్వం శ్రీ శివరామకృష్ణన్ చైర్మన్‌గా ఒక కమిటీని నియమించింది. శ్రీ శివరామకృష్ణన్ భారతప్రభుత్వంలో పట్టణాభివృద్ధి శాఖకు మాజీ కార్యదర్శి. ఈ కమిటీ సభ్యులలో ఈ రంగంలో ప్రసిద్ధి చెందిన వ్యక్తులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ డైరెక్టర్ డా. రతిన్ రాయ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ అర్బన్ ఎఫైర్స్ డైరెక్టర్ ప్రొ. జగన్ షా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ హ్యూమన్ సెటిల్మెంట్స్ డైరెక్టర్ అరోమార్ రవి, స్కూల్ అఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ మాజీ డీన్, ప్రొ. రవీంద్రన్ ఉన్నారు.

ఈ కమిటీని నియమిస్తూ భారతప్రభుత్వం అది పరిశీలించవలసిన అంశాలలో సాగులో ఉన్న వ్యావసాయిక వ్యవస్థలకు అతి తక్కువ భంగం కల్గించడం, ప్రాంతీయ పర్యావరణాన్ని పరిరక్షించడం, వాతావరణ రీత్యా, పరిసరాల రీత్యా స్థిరంగా కొనసాగించగలిగిన అభివృద్ధిని ప్రోత్సహించడం, ప్రకృతి బీభత్సాల ప్రమాదాలను అంచనా వేయడం, నిర్మాణ వ్యయాన్ని కనిష్ఠస్థాయిలో ఉంచడం, భూసేకరణను కనిష్ఠస్థాయిలో ఉంచడం అన్న వాటిని పేర్కొన్నది. మార్చి 2014 లోనే ఏర్పరచినప్పటికీ ఈ కమిటీ తన పనిని కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత జూన్ నెల

నుండి మాత్రమే ప్రారంభించింది. అందువల్ల వాస్తవానికి నివేదికను తయారుచేసి, సమర్పించడానికి దానికి 3 నెలల సమయం మాత్రమే లభించింది. రాజధానీనగరాన్ని ఎక్కడ ఏర్పాటుచేయాలో రాష్ట్రప్రభుత్వం తమ కమిటీ నివేదిక సమర్పించక ముందే ఒక నిర్ణయాన్ని తీసుకున్నదన్న విషయం తెలిసిన కమిటీ ఉన్న పరిస్థితులలో భారత ప్రభుత్వం తనను పరిశీలించమన్న అంశాలదృష్ట్యా అన్ని సంభావ్యాలను పరిశీలించి ఒక నివేదికను సమర్పించింది. రాజధానీనగర స్థలంపై అప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినందున రాష్ట్రప్రభుత్వం కూడా కమిటీ విషయంలోనూ, దాని నివేదిక విషయంలోనూ ఎటువంటి శ్రద్ధ చూపించలేదు. కమిటీకి రాష్ట్రప్రభుత్వం తోడ్పాటు కనిష్ఠస్థాయిలో ఉంది. కొన్నిసార్లు కమిటీకి తెలియవలసిన ముఖ్యమైన సమాచారాన్ని ప్రభుత్వం కమిటీతో పంచుకోనేలేదు. ఈ విషయాన్ని కమిటీ తన నివేదికలో పేర్కొన్నది కూడా. ప్రభుత్వం మరోవైపు ప్రత్యేకంగా తన సొంత కమిటీని ఒకదాన్ని ఏర్పాటుచేసింది. అందులో స్థానిక రాజకీయనాయకులు, స్థానిక కేపిటలిస్టులు సభ్యులు. చట్టపరిధిలో భారతప్రభుత్వం నియమించిన కమిటీ ప్రాధాన్యాన్ని తగ్గించడానికి వ్యూహాత్మకంగా రచించిన ప్రణాళిక ఇది.

కమిటీ ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అనే తన ప్రధాన లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుంది. వివిధ రాజధాని కార్యకలాపాల నిర్వహణలో రాజధాని స్థలం ఏ విధంగా తోడ్పడుతుందో పరిశీలించింది. ప్రభుత్వ కార్యకలాపాలకు తమకు ఇష్టమైన ఒకటి రెండు ప్రాంతాలను నిర్ణయించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవహారం పట్ల కొన్ని ప్రాంతాల ప్రజలకు – ముఖ్యంగా రాయలసీమ వారికి – కొన్ని భయాలున్నట్లు కమిటీ గుర్తించింది. కమిటీ ముందు ఆ ప్రాంతంవారు తమ భయాలను వెల్లడించారు.

కమిటీ మూడు సంభావ్యధోరణులను పరిశీలించింది. వాటిలో మొదటిది ఒక హరితక్షేత్ర మహానగర నిర్మాణం. అది రాజధానీనగరంగా కూడా పనిచేస్తుంది. రెండు, ఉన్న పట్టణాలలోనే ఉన్న నగరాలను విస్తృతీకరించడం. మూడు, ప్రభుత్వ కార్యకలాపాలను రాష్ట్రవ్యాప్తంగా భిన్న ప్రదేశాలకు పంపిణీ చేయడం. వాళ్లు ముందుగా ఒక హరిత క్షేత్ర నగర నిర్మాణ అవకాశాన్ని పరిశీలించి, దాని వల్ల ప్రత్యేకంగా ఒనగూడే ప్రయోజనమేదీ లేదన్న నిర్ణయానికి వచ్చారు.

ఆ నాడు రాజధానీనగరం గుంటూరు – విజయవాడ ల మధ్య ఉండవచ్చునని జరుగుతున్న ప్రచారం మీద కూడా కమిటీ వ్యాఖ్యానించింది. అన్ని ప్రభుత్వ

కార్యాలయాలనూ విజయవాడ – గుంటూరు పరిసరాలలో కేంద్రీకరించే ప్రయత్నం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాల అభివృద్ధి అవకాశాలు దెబ్బతింటాయని అది హెచ్చరించింది. ప్రైవేటు, స్పెక్యులేటివ్ పెట్టుబడినంతా ఈ రాజధానీప్రాంతమే రాబట్టుకుంటుందని కూడా కమిటీ హెచ్చరించింది. హైదరాబాదులోలాగ కాకుండా గుంటూరు, విజయవాడలలో వ్యవసాయ సాగుభూముల సమస్యను కూడా కమిటీ అధ్యయనం చేసింది. మహానగరంగా ఆ ప్రాంతం అభివృద్ధిని ఇది అడ్డుకుంటుందని కూడా కమిటీ భావించింది. తుదిగా ఈ ప్రాంతంలో భారీగా పెట్టుబడినీ, జనాభానీ ప్రవేశపెట్టడం అవాంఛనీయమనీ, హైదరాబాదులోలాగ ఇది కూడా తేనెకుండ (honeypot)ప్రభావాన్ని కలిగిస్తుందని కమిటీ భావించింది. విజయవాడ – గుంటూరు ప్రాంతంలో ఒకవేళ కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఉంచదలిస్తే వాటిని ముసునూరు, నూజివీడు, అమరావతి లేదా పులిచింతల వంటి ప్రాంతాలలో ఏర్పరచాలని కమిటీ సూచించింది. వాళ్లు ప్రధానంగా అవలంబించిన ప్రమాణం విజయవాడ – గుంటూరు ప్రాంతంలో ఉన్న మెట్టభూములు. ఇవి కార్యాలయాల నిర్మాణానికి అనుగుణమైన ప్రదేశాలు. రాష్ట్రప్రభుత్వం నిజంగా తమతో సహకరించనందున అవసరమైన సమాచారాన్నంతా అందించనందున నివేదికలోకి కొన్ని పొరపాట్లు వచ్చి చేరాయి. అటువంటి వాటిలో ఒకటి పులిచింతలను సూచించడం. అది గుంటూరు – విజయవాడ ప్రాంతంలో ఒక భాగమని భావించి, అక్కడ కొన్ని రాజధానీనగర కార్యకలాపాలను ఏర్పరచాలని సూచించడం. ఈ కమిటీ సూచించిన అమరావతి ప్రస్తుతం రాజధానీనగరాన్ని నిర్మిస్తున్న అమరావతి కాదు, చారిత్రక మతప్రధానమైన పట్టణం. ప్రస్తుత రాజధానీనగరస్థలానికి 20 కి.మీ.ల దూరంలో ఉంది. అది మెట్టభూముల పరిధుల్లోనే ఉంది. ఆ విధంగా హరితక్షేత్ర మహానగరాన్ని కొత్తరాష్ట్ర ఆంధ్రప్రదేశ్ రాజధానిగా నిర్ణయించే ప్రయత్నానికి కమిటీ పూర్తి వ్యతిరేకంగా ఉంది. ఒకవేళ గుంటూరు – విజయవాడ ప్రాంతంలో అది రాష్ట్ర కేంద్రప్రాంతంలో ఉంది కాబట్టి, ఆ కార్యాలయాలను స్థాపించడానికి నిర్ణయించినట్లయితే ఆ కార్యాలయాలను వ్యవసాయ సాగుభూములు ఉన్న ప్రాంతంలో కాక, అదే ప్రాంతంలోని మెట్టప్రదేశంలో ఏర్పరచాలని సూచించింది.

కొత్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాజధానీనగర కార్యకలాపాలను భిన్నప్రాంతాలలో ఏర్పరచడమన్న ప్రత్యామ్నాయవిధానాన్ని కూడా కమిటీ పరిశీలించింది. విజయవాడ – గుంటూరు ప్రాంతంతో పాటు అది వైజాగ్ ప్రాంతంతో కూడిన ఉత్తరాంధ్ర,

రాయలసీమ చాపం, కాళహస్తి – నడికుడి వెన్ను ప్రదేశాలను మూడు భిన్న ప్రాంతాలలో గుర్తించింది. హై కోర్టును వైజాగ్‌లోను, పైన పేర్కొన్న కారణాలరీత్యా తక్కిన ప్రభుత్వ కార్యకలాపాలను విభిన్న ప్రాంతాలకు పంపిణీ చేయడం మంచిదని కమిటీ సూచించింది.

హరితక్షేత్ర రాజధానీనగరస్థాపనకు భూసేకరణను తిరస్కరించి, లాండ్ పూలింగ్ కూడా పూర్తిగా ఉపయుక్తమైన మార్గం కాదని తన విపులమైన అధ్యయనంపై ఆధారపడి కమిటీ అభిప్రాయపడింది.

భారతప్రభుత్వం నియమించిన పట్టాణాభివృద్ధి రంగంలో పేరుగాంచిన నిపుణులతో కూడిన ఈ కమిటీ గొప్ప నిరాశతో వెనుదిరగవలసివచ్చింది. రాష్ట్రప్రభుత్వం వారితో సహకరించడానికి ఏ మాత్రం ముందుకు రాకపోవడం, వారి సేవలను వినియోగించడానికి ఇచ్ఛగించకపోవడం ఇందుకు కారణం. కమిటీ సభ్యులు రాష్ట్రానికి వచ్చే సమయానికే కొత్త ప్రభుత్వం ఏర్పడి కొత్త రాజధానీనగర స్థలంపై ఒక నిర్ణయానికి వచ్చింది. ఈ నిర్ణయానికి ఆధారం వాణిజ్య, కులపరమైన, రియల్ ఎస్టేట్ పరమైన ఆసక్తులు. అందువల్ల ప్రభుత్వ నిపుణుల కమిటీని గాని, దాని పనిని గాని సీరియస్‌గా పట్టించుకోలేదు. కమిటీని నియమించిన సమయంలో నిర్ణయించిన కాలపరిధి కారణంగా జూన్ మాసాంతంలో పని ప్రారంభించిన కమిటీకి తన నివేదికను సమర్పించడానికి మూడునెలలకు మించిన సమయం లభించలేదు. కమిటీ సభ్యులు నివేదిక సమర్పణకు మరికొంత వ్యవధి అడిగి తమ కాలాన్ని పొడిగించుకోవచ్చు. కాని రాష్ట్రప్రభుత్వం ఎక్కడ రాజధానీనగరాన్ని నిర్మించాలన్న విషయంలో నిర్ణయం తీసేసుకున్నందున మరింత వ్యవధి కోరడం వ్యర్థమని కమిటీ గ్రహించింది. రాజధానీనగర స్థల విషయంలో రాష్ట్రప్రభుత్వం అనుసరించదలచుకున్న కార్యప్రణాళికపై తమ సిఫారసులకు ఎటువంటి ప్రాముఖ్యమూ ఉండదని కమిటీ సభ్యులకు బాగా తెలుసు. రాజధానీనగరం ఎక్కడ ఉండాలన్న విషయంలో నిర్ణయం కేంద్రప్రభుత్వంతో సంప్రతించి రాష్ట్రప్రభుత్వం తీసికొనవలసిందే తప్ప మరొకటి కాదని, కమిటీ తన నివేదిక మొదటి పుటలోనే స్పష్టంగా రాసింది. తనకు లభించిన ఆధారాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం నుండి తాను సంపాదించగలిగిన సమాచారాన్ని క్రోడీకరించి విశ్లేషించడం, దాని ఆధారంగా తన సిఫారసులు అందించడం మాత్రమే తన బాధ్యతగా కమిటీ భావించింది.

ఈ గొప్ప వ్యక్తిని, అతని జట్టును లేక్‌వ్యూ అతిథిగృహంలో కలుసుకునే అవకాశం నాకు కలిగింది. ఇక్కడ కమిటీతో అధికారుల సమావేశం ఏర్పాటు జరిగింది. అప్పటికే ఆయన కాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. చికిత్స తీసికొంటున్నారు. కొద్దిరోజుల ముందే కీమోథెరపీ తీసుకున్నాననీ, ఇప్పుడు కమిటీ పనికి సంబంధించి సమావేశానికి వచ్చాననీ ఆయన నాకు చెప్పారు. కొత్తరాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు పరిపాలన రాజధానిగా దొనకొండను ప్రతిపాదిస్తూ నేను తయారుచేసిన కాన్సెప్ట్ నోట్ విషయం ఆయనకు తెలుసు. దొనకొండను పరిపాలన రాజధానిగా సూచించడానికి నేను ప్రమాణాలుగా తీసికున్న అంశాలు, నా దృక్పథం గురించి ఆయన చాలా ప్రశంసించాడు. రాజధానీనగర ప్రదేశంగా శివరామకృష్ణన్ కమిటీ ఒక నిర్దిష్ట ప్రదేశాన్ని సూచించలేదన్న అభిప్రాయాన్ని ప్రచారం చేస్తున్నారు. పరిపాలన రాజధానీనగరంగా వాళ్లొక ప్రదేశాన్ని సూచించదలచుకోలేదని కాదు, పరిమితమైన ప్రయోజనాలతో రాజధాని కార్యకలాపాలను ఎలా పంపిణీ చేయాలో వారి మనస్సులో ఉంది. వాళ్లు పని ప్రారంభించిన ఒక నెలలోపుగానే రాజధాని ఉండవలసిన చోటు గురించి రాష్ట్రప్రభుత్వం ఒక నిర్ణయం తీసేసుకున్నదని వాళ్లు గ్రహించగలిగారు. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్దిరోజుల్లోనే ఈ కమిటీకి అవమానకరంగా పట్టణాభివృద్ధి శాఖామంత్రి చైర్మన్‌గా, కొంతమంది స్థానిక పెట్టుబడిదారులు, స్థానిక రాజకీయ నాయకులతో కొత్త రాజధానికి తగిన స్థలాన్ని సూచించడానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. అందువల్ల రాజధాని స్థల నిర్ణయం రాష్ట్రప్రభుత్వ అధికార పరిధిలోకి వస్తుంది కాబట్టి, దానికి భిన్నంగా మరో సూచన చేయడం వల్ల ప్రయోజనం ఉండదని, పరిస్థితి సంక్లిష్టమవుతుందని శివరామకృష్ణన్ కమిటీ గుర్తించింది. పైగా కమిటీకి కావలసిన సమాచారాన్ని ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వాధికారులు సుముఖంగా లేరు. రాజధాని స్థలం అప్పటికే నిర్ధారణ అయిందని వారికి కూడా తెలుసు. అయినా కొత్త రాష్ట్రానికి కేంద్రీకృతమైన హరితక్షేత్ర నగరం సరైన ఎంపిక కాదని కమిటీ స్పష్టీకరించింది. రాజధాని కార్యకలాపాలను భిన్నస్థలాలకు పంపిణీ చేయాలని సూచించింది. రాజధాని నగరం నిర్మించవలసిన స్థలాన్ని నిర్దిష్టంగా సూచించకుండా వదిలివేసింది.

'రాజధానిపై కన్ను – లోపించిన దృష్టి' అన్న శీర్షికతో 2015 ఆగస్టు 15వ తేదీన 'హిందూ' పత్రికలో శివరామకృష్ణన్ రాసిన వ్యాసంలో ఇలా చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ఆంధ్రప్రదేశ్‌ను ఎదుర్కొంటున్న పెద్ద సమస్యలపై కేంద్రీకరించడానికి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడుకు చాలా సమయం ఇస్తున్నది. ఆయన ఈ సమస్యలపై దృష్టి పెట్టే బదులు రాజధానికి స్థలసేకరణ కోసం ఆలోచించడంలోనే కూరుకుపోయినట్లు కనిపిస్తూ ఉంది.

శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు అంటే నాకు చాలా అభిమానం. ముఖ్యంగా అవిభాజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గతంలో ఆయన సాధించిన కార్యాలకు నేను ఆయనను అభిమానిస్తాను. ఎందుకు? ఆయన ఆంధ్రప్రదేశ్‌ను ఒక పురోగమనశీలమైన సమాచార సాంకేతికత ప్రధానమైన ఆధునిక విద్యాకేంద్రంగా రూపొందించడంలో సఫలుడయ్యారు. తన ప్రయత్నాలలో బహుశా ఆయన బెంగళూరు పొందిన ప్రతిష్ఠ వల్ల ప్రభావితుడై ఉంటారు. ఈ సందర్భంగా ఆయన ప్రపంచంలో వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేసి, శిఖరాగ్ర సమావేశాలు నిర్వహించి, శక్తిమంతులైన వ్యాపారవేత్తలనూ, కంపెనీలను ఆకర్షించే ప్రయత్నం చేశారు. అవిభాజిత ఆంధ్రప్రదేశ్‌లో 1999 ప్రాంతంలో అతని పరిపాలన కాలంలో జి.డి.పి. రూ. 1700 బిలియన్లుగా ఉండింది (ఈపిడబ్ల్యు రీసెర్చ్ ఫౌండేషన్ సమాచారం). ఇప్పుడది 2014 లో రూ. 4,574 బిలియన్లు. ఈ పెరుగుదలకు ముఖ్యకారణం శ్రీ నాయుడు ప్రయత్నాలే అన్న విషయాన్ని కాదనలేం. వీటన్నిటికీ మించి ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రజలలో తమ రాష్ట్రం పట్ల ఒక స్వీయభావాన్నీ, గర్వాన్నీ కల్గించారు; ఆంధ్రప్రదేశ్ ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందన్న నమ్మకాన్ని కలిగించారు. దురదృష్టవశాత్తూ ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అభివృద్ధి విషయంలో – విజయవాడ, గుంటూరు మధ్య ప్రాంతంలో అమరావతి అని పిలవబడే ప్రాంతం – పూర్తిగా ఆయన్ని వశపరచుకున్నట్లనిపిస్తుంది.

## రైతులను వారి భూములనుండి తొలగించడం

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ప్రకారం దేశవ్యవహారాల శాఖ నియమించిన నా నేతృత్వంలోని నిపుణుల కమిటీ, తన పరిశీలనాంశాల్లో సాధ్యమైనంతవరకూ సారవంతమైన వ్యవసాయ భూములను తాకవద్దని నిర్దేశించింది. దీన్ని వివరిస్తాను. మొత్తం విజయవాడ – గుంటూరు – తెనాలి – మంగళగిరి ప్రాంతం ఆంధ్రప్రదేశ్ ధాన్యాగారంగా ప్రసిద్ధికెక్కింది; వాస్తవానికి నిస్సందేహంగా ఈ ప్రాంతం

భారతదేశపు ప్రధాన ధాన్యాగారాలలో ఒకటి. ఇప్పుడు తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాలలో రెండు పంటలు, మూడు పంటలు పండే భూముల్లో ముప్పైవేల ఎకరాల భూమిని తీసుకోవడం తాత్కాలిక ఆర్థిక లాభాలకోసం రైతులను తమ భూములనుంచి తప్పించడం ప్రభుత్వ హ్రస్వదృష్టి విధానానికి ఒక ఉదాహరణ. కొందరు రైతులు దీన్నొక అదృష్టంగా భావించవచ్చు. నగదు పరిహారాన్ని విలాసవస్తువులపై – పెద్ద కార్లు, పెద్ద బంగళాలు – ఖర్చు పెట్టే అవకాశం లభిస్తుంది. వాణిజ్య దుకాణాలు, వినియోగదారుల సమర్థనపై ఆధారపడతాయి. ఇటువంటి సందర్భంలో ఈ స్థాయి వినియోగదారుల సమర్థన ఐదు పదేళ్ల అల్పకాలానికి మాత్రమే పరిమితమవుతుంది. ఇప్పుడు ప్రభుత్వం కోరుకుంటున్న రకపు అభివృద్ధికి ఈ సమర్థన స్వల్పకాలికమే. తుళ్లూరు ఉత్తరభాగాన్ని రాజధానీనగర కార్యకలాపాలలో కీలకపాత్ర పోషించేదిగా నిర్ణయించినట్లు కనిపిస్తుంది. అయినా రాజధానీనగరమని చెప్పుకొనేదానికి సంబంధించి ఇంకా ఎటువంటి మాస్టర్ ప్లానూ అందుబాటులో లేదు. ఆన్‌లైన్‌లో ఏదీ దొరకడం లేదు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ వెబ్‌సైట్‌లో కూడా – ఎక్కడ ఏం ప్లాన్ చేస్తున్నారో తెలుసుకోవడం ప్రస్తుతం అసాధ్యంగా ఉంది.

## మౌలిక సదుపాయాల అభివృద్ధి

నేను గట్టిగా చెప్పదలచుకున్న మరో అంశం ముఖ్యంగా భూగర్భ జలమట్టం చాలా ఉన్నతంగా ఉన్నచోట నేలను సిద్ధం చేసే పని. కొంతభూమి అందుబాటులోకి వస్తుందని అనుకున్నప్పటికీ సంబంధిత పద్ధతిలో ఏకీకరణ, రోడ్డు సదుపాయాలు, అనేక ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికీ, అభివృద్ధికీ చాలా సమయం పడుతుంది. స్వాతంత్ర్యం వచ్చిననాటినుండి భారతదేశం నిర్మించిన సుమారు నూరు పట్టణాల విషయంలో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు దాదాపు ఏడెనిమిదేళ్లు పట్టింది. ఒకటి రెండు పెద్ద పరిశ్రమలను నెలకొల్పడం, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలను తీర్చడానికి ఇంత సమయం. చండీగఢ్, భువనేశ్వర్, గాంధీనగర్, ఉక్కు పట్టణాలు బొకారో, దుర్గాపూర్, రూర్కేలా కూడా ఈ వంద పట్టణాలలో ఉన్నాయి. అందువల్ల ఐదేళ్లలో ఇవన్నీ పూర్తవుతాయని ఆంధ్రప్రదేశ్ చెప్పుకోవడం పూర్తిగా అతిశయోక్తి తప్ప మరొకటి కాదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందున్న అత్యంత గంభీర సమస్య ఏడాదికి మూడులక్షలకు పైగా ఉద్యోగాల కల్పన, గణనీయమైన అధిక ఉత్పాదకత అని నిపుణుల కమిటీ మళ్లీ మళ్లీ గుర్తు చేసింది. ఈ ఉద్యోగాలేవీ కనుచూపుమేరలో కనిపించడం లేదు. ఇటీవల తుపాను వల్ల దెబ్బతిన్న పట్టణాలను పునర్నిర్మించవలసిన అవసరం ఉంది. నిపుణుల కమిటీ సూచించిన విధంగా హై కోర్టు వంటి సదుపాయాలను అక్కడ నెలకొల్పాలి. అవి ఆంధ్రప్రదేశ్‌కు కొంత అభివృద్ధిని కలిగిస్తాయి.

చిత్తూరు, తిరుపతుల్లో వైద్య, విద్యాసదుపాయాలు ముఖ్యంగా ప్రైవేటు రంగంలో స్థాపించడం ప్రారంభమవడం ఆహ్వానించదగిందే. కాని చిత్తూరు, తిరుపతులకు ఆ శక్తి తమిళనాడు దగ్గరగా ఉండడం వల్ల తప్ప, హైదరాబాదుకు దగ్గరగా ఉండడం వల్ల కాదని గుర్తు పెట్టుకోవాలి. తిరుపతి, చిత్తూరులకు పెద్ద విద్యా, వైద్య సంస్థలను కలిగి ఉండగల సామర్థ్యం గురించి మాట్లాడుతున్నారుకాని, రాయలసీమ సామర్థ్యం గురించి మాట్లాడడం లేదు. ఇది దురదృష్టకరం. రాజధాని గురించిన ప్రస్తావనల్లో ఆర్థిక రాజధానిని కూడా విజిటిఎం ప్రాంతానికే బదిలీ చేస్తారనే విషయాన్ని అందరూ గుర్తించినట్లే కనిపిస్తూ ఉంది. నిరసనలు వెల్లువెత్తుతాయన్న విషయంలో సందేహమవసరం లేదు. నాయుడు ఎదుర్కోవలసిన అత్యంత ముఖ్యమైన సవాలు, అతని రాజకీయ చాణక్యమంతా వినియోగించి సాధ్యమైనంత త్వరలో పరిష్కరించవలసిన సవాలు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సమతులాభివృద్ధి కోసం పనిచేయడం తప్ప విజిటిఎం ప్రాంతానికి పరిమితం కాకూడదని నిపుణుల కమిటీ మళ్లీ మళ్లీ చెప్పింది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 హైదరాబాదును ఉమ్మడి రాజధానిగా పంచుకోవడానికి పదేళ్ల కాలవ్యవధి నిచ్చింది. ఈ సమయాన్ని ఎలా వినియోగించుకోవచ్చో కమిటీ అనేక సిఫారసులు చేసింది. నేనేమీ కమిటీకి మారుపేరుగా ఉండదలచుకోలేదు; దేశంలో ఇంతకుముందు అనేక కమిటీలు నియమించారు; వాటిలో కొన్నిటి సిఫారసులను అంగీకరించారు, కొన్నిటిని తిరస్కరించి ఉండవచ్చు. అందువల్ల ఈ కమిటీ సిఫారసులను అంగీకరిస్తారా, తిరస్కరిస్తారా అన్నది ముఖ్యం కాదు. ముఖ్యం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు. నాయుడు తన అడుగులను వెనక్కు తీసికొనే సమయమింకా మించిపోలేదు.

## లాండ్ పూలింగ్

రాజధానికి స్థలం సమస్యలోనే మునిగిపోకుండా ఆంధ్రప్రదేశ్ ఎదుర్కుంటున్న పెద్ద సమస్యల పరిష్కారంపై తన దృష్టిని కేంద్రీకరించడానికి చట్టం చాలా వెసులుబాటు ఇచ్చింది. సింగపూరులో నెలకొని ఉన్న రాజధాని మాస్టర్ ప్లాన్‌పై పనిచేస్తున్న కంపెనీలు, రాజధాని సరిహద్దులకు వెలుపల, విజిటిఎం ప్రాంతంలో 3,000 ఎకరాల భూమిని కోరుతున్నట్లు చెప్తున్నారు.

చైనాతో సహా ఎన్నోచోట్ల సింగపూరు వాణిజ్యవేత్తలు గణనీయమైన భూకమతాలను సొంతం చేసుకోవడమో, సొంతం చేసుకొనే ప్రయత్నం చేయడమో చేస్తున్నట్లు తెలుస్తున్నది. అది వాళ్ల విధానం కావచ్చు, కాని ఈ సందర్భంలో, ఆంధ్రప్రదేశ్‌లో నేను చెప్పదలచుకున్న విషయమేమిటంటే సింగపూరుకు వెళ్లే భూమి వాటా అంతా వ్యావసాయిక భూకమతాలేనన్నది. రాజధాని ప్రాజెక్టు వల్ల నేరుగా ప్రభావితులయ్యే వారితో పాటు ఈ ప్రాంతంలో ప్రత్యక్షంగాకాని, పరోక్షంగా కాని స్వతంత్ర వ్యవసాయ భూములుకాని, ఆదాయాలుకాని లేని లక్షలాది కుటుంబాలు కూడా ప్రభావితమవుతాయి. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో ఏర్పడుతున్న ఎగుడు దిగుళ్ల సందర్భంలో కుటుంబాలకు సంక్షేమాన్ని, భద్రతను ఇచ్చే పూచీపడడం ఆచరణరీత్యా అసాధ్యం. రాష్ట్ర రాజధాని నిర్మాణం, నిర్వహణలకు పెట్టుబడులు అంతర్జాతీయంగా అప్పులు తీసుకోవలసిందే తప్ప గత్యంతరం లేదు; ఈ పనికి ఆంధ్రప్రదేశ్‌కు తాను చేయగల సహాయం గురించిన పరిమితులను కేంద్రప్రభుత్వం ఇప్పటికే సూచించింది.

ఈ ప్రాంతంలో భూయజమానులు 32,000 ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించడానికి, లాండ్ పూలింగుకు అంగీకరించారని చెప్తున్నారు. అదే సమయంలో కృష్ణానది దక్షిణ తీరంలో ఈ ప్రణాళికకు ప్రతిఘటన పెరుగుతూ ఉన్నదన్న వార్తలు వస్తున్నాయి. ఇక్కడ జరుగుతున్న లాండ్‌పూలింగ్ దేశంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన లాండ్ పూలింగ్‌కు భిన్నమైనది. దేశంలోని ఇతర ప్రాంతాలలో ఈ ప్రయత్నం సాధించిన విజయం ఏకరీతిలో లేదు. ఈ సందర్భంలో పేర్కొంటున్న గుజరాత్ లాండ్ పూలింగు పథకం సాఫల్యం దట్టమైన పట్టణ ప్రాంతాల్లో జరిగిందని గుర్తించాలి. అక్కడ బేరసారాల్లో కొంత వాస్తవికతా స్పర్శ ఉంది. అక్కడ ఈ పథకాన్ని విస్తృతంగా మళ్లీ మళ్లీ ప్రచారం చేశారు. భూయజమానులు అంగీకారం సంపాదించే

ప్రయత్నంలో ప్రకటనలు చేశారు. దీనివల్ల అధికారులు ఏమి ఇవ్వదలచుకున్నారో, భూయజమానులకు ఏమి లభిస్తుందో స్పష్టమైంది.

## మౌలిక సదుపాయాలకు ప్రోత్సాహం

శ్రీ నాయుడు రాబోయే కొద్ది సంవత్సరాలు కేంద్రప్రభుత్వ సహాయం సునిశ్చితమైన కోస్టల్ కారిడార్, గ్యాస్ పైప్‌లైన్, దాన్ని రాయలసీమకు రవాణా చేయడం, నడికుడి – కాళహస్తి రైల్వే లైను, తూర్పు–పడమరలకు మరికొన్ని రైలు మార్గాలు, మరికొన్ని అతి ముఖ్యమైన ప్రాజెక్టులపై దృష్టి కేంద్రీకరించడం మంచిది. ఇది రాష్ట్రవ్యాప్తంగా ఆయన రాజకీయ పలుకుబడిని కూడా పెంచుతుంది.

ప్రతి రాజకీయ రాజధానికీ, రాజకీయ సమర్థన అవసరం. కాని ఈ సందర్భంలో రాష్ట్రంలో మొత్తంగా రాజధాని ప్రాజెక్టు కోసం అటువంటి సమర్థన లేదు. సుదీర్ఘకాలం అనుభవజ్ఞులైన, సమర్థులైన అనేకులు పరిపాలనాధికారుల మార్గదర్శకత్వం లభించిన చరిత్ర ఆంధ్రప్రదేశ్‌కు ఉంది. శ్రీ నాయుడు వారి ప్రతిభాపాటవాలను ఉపయోగించుకొని, కనీసం రాబోయే కొద్ది సంవత్సరాలైనా రాష్ట్రం ముందున్న ప్రాథమ్యాలను గుర్తించినట్లయితే బాగుంటుంది. విషయం మహత్తరమైన రాజధానీనగరం కాదు, అది తర్వాత ఎప్పుడైనా రావచ్చు. ప్రస్తుతం ముఖ్యమైనదేమంటే ఆంధ్రప్రదేశ్ రాజకీయ శక్తినీ, ఆర్థిక వనరులను ఈ రాజధాని ప్రాజెక్టుకు తాకట్టు పెట్టే దాదాపు ఆత్మహత్యాసదృశమైన పని పనికిరాదు.

(కె.సి. శివరామకృష్ణన్, చైర్మన్, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్, భారత ప్రభుత్వం నియమించిన ‘ఆం.ప్ర. రాజధాని గురించి నిపుణుల కమిటీ’ చైర్మన్)

ఈ వ్యాసాన్ని ప్రచురించిన తర్వాత స్వల్పకాలంలోనే 2015 మే 28 వ తేదీన శ్రీ శివరామకృష్ణన్ మరణించారు.

# 8. తటస్థ రాజధానిగా దొనకొండ: విఫలమైన ప్రతిపాదన

## కొత్తరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాజధానిగా దొనకొండ ప్రతిపాదన

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూపరిపాలన శాఖ ఛీఫ్ కమీషనర్‌గా నేను 2013 మేలో బాధ్యతలు చేపట్టాను. 2013 జులై 30 వ తేదీన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పదేండ్లపాటు హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా ప్రతిపాదస్తూ కొత్త ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఏర్పాటుకు తీర్మానం చేసింది. సిడబ్ల్యుసి తీర్మానం ఆమోదించడంతో రాష్ట్రాన్ని విభజించడానికి కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయమై ఉందనీ, ఈ విభజన జరగడానికి సమయనిర్ణయమే జరగవలసి ఉందనీ అర్థమైపోయింది. నేను భూపరిపాలన శాఖ ఛీఫ్ కమీషనర్ని కావడం వల్ల, రెవిన్యూమంత్రి కొత్త రాష్ట్ర రాజధాని స్థలానికి యోగ్యమైన స్థలాన్ని పరిశీలించవలసిందిగానూ, దానికోసం ప్రభుత్వభూమి, ఎక్కడెక్కడ అందుబాటులో ఉందో అన్వేషించవలసిందిగానూ కోరారు. తదనుగుణంగా పని ప్రారంభించాను. విశాలమైన ప్రభుత్వభూముల లభ్యతపై సమాచారం పంపవలసిందిగా కలెక్టర్లను కోరాను. అన్ని జిల్లాలనుండి సమాచారం సేకరించాను. ఈ సమాచర విశ్లేషణ వల్ల కొన్ని జిల్లాలలో తగినంత విశాలమైన ప్రభుత్వభూములు లభిస్తున్నాయనీ, ఆ భూములను రాజధానీనగర స్థాపనకు తేలికగానే సంపాదించవచ్చుననీ తెలిసింది. వైజాగ్ జిల్లా అచ్యుతాపురం సమీపంలో అటువంటి భూభాగం ఉంది. కృష్ణాజిల్లా నూజివీడులోనూ ఉంది. అదేవిధంగా గుంటూరు, ప్రకాశం జిల్లాల మెట్ట ప్రాంతాలలోనూ, రాయలసీమ జిల్లాలు, నెల్లూరులోనూ విశాలమైన భూభాగాలు లభిస్తున్నాయి. పది కిలోమీటర్ల వ్యాసార్థంలో ప్రకాశం జిల్లాలోని దొనకొండ ప్రాంతంలో 50,000 ఎకరాల ప్రభుత్వ భూమి వీటన్నిటిలోనూ విశాలమైనది. కొత్తరాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు

రాజధానీనగరాన్ని స్థాపించడానికి సంభావ్యస్థలంగా దొనకొండను సూచిస్తూ నేనొక కాన్సెప్ట్ నోట్ తయారుచేశాను. ఈ ఎంపికకు కారణాలివి.

అన్నిటికంటే నా మనస్సులో ఉన్న ముఖ్యమైన కారణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్ర. వారివారి ప్రత్యేక గుర్తింపులు కలిగిన చాలా విశిష్టమైన రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తర కోస్తా జిల్లాలు వంటి ప్రాంతాలు కలిసి ఏర్పడే రాష్ట్రం కావడం. రాజధానీనగరస్థలం తటస్థ ప్రదేశంలో ఉందని అన్నిప్రాంతాల ప్రజలూ భావించాలి. ఒక ప్రత్యేక ప్రాంతం లేదా వర్గం రాజధాని స్థాపన ప్రక్రియలో ప్రాబల్యం లేదా అనుకూలతను పొందుతున్నదన్న భావన ఎవరికీ కలగకూడదు. ఈ దృష్టితో చూసినప్పుడు కోస్తాంధ్రలో గుంటూరు, నెల్లూరు జిల్లాల నుండి కొన్ని ప్రాంతాలను, రాయలసీమలో కర్నూలు జిల్లాలోని మార్కాపురం డివిజన్‌ను తీసికొని ఏర్పరచిన జిల్లా ప్రకాశం జిల్లా. ఆ జిల్లాలోని ఏ ప్రదేశాన్నయినా రాజధాని స్థలంగా బ్రహ్మాండంగా ఎంచుకోవచ్చు. ఆ స్థలం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలకు తృప్తి కలిగిస్తుంది. తరువాత రాజధానీనగరాల స్థాపనకు సంబంధించిన రచనలను అధ్యయనం చేసినప్పుడు, ఈ ప్రత్యేకమైన ఆలోచన తటస్థభావన సిద్ధాంతంలో కనిపిస్తుంది. తమ తమ సొంత గుర్తింపులున్న భిన్నప్రాంతాల ప్రజలు తామందరికీ తటస్థమైన చోట రాజధానీనగరం ఉండాలని కోరుకున్నప్పుడు, అటువంటి స్థలం కోసం వెదికినప్పుడు ఆ స్థలం వారందరికీ సమానదూరంలో, సమానంగా అందుబాటులో ఉండి, అది తమది అన్న భావన కలగాలి.

మొదట దొనకొండ నెల్లూరు జిల్లాలో ఉంది. తరువాత అది ప్రకాశం జిల్లాలో భాగమయింది. ఇది కోస్తా ప్రాంతం. దీనికి దగ్గరలోని మార్కాపురం, గిద్దలూరు తాలూకాలు దీనిలో భాగమయ్యాయి. ఈ ప్రదేశం రాయలసీమలో భాగమైన కర్నూలు జిల్లాలో ఉండేవి. అందువల్ల ఈ ప్రాంతం ఇరు ప్రాంతాల వారికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని నాకనిపించింది.

కొత్తరాష్ట్రంలో ప్రభుత్వ కార్యకలాపాలు నడిచే పాలనాపరమైన రాజధాని నా మనస్సులో ఉంది. అది తక్షణం ఏర్పడే మహానగరం కాదు. దాన్ని ఒక చిన్న హరితక్షేత్ర రాజధానిగా, ప్రారంభంలో లక్షమంది ప్రజలకు ఆశ్రయమిచ్చేదిగా, కాలక్రమంలో ఐదులక్షల జనావాసంగా విస్తరించేదిగా ఊహించడం జరిగింది. ఛత్తీస్‌గఢ్ రాజధానిగా నయారాయపూర్ ఎలా వికాసం చెందిందీ అధ్యయనం చేశాను. ఆ ప్రకారమే 5000

ఎకరాల విస్తీర్ణంలో లక్షమంది జనాభాకు సరిపోయేదిగా ప్రారంభమై, కాలక్రమంలో మెల్లగా 20,000 ఎకరాలకు విస్తరించి, ఐదు లక్షల జనాభాను స్వీకరించగలగినదిగా దాన్ని ప్రతిపాదించాను. అప్పటి ఆంధ్రప్రదేశ్ సచివాలయం సిబ్బంది సుమారు 5500. అందులో నుంచి సుమారు 4000 మంది కొత్త రాజధానికి మారతారు. కుటుంబానికి నలుగురు చొప్పున లెక్కిస్తే వారి కుటుంబాల సభ్యుల సంఖ్య 16,000 అవుతుంది. సిబ్బంది, శాఖాధిపతుల కుటుంబ సభ్యుల సంఖ్య కలిపితే మరో 10,000. శాసనసభ, ఇతరమంత్రుల సిబ్బంది, ఇతర సిబ్బందితో కలిపితే మొత్తం నూతన రాజధానిలో ఉద్యోగులు, వారి కుటుంబసభ్యుల జనాభా 35,000 అవుతుంది. దీనికి ప్రభుత్వ పరమైన పనుల కోసం రాజధానికి వచ్చే అస్థిరమైన జనాభా (Floating population) 30, 40 వేలమంది ఉండవచ్చు. దాని ప్రకారం రాజధానిని ప్రారంభంలో లక్ష జనాభాకు ఆశ్రయమివ్వగలిగిందిగా, కాలక్రమంలో ఐదులక్షల వరకు జనాభాను ఇముడ్చుకోగలిగేట్లు దొనకొండ ప్రాంతంలో అందుబాటులో ఉన్న విశాలమైన ప్రభుత్వ భూములను వినియోగించుకోవచ్చు.

నూతన రాష్ట్రానికి దొనకొండను రాజధానిగా ప్రతిపాదించినప్పుడు నీటి సరఫరా గురించి కూడా ఆలోచించాను. నీటి సరఫరాకు నిశ్చితమైన కేటాయింపు తప్పనిసరి, ఆ నీటి సరఫరాలు కాలువల వ్యవస్థ అవసరం. చెన్నై విషయంలో కృష్ణాజలాల కేటాయింపు జరిగింది, తెలుగు గంగ కాలువల ద్వారా సరఫరా జరుగుతూ ఉంది. నూతన నగరానికి భారత ప్రభుత్వం నుండి నిశ్చిత పరిమాణంలో నీటి కేటాయింపు పొందవలసి ఉంటుంది. కృష్ణానది నుండి నీటిని దర్శిశాఖ కాలువ ద్వారా సరఫరా చేయవచ్చు. ఇది దొనకొండకు దగ్గరగా పారుతుంది. లేదా వెలిగొండ జలాశయం పని పూర్తయిన తర్వాత దానినుండి తీసుకోవచ్చు. అందువల్ల కొత్త నగరానికి నీటి సదుపాయం పెద్ద సమస్య కాకపోవచ్చు. ఈ ప్రాంతం బెంగళూరు – కలకత్తా రైలు మార్గం మీద ఉంది. రెండో ప్రపంచయుద్ధ సమయంలో నర్మించిన విమానాశ్రయం కూడా ఉంది. ఈ ప్రదేశాన్ని రాజధాని స్థలంగా సూచించడానికి విస్తారమైన ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండడం ఒక కారణం. రాజధానీనగర స్థాపన ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. శుష్క, ఎర్ర నేలలు చవక, నిర్మాణానికి అనుకూలం కూడా. ఆంధ్రప్రదేశ్‌లోని భిన్న ప్రాంతాలకు ప్రస్తుతం రాజధానిగా అభివృద్ధి చేయదలచుకున్న అమరావతితో పోలిస్తే దొనకొండ కేంద్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో ఇది అత్యంత వెనుకబడిన ప్రాంతాలలో ఒకటి. ఇక్కడ రాజధానిని పెట్టడం ఈ

ప్రాంతంలో ఆవశ్యకమైన అభివృద్ధి ప్రక్రియను ప్రారంభిస్తుంది. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యాకులు వెనుకబడిన తరగతులవారు, తదితరులు. అందువల్ల ఈ ప్రాంతంలో ఒక ప్రత్యేక సామాజికవర్గ ప్రాబల్యం ఏర్పడే అవకాశం లేదు. అది నిజంగా ఒక లౌకిక, కాస్మోపాలిటన్ పరిపాలన రాజధానిగా ఏర్పడుతుంది. నగరాన్ని చిన్నదిగా, పరిపాలనా స్వభావం కలిగినదిగా, ఒక మహానగరాన్ని నిర్మించే భారీవ్యయం కలగకుండా, ఆంధ్రప్రదేశ్‌లో వైజాగ్, తిరుపతి, విజయవాడ వంటి పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా ఇప్పటికే వర్ధిల్లుతున్న నగరాలపై కేంద్రీకరణకు అవకాశమిస్తూ నిర్మించవలసి ఉంటుంది.

ఆ నాడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రతిపాదన పట్ల అనుకూలంగా ఉందనీ, దాన్ని భారత ప్రభుత్వానికి పంపిందనీ నాకు చెప్పారు. 2014 జూన్ 2 న రాష్ట్రం ఏర్పడటానికి ముందు ఈ భావనకు పత్రికల్లోనూ, ఇతర సంబంధిత చర్చా సందర్భాల్లోనూ విస్తృతంగా చర్చకు వచ్చింది. కాని ఒకసారి కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి జూన్ 8, 2014 ప్రమాణస్వీకారం చేయడంతో రాజధానీనగర ఆలోచనే పూర్తిగా మారిపోయింది.

కొత్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాజధాని కోసం నేను తయారుచేసిన కాన్సెప్ట్ నోట్ తరువాతి కాలంలో తరచుగా నా ఆలోచనలను ఆక్రమిస్తూ వస్తూ ఉంది. నేను 2014 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శినయినప్పటికి రాజధానీనగర స్థలం గురించి ప్రభుత్వం అప్పటికే నిశ్చితమైన అజెండాతో ముందుకు వచ్చింది. భారత ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ వంటి నిపుణుల కమిటీ తమ అడుగుజాడల్లో నడవదని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం, పట్టణాభివృద్ధి శాఖామంత్రి నేతృత్వంలో స్థానిక పెట్టుబడిదారులు, స్థానిక రాజకీయ నాయకులు సభ్యులుగా మరొక కమిటీని నియమించింది. ప్రాథమికంగా ప్రధాన కార్యదర్శినే కమిటీ సమావేశకర్తగా నియమించ తలపెట్టారు. అప్పటికే దొనకొండ రాజధానీనగరంగా గట్టి అభిప్రాయానికి వచ్చిన నేను, భూపరిపాలన శాఖ ఛీఫ్ కమీషనర్‌గా దానికోసం కాన్సెప్ట్ నోట్‌ను కూడా తయారుచేసి ఉన్నందున, కమిటీ సమావేశకర్తగా నేనుండాలన్న ఆలోచన నాకంత సౌకర్యంగా లేదు. అంతకు కొద్దిరోజుల ముందే ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాను. ముఖ్యమంత్రి కూడా ప్రమాణస్వీకారం చేసి ఎక్కువరోజులు కాలేదు. మా ఇద్దరి ఆలోచనావిధానాలూ ఒకస్థాయిలో ఇంకా స్థిరపడలేదు. అందువల్ల నా ఈ అసౌకర్యాన్ని గౌరవనీయ ముఖ్యమంత్రికి తెల్పడానికి కాస్త సంకోచించాను.

కాని అదృష్టవశాత్తు తమ ఎంపికకు అనుకూలంగా రాజధానీనగర స్థల నిర్ణయ అంశాన్ని నిర్వహించడానికి నేను తగిన వ్యక్తిని కానేమోనని ఎవరో ఆయన చెవిలో ఊదారు. తదనుగుణంగా మరుసటిరోజే సమావేశకర్తగా మరెవరో ఉంటారని నాకు తెలిపారు. రాజధానీనగర ప్రదేశ విషయంలో ప్రభుత్వానికి నా అభిప్రాయం కంటే పూర్తిగా భిన్నమైన అభిప్రాయం ఉందని బాగా తెలిసిన నేను, సాధ్యమైనంతవరకు రాజధానీనగర స్థల నిర్ణయ ప్రక్రియకు, సంప్రతింపులకు దూరంగా ఉన్నాను. రాజధాని స్థలం ఎంపికలో గుణాత్మకమైన ప్రమాణాలు కాక, వాణిజ్య, రియల్ ఎస్టేట్ ఆసక్తులు, కుల ఆసక్తులు చోదకశక్తులుగా ఉన్నట్లు అర్థం చేసుకున్నాను కాబట్టి, రాజధాని విషయంలో నా అభిప్రాయాలు పంచుకోవడం నిరర్థకమని భావించాను. గుంటూరు ప్రాంతపు ఒకముఖ్యమైన రాజకీయనాయకుడు – దొనకొండ ప్రాంతంలో నాకు భారీ పరిమాణంలో భూములు ఉన్నాయనీ, అందుకే దొనకొండలో రాజధాని కోసం అంతగా ప్రయత్నిస్తున్నాననీ ఆరోపణ చేశాడు. దొనకొండలో రాజధానిని ప్రతిపాదించడంలో నా ఆసక్తి సుదీర్ఘ భవిష్యత్తులో ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడాలనీ, ప్రాంతీయ సమతుల్యతను కాపాడాలనీ తప్ప మరొకటి కాదు. నేను ఆ ప్రాంతానికి చెందినవాణ్ణి కావడంకాని, మరొకటి కాని నా ప్రతిపాదన వెనుక లేదు. ఏది ఏమైనా నేను భూస్వాముల సామాజికవర్గానికి చెందినవాణ్ణీ కాను, దొనకొండలోనో, మరో చోటనో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టేంత డబ్బు సంపాదించినవాణ్ణీ కాను. ఈ దేశ విషాదమేమంటే దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సంపదను త్యాగం చేసిన దూరదృష్టి గల నాయకుల స్థానంలో, ఇటువంటి తమ గురించి మాత్రమే ఆలోచించే గుత్తేదారు తరగతి రాజకీయనాయకులు కావడం. వీళ్ల ఏకైకలక్ష్యం రాజకీయాల్లో పెట్టుబడి పెట్టి విపరీతమైన లాభాలు సంపాదించడమే! అటువంటి అవకాశానికి ప్రమాదం కలిగినప్పుడు ఎటువంటి ఆధారాలూ లేకుండా ఎదుటి వ్యక్తిపై బురద చల్లుతారు. అయితే ఈ ఆరోపణ చేసిన వ్యక్తి ఒక బాధ్యతాయుతుడైన రాజకీయనాయకుడై నందున, అతను పార్లమెంటు సభ్యుడు కూడా అయినందున, అతని నుండి వాస్తవాలను సేకరించి దర్యాప్తు జరిపించవలసిందిగా నేను ప్రభుత్వాన్ని కోరాను. నా అభ్యర్థనను పట్టించుకోకపోవడమే మంచిదనుకున్నది ప్రభుత్వం.

# 9. రాజధానీనగరాలుగా కర్నూలు, అమరావతుల ఎంపికలో భేదం దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడికీ, వ్యూహాత్మక చాణక్యనాయకత్వానికీ ఉన్న భేదం

**1953** లో ఆంధ్ర రాజధానిగా కర్నూలును ఎంపిక చేసుకున్న పద్ధతి, 2014 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానీనగరంగా అమరావతిని ఎంపిక చేసుకున్న పద్ధతి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు నాయకత్వలక్షణాల గురించీ, శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వ లక్షణాల గురించీ బోలెడన్ని విశేషాలు చెప్తాయి. దీన్ని గురించి మరింత చర్చించే ముందు 1953 లో ఆంధ్ర రాష్ట్రం ఎలా ఏర్పడిందో తెలుసుకోవడం మంచిది.

1920 నాగపూరు కాంగ్రెస్ సమావేశం స్వతంత్ర భారతదేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకరించింది. మద్రాసు ప్రెసిడెన్సీలో ఆంధ్రప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం ఒక ఉద్యమం చేపట్టడమూ, అది జాతీయోద్యమంతో పాటు, విస్తరించడమూ దీనికి కారణం. 1937 లో శ్రీబాగ్ ఒడంబడికపై సంతకాలు జరిగాయి. రాష్ట్రంలోని విభిన్నప్రాంతాల్లో రాజధానిని ఎక్కడ ఏర్పాటు చేయాలి? ఇతర సంస్థలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలి అన్న విషయంలో కోస్తాంధ్ర, రాయలసీమ నాయకుల మధ్య అనౌపచారికంగా ఒక ఒప్పందం కుదిరింది. అప్పటికే ఆంధ్రవిశ్వవిద్యాలయం విశాఖపట్నంలో ఉన్నందున రాయలసీమ దానిలో భాగం కావడానికి అంగీకరించక, రాయలసీమవాసులు మద్రాసు విశ్వవిద్యాలయంతోనే కొనసాగడానికి నిశ్చయించుకోవడం ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన ఒక ముఖ్యవిషయం.

'నా జీవనయాత్ర' అన్న టంగుటూరి ప్రకాశం పంతులుగారి స్వీయచరిత్రలో ఒక భాగాన్ని రాస్తూ, తెన్నేటి విశ్వనాథం కర్నూలును రాజధానిగా ఎంపిక చేసుకున్న ప్రక్రియను సవివరంగా వర్ణించారు. చివరి నిమిషం వరకూ మద్రాసు నగరం మీద ఆంధ్రుల హక్కును వదులుకోవడానికి ప్రకాశం పంతులుగారు వ్యతిరేకంగా ఉన్నారు. మద్రాసు మీద హక్కును వదులుకుంటున్న పత్రంపై ఆయన సంతకం తీసికోవడానికి భోగరాజు పట్టాభిసీతారామయ్య చేసిన ప్రయత్నం ఫలించలేదు. 1952 తరువాత మాత్రమే సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీ సభ్యులు కూడా మద్రాసుపై హక్కును వదులుకోవడానికి అంగీకరించిన తర్వాతే, ప్రకాశం పంతులు మద్రాసు నగరం లేని ఆంధ్ర రాష్ట్రానికి చివరికి తన అంగీకారం తెలిపారు. ఆమరణ నిరాహారదీక్ష చేసి, శ్రీ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసిన తరువాత మాత్రమే కేంద్రప్రభుత్వంపై వొత్తిడి పెరిగి ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు నిర్ణయం జరిగింది. 1953 లో న్యూ ఢిల్లీలో శ్రీ జవహర్ లాల్ నెహ్రూ, శ్రీ ప్రకాశం పంతులు మధ్య జరిగిన సమావేశం నూతన ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు దారివేసింది. ఆంధ్రులకు ఒక ప్రత్యేక రాజధాని ప్రశ్న ఒక ముఖ్యమైన అంశంగా నెహ్రూ, ప్రకాశం పంతులు గార్ల మధ్య జరిగిన సమావేశంలో ముందుకు వచ్చింది. కొత్త రాష్ట్రానికి ఒక తాత్కాలిక రాజధానిని శాసనసభ సూచించిన తరువాత విభజన కార్యక్రమం ప్రారంభమవుతుందని, నెహ్రూ ప్రకాశం పంతులుగారికి సూచించారు. తదనుగుణంగా రాజధాని స్థలాన్ని నిర్ణయించడానికి ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ప్రకాశం పంతులు అధ్యక్షతన కృషికార్ లోక్ పార్టీ పక్షాన గౌతు లచ్చన్న, కమ్యూనిస్టు పార్టీ పక్షాన తరిమెల నాగిరెడ్డి పాల్గొన్నారు. కొత్తరాజధాని సమస్యను చర్చించబోతూ ఉండడంతో, అప్పటికే శాసనసభ్యులు రాజధాని తమతమ పట్టణాలలో ఉండాలని కోరసాగారు. వైజాగ్ సుందరమైన దృశ్యాలతో, అన్ని సౌకర్యాలతో ఉండడం వల్ల ఆ ప్రాంతం నుండి వచ్చిన శాసనసభ్యులందరూ కొత్తరాజధానిగా అదే తగిన ప్రదేశంగా భావించారని తెన్నేటి విశ్వనాథం రాశారు. తమ జిల్లాలలో రాజధానిని ఏర్పాటుచేయమని గోదావరి జిల్లాలోనుండి ఎవరూ కోరలేదు. కృష్ణా, గుంటూరు జిల్లాలలో బలంగా ఉన్న కమ్యూనిస్టులు తాత్కాలిక రాజధానిని గుంటూరు–విజయవాడల మధ్య నెలకొల్పాలని కోరారు. రాయలసీమ సభ్యులు 1937 ఒడంబడికను పేర్కొంటూ, ఆంధ్రవిశ్వవిద్యాలయం కోస్తా ప్రాంతంలో ఏర్పరచినందువల్ల తాత్కాలిక రాజధానిని రాయలసీమలో ఏర్పాటుచేయాలని కోరారు. తమ కోరికను అంగీకరించకపోతే

తాము మద్రాసు రాష్ట్రంలోనే భాగంగా ఉంటామన్నారు. తదనుగుణంగా వారొక పిటీషన్‌పై సంతకాలు పెట్టి, జేబులో పెట్టుకున్నారు. ఒకవేళ శాసనసభలో అవసరమైతే ఈ పత్రాన్ని తెరచి అందులో పేర్కొన్న విధంగా చేయడానికి సిద్ధపడ్డారు. ఇటువంటి పరిస్థితులలో ప్రకాశం పంతులు రాజధానీనగరాన్ని ఎంపిక చేయడం కోసం అధికారికంగా ఏర్పాటుచేసిన కమిటీ సమావేశాన్ని తమ నివాసగృహంలో ఏర్పాటుచేశారు. ఉదయం సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. వైజాగ్‌ను రాజధానిగా చేసే ప్రస్తావన అంగీకారయోగ్యం కాదని ప్రకాశం పంతులు స్పష్టంగా చెప్పినందువల్ల, తెన్నేటి విశ్వనాథం విశాఖపట్నం విషయంలో పట్టుబట్టలేదు. గౌతు లచ్చన్న నిర్దిష్టంగా తిరుపతి పక్షాన మాట్లాడారు. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాజధాని రాయలసీమలోనే ఉండాలనీ, దాన్ని తిరుపతిలో ఏర్పాటుచేయకపోతే చిత్తూరు మనతో రాదనీ, మద్రాసు రాష్ట్రంలోనే ఉండిపోవడానికి నిర్ణయించుకోవచ్చుననీ ఆయన వాదించారు. కడప పట్టణంలో అనేక భవనాల చిత్రపటాలు చూపించి కోటి రెడ్డి రాజధాని కడపలో ఉండాలని వాదించారు. తాత్కాలిక రాజధానిని కర్నూలులో పెట్టడం వల్ల ఎటువంటి లక్ష్యం, ప్రయోజనం నెరవేరదని కమ్యూనిస్టులు వాదించారు. అది గుంటూరు – విజయవాడల మధ్య ఉండాలన్నారు. శ్రీ ప్రకాశం పంతులు, శ్రీ నీలం సంజీవరెడ్డి గారికి రాష్ట్రం ఏర్పడడంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించినందువల్ల, తాను అనంతపురం పక్షాన ప్రచారం చేయవద్దని సూచించినందువల్ల శ్రీ నీలం సంజీవరెడ్డి అనంతపురం గురించి ఏమీ మాట్లాడలేదు. ఒంటిగంట వరకు చర్చలు నడుస్తూనే ఉన్నాయి. కాని వాళ్లు ఏ నిర్ణయానికీ రాలేదు. అందువల్ల వాళ్లందరూ ప్రకాశం పంతులుగారికే నిర్ణయాన్ని వదిలిపెడుతూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆయన వాళ్లందరినీ మళ్లీ వచ్చి మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం కమ్మన్నాడు. వాళ్లు మళ్లీ సమావేశమైనప్పుడు ప్రకాశం పంతులు శ్రీ గౌతు లచ్చన్నను ఒక కాగితం ముక్కమీద రాజధానిగా కర్నూలు పేరును రాయమని కోరారు. రాజధానిని రాయలసీమలో నిర్ణయించినందువల్ల శాసనసభలో శ్రీ నీలం సంజీవరెడ్డిని తీర్మానం ప్రవేశపెట్టవద్దని కోరి, ఆ బాధ్యతను శ్రీ తెన్నేటి విశ్వనాథానికి అప్పజెప్పారు. శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది. ఓటింగు జరిగింది. ఆంధ్ర రాష్ట్రానికి తాత్కాలిక రాజధానిగా కర్నూలు పక్షాన నిర్ణయం జరిగింది. తదనుగుణంగా కర్నూలు రాజధానిగా1-10-1953 న అప్పటి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, తదితరుల సమక్షంలో ఆంధ్ర రాష్ట్ర స్థాపన జరిగింది. తాను నూతన ఆంధ్ర రాష్ట్ర స్థాపనను ప్రకటించడానికి ముందే

రాజధాని సమస్య పరిష్కారం కావాలని జవహర్ లాల్ నెహ్రూ సూచించడానికి ఒక ముఖ్యమైన కారణం ఉంది. నెహ్రూ మొదటినుంచీ కూడా భాషాప్రయుక్త రాష్ట్రాల భావనకు వ్యతిరేకి. రాజధానీ నగరాన్ని ఎంపిక చేసుకోవడం తేలిక కాదని నెహ్రూకి తెలుసు. అందువల్ల వాళ్లు రాజధానీనగరాన్ని ఎంచుకోవడంలో విఫలమైనట్లయితే భాషాప్రయుక్తరాష్ట్రం ఏర్పాటు కూడా వాయిదా పడుతుంది. శ్రీ ప్రకాశం పంతులుకు ఈ విషయంపై నెహ్రూ ఏమి ఆలోచిస్తున్నారో తెలుసు. రాయలసీమ నాయకత్వం తమ ప్రాంతంలో రాజధానిని నెలకొల్పనట్లయితే మద్రాసు రాష్ట్రంలోనే ఉండిపోవడానికి నిర్ణయించుకోవచ్చునని కూడా ఆయనకి తెలుసు. ఈ వాస్తవాలన్నిటినీ దృష్టిలో ఉంచుకుని, ఆయన దూరదృష్టి గల రాజనీతిజ్ఞుడుగా రాజధానిని కర్నూలులో ఏర్పరచడం ద్వారా భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు బాట వేశారు. ఆంధ్ర శాసనసభలో మళ్లీ రాజధాని ప్రశ్నను లేవనెత్తినప్పుడు ప్రకాశం పంతులుగారి సమాధానం చాలా ఆసక్తికరం. ఆయన లేచి, అభివృద్ధి చెందని కర్నూలు ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం సముచితమనీ, అందుకే తాత్కాలిక రాజధానిని కర్నూలులో ఏర్పరుస్తున్నామనీ, విశాలాంధ్ర ఏర్పడితే రాజధాని హైదరాబాదుకు తరలిపోతుందనీ చెప్పారు. ఆ విధంగా కర్నూలు ఆంధ్ర రాష్ట్రానికి తాత్కాలిక రాజధాని అయ్యింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాజధాని హైదరాబాదుకు మారింది.

ఇప్పుడు దీన్ని, అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానీనగరంగా ఎంపిక చేసిన పద్ధతిలో పోల్చి చూద్దాం. ఒకసారి రాష్ట్ర విభజన నిర్ణయం తీసికున్న తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ఒక రాజధానీస్థలాన్ని సిఫారసు చేసేందుకు చట్టంలో ఒక నిపుణుల కమిటీని నియమించడానికి అవకాశం కల్పించడం జరిగింది. పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 6వ సెక్షన్ కింది కేంద్రప్రభుత్వం విభజనానంతరం ఏర్పడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్తరాజధాని కోసం వివిధ ప్రత్యామ్నాయాలను అధ్యయనం చేయడానికి కేంద్రప్రభుత్వం ఒక నిపుణుల కమిటీని నియమించాలి. 2014 ఆర్ ఓ ఆర్ చట్టం చేసిన నాటినుండి ఆరునెలల లోపల కమిటీ తగిన సిఫారసులు చేయాలి. తదనుగుణంగా 28-03-2014 నాడు శ్రీ శివరామకృష్ణన్ చైర్మన్‌గా నిర్దిష్ట పరిశీలనాంశాలతో (టిఓఆర్) కమిటీని నియమంచారు. శ్రీ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా కొత్త ప్రభుత్వం 08-06-2014 న ప్రమాణస్వీకారం చేసింది. కమిటీ చట్ట రీత్యా ఏర్పడినది కాబట్టి దీని సిఫారసులకు రాజధానీనగరస్థలం గుర్తింపు విషయంలో నిర్ణయం తీసికొనే ముందు రాష్ట్రప్రభుత్వం తగినంత ప్రాధాన్యం ఇవ్వవలసి

ఉంటుంది. కమిటీ సిఫారసులను 27-08-2014 న రాష్ట్ర ప్రభుత్వానికి పంపడం జరిగింది. మంత్రివర్గం 01-09-2014 న రాజధాని విషయంలో నిర్ణయం తీసికొనే సమయానికి అందుబాటులో ఉంది. కాని దాన్ని యథాలాపంగా పేర్కొనడం తప్ప రాజధాని స్థల విషయంలో నిర్ణయం తీసికొనేముందు దాన్ని అధ్యయనం చేయడంకాని, సీరియస్‌గా తీసికోవడం గాని జరగలేదు. వాస్తవానికి రాజధానీనగరస్థలం గుర్తింపు విషయంలో నిపుణుల కమిటీ ఒక నిర్ణయానికి రావడం కోసం కోరిన ఏ సమాచారాన్ని ఇవ్వడంలోనైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం నుండి సహాయ నిరాకరణే ఎదురయింది. ఈ అంశం 01-09-2014 న మంత్రివర్గం ముందు పెట్టడం జరిగింది. అది రెగ్యులర్ అజెండాలో భాగంగానా, టేబుల్ ఐటెంగానా అన్నది స్పష్టంగా తెలియదు. మంత్రివర్గ తీర్మానమేమిటంటే రాజధానీనగరం విజయవాడ పరిసరాల్లో కేంద్రస్థానంలో ఉండాలని. దీన్ని 04-09-2014 న శాసనసభకు తీసికొని వెళ్లడం జరిగింది. విజయవాడ పరిసరాల్లో రాజధానీనగరం స్థలం ఎంపిక గురించి ముఖ్యమంత్రి ఒక ప్రకటన, స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీనితోపాటు భిన్న ప్రాంతాలలో అనేక ప్రాజెక్టులను ప్రకటిస్తూ పట్టికను చదివాడు. ఈ ప్రాజెక్టు లేవీ ఎప్పుడూ ప్రారంభం కాలేదనుకోండి. ప్రజాభిప్రాయసేకరణ, సంప్రదింపుల ద్వారా జరగవవలసిన ఈ నిర్ణయం విషయంలో ప్రతిపక్షాలతో ముందుగా చర్చించడం కాని, పౌర సమాజంతో సంప్రదించడం కాని జరగనే లేదు. నిర్ణయంలో మరెవరినీ భాగస్వాములను చేయలేదు. దాన్ని శాసనసభకు హఠాత్తుగా తెచ్చినతీరు, విజయవాడ పరిసరాల్లోనే రాజధాని ఏర్పాటు జరుగుతుందని ప్రకటించడం ఒక వ్యూహాత్మక చర్య. ప్రతిపక్షం అభ్యంతరం తెల్పడానికి వీల్లేదు. అభ్యంతరం తెలిపితే, అది ఆ ప్రాంతానికి వ్యతిరేకి అని ముద్ర పడుతుంది. 953 లో కమ్యూనిస్టులకు ఈ సమస్య లేదు. బహుశా అప్పుడు వాళ్లు రాయలసీమలో పెద్దసంఖ్యలో లేరు. మంత్రివర్గ తీర్మానపు తోవను ఎంపిక చేసుకొని, ఆయన ఒక నిర్దిష్ట స్థలాన్ని ప్రకటించకుండా రాజధాని విజయవాడ పరిసరాల్లో ఉంటుందని వెంటనే శాసనసభలో ప్రకటించి, శాసనసభ తీర్మానాన్ని ఆధారం చేసుకొని రాజధాని స్థలాన్ని తాము ముందుగానే ఎంపిక చేసుకున్న, అప్పటికే గణనీయమైన రియల్ ఎస్టేట్ ఆసక్తులు స్థిరంగా ఏర్పడిన ప్రదేశం వైపుగా ప్రయత్నం సాగించారు. అమరావతిని రాజధాని నగరంగా నిర్ణయించిన పద్ధతి నాయకుడి వ్యూహాత్మక స్వభావాన్ని, చాణక్యాన్ని తెలియజేస్తుంది. వ్యూహాత్మక రీతిలో ప్రతిపక్షాన్ని ఇబ్బందికర పరిస్థితిలోకి నెట్టి లొంగదీసుకోవటమూ, అతి చతురతతో శాసనసభ తీర్మానాన్ని నిర్దిష్ట స్థలాన్ని

పేర్కొనకుండా విజయవాడ పరిసరాల్లోనని తీసికోవడమూ జరిగింది. రాజధాని స్థలం ఎంపికపై శాసనసభ తీర్మానాన్ని సాధనంగా చేసికొని గణనీయమైన రియల్ ఎస్టేట్ ప్రయోజనాలను నిర్మించిన చోట రాజధానిని ఏర్పరచడానికి పూనుకున్నాడు – మాదాపూరులో విజయవంతమైన సైబర్ సిటీ రియల్ ఎస్టేట్ నమూనాను అనుకరించే ప్రయత్నం జరిగింది. ఆ విధంగా కర్నూలులో రాజధాని ఏర్పాటు నిర్ణయం వెనుక శ్రీ ప్రకాశం పంతులుగారి రాజనీతిజ్ఞత, ముందు చూపు కనిపిస్తూ ఉంటే, అమరావతి నిర్ణయం వెనుక శ్రీ నారా చంద్రబాబు నాయుడు వ్యూహాత్మక నాయకత్వం, మోసకారి స్వభావం (Manipulative nature) ప్రతిఫలిస్తున్నాయి.

సైద్ధాంతిక నేపథ్యంలో పరిశీలించినప్పుడు మన మింతకు ముందు గమనించిన విషయాలలో వెనుకబడిన ప్రాంతాలకు అభివృద్ధి ప్రోత్సాహాన్నిచ్చే రాజధాని, లేదా ఇతరాలను చేర్చుకొనకుండా తాను మాత్రమే అభివృద్ధి చెందే రాజధానులను గురించి చెప్పుకున్నాం. కర్నూలు మొదటి తరగతికి చెందినది. పెద్దప్రాంతాలు, మరింత అభివృద్ధి చెందిన ప్రాంతాలు చిన్న, అభివృద్ధి చెందని ప్రాంతాలను తనతో ముందుకు తీసికొని వెళతాయి. తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతంలో రాజధానీ నగరాన్ని ఏర్పరచడమనే రాయితీ ఇవ్వడం ద్వారా ఆ ప్రాంతాల విశ్వాసాన్ని చూరగొంటుంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాధనంగా కూడా ఈ రాజధాని తోడ్పడుతుంది. ప్రపంచంలో ఇటువంటి రాజధానులకు ఎన్నో ఉదాహరణలు లభిస్తాయి: బ్రెజిల్ రాజధాని బ్రసీలియా, కజకిస్తాన్ రాజధాని ఆస్థానా, నైజీరియా రాజధాని అబూజా. ఇటువంటి నిర్ణయాలు తీసికొనే నాయకులు స్వభావరీత్యా దూరదృష్టి కలిగినవారు. వీరు రాజధానీ స్థలం ఎంపికలో సంప్రతింపులకు, ప్రజల ఏకాభిప్రాయసాధనకు ప్రయత్నిస్తారు. ఈ రకమైన రాజధానులను ఫార్వర్డ్ థ్రస్ట్ (forward thrust) రాజధానులంటారు.

దీన్ని రెండో రకంతో పోల్చండి. ఇక్కడ ప్రమాణం రాష్ట్ర అధికారానికి విధేయంగా ఉండే కేంద్రం కావడం. నాయకుడికి తన జాతి బలమైన సమర్థన లభించే ప్రాంతం కావడం. ఇటువంటి రాజధానుల ఏర్పాటు సాధారణంగా నిరంకుశ పాలకుల దేశాలు, రాష్ట్రాలలో జరుగుతుంది. మనలాంటి ప్రజాస్వామ్య దేశంలో సంప్రతింపులు, అభిప్రాయ సేకరణల మార్గం అవలంబించ కుండా రాజధానీనగర స్థల నిర్ణయంలో కూటనీతి, వ్యూహాత్మక మార్గాన్ని అనుసరించి కేంద్రీకృతాభివృద్ధికి

మాత్రమే అవకాశమిచ్చే ఎక్స్‌క్లూజివ్ రాజధానిని ఎంపిక చేసుకోవడం దురదృష్టకరం. ఇటువంటి రాజధానులున్నాయి కాని వాటి న్యాయబద్ధత, సార్థక్యాలు ఒక వ్యక్తితోనో, ఒక వంశంతోనో అనుబంధించి ఉంటాయి. అవి తక్కువ కాలమే ఉండేవి, చాలా అస్థిరమైనవి, నిర్మాణానికీ, నిర్వహణకూ భారీ వ్యయం అవసరమైనవి. అవి తెగ పక్షపాతాన్ని, తమ సొంత తెగకు అధికారబదిలీని, అధికారంలోని కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితమైన భాగస్వామ్యాన్ని ప్రదర్శిస్తాయి. అమరావతి ఎంపిక వ్యూహాలు పన్ని, కూటనీతి ప్రయోగించి జరిగింది. సంప్రదింపులు, ఏకాభిప్రాయ సేకరణ ద్వారా జరగనందున అది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భిన్నప్రాంతాల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించదు. అందువల్ల దాన్ని ఏ విధంగానూ 'ప్రజల రాజధాని' అనలేము.

# 10. లాండ్ పూలింగ్ – అమరావతి

మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఇరుపక్షాలకూ లాభదాయకంగా ఉండే లాండ్ పూలింగ్ ప్రక్రియ ఒక సృజనాత్మక ప్రయోగం. 1890 లలో దీన్ని హాలండ్, జర్మనీలలో విజయవంతంగా ఉపయోగించారు. భారతదేశంలో మొదటిసారి 1915 లో బాంబే టౌన్ ప్లానింగ్ చట్టం కింద ప్రారంభించారు. మాహిం, ఖార్ ప్రాంతాలలో, పెద్ద భాగాల అభివృద్ధికి అది తోడ్పడింది. కాని ఒక చిన్న ప్లాట్లు విషయంలో కూడా యాజమాన్య వివాదాలు ప్రాజెక్టులను అడ్డుకోవడం ప్రారంభించాయి. లాండ్ పూలింగ్‌ను గుజరాత్‌లో 1976 కొత్తగా ఏర్పరచిన చట్టం ద్వారా అమలుచేయడం ప్రారంభించారు. ప్లాట్ల యాజమాన్య వివాదాల సమస్యను 1999 లో టౌన్ ప్లానింగ్ స్కీమును ఆమోదించిన తర్వాత గుజరాత్ అధిగమించింది. వాళ్లు భూమిని స్వాధీనం చేసుకొని రోడ్లు వేయడం ప్రారంభించారు. ఫలితంగా భూముల ధరలు పెరిగాయి. గుజరాత్‌లో లాండ్ పూలింగు జనానికి ప్రోత్సాహమిచ్చింది. లాండ్ పూలింగ్ అంటే అనేక భూ కమతాలను ఒకటిగా పూల్ చేసి భౌతిక, సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఉపయోగించి మిగిలిన భూమిని భూయజమానులకు అభివృద్ధి హక్కులతో తిరిగి ఇవ్వడం లాండ్ పూలింగ్ విధానం. ఇట్లా పూల్ చేసిన భూమిలో కొంతభాగాన్ని ప్రాజెక్టు ఆర్థిక వనరుల కోసం ప్రభుత్వ సంస్థ వేలం వేయడానికి వనరులను సేకరించడానికి వినియోగిస్తారు. భూమిని పూల్ చేసిన భూయజమానుల నుండి కూడా అభివృద్ధి రుసుమును వసూలు చేస్తారు. భూమియజమానులు మౌలిక సదుపాయాల అభివృద్ధి కారణంగా తమ ప్లాట్ల ధరల పెరుగుదల వల్ల లాభపడతారు. ఒక పట్టణ ప్రాంతంలో లేదా పెరుగుతున్న నగర పరిసరాల అభివృద్ధి నిర్వహణలో లాండ్ పూలింగ్ చాలా వరకు విజయవంతమవుతుంది. దీనికి కొన్ని ఉదాహరణలు భోపాల్ –3, గుజరాత్‌లో అహ్మదాబాదు నగర కేంద్రానికి 12 కి.మీ.లో ఉన్న ఒక

టిపిఎస్ (టౌన్ ప్లానింగ్ స్కీం). ఇక్కడ 300 హెక్టార్ల భూమిని పూల్ చేసి అభివృద్ధి చేశారు. అహ్మదాబాదు కేంద్రానికి 6.5 కి.మీ. ఉన్న బోడకదేవ్‌లో 200 హెక్టార్ల భూమిని పూల్ చేసి గుజరాత్ లాండ్ పూలింగ్ స్కీముల కింద అభివృద్ధి చేయడం జరిగింది. ఇరుగుపొరుగు స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధికి 100 హెక్టార్ల భూమి సరిపోతుంది. 100 హెక్టార్ల భూమి లాండ్ పూలింగ్ విధానాన్ని విజయవంతంగా నిర్వహించడానికి ప్రామాణికంగా ఎంచుకోవచ్చు. (Source: Land Pooling and Re-construction and self-financing mechanism for Urban Development – IDFC policy Group Quarterly, March, 2010).

ఢిల్లీ హర్యానాలలో లాండ్ పూలింగ్ స్కీము కింద కొత్త ప్రయోగాలు కూడా జరుగుతున్నాయి. కాలనీని అభివృద్ధి చేసేవారికి రైతులనుండి లాండ్ పూలింగ్ చేయడానికి అనుమతినిస్తారు. నియమ నిబంధనల ప్రకారం వాళ్లు ఆ ప్రదేశాన్ని అభివృద్ధి చేయవచ్చు. ప్రభుత్వం వారికి సదుపాయం కలిగిస్తుంది, నియంత్రణ సంస్థగా పనిచేస్తుంది. "లాండ్ పూలింగ్ విలువను సంపాదించే అవకాశంగా పనిచేస్తుంది. కొత్త ప్రాజెక్టులలో పెట్టుబడులు ఆస్తి విలువను పెంచుతాయి కాబట్టి మౌలిక సదుపాయాల ఖర్చులో కొంత భాగాన్ని ఆస్తియజమానులు భరించేటట్లు చూడవచ్చు" అన్నారు ఎర్విన్ క్రాబెన్, బారీ.

గుజరాత్ టౌన్ ప్లానింగ్ స్కీములు ఎక్కువగా పట్టణ ప్రాంతంలో లేదా పట్టణ పరిసరాల అభివృద్ధికి లాండ్ పూలింగ్ కింద పట్టణ మౌలిక సదుపాయాల నిర్మాణాలకు పరిమితమయ్యాయి. ధోలేరా లాండ్ పూలింగ్ స్కీమ్ భారీ లాండ్ పూలింగ్ స్కీము. గుజరాత్‌లో ముంబై – ఢిల్లీ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా స్మార్ట్ సిటీని ఏర్పాటు చేయడానికి ఈ స్కీము 22 గ్రామాలను తన పరిధిలోకి తీసుకుంటుంది. ఒక హరితక్షేత్ర నగరం (గ్రీన్ ఫీల్డ్ సిటీ) కోసం లాండ్ పూలింగ్ పద్ధతిని వాడడానికి ప్రయత్నించిన తొలి సందర్భం ఇది. 20 గ్రామాలలో స్థానిక ప్రతిఘటన ఎదురుకావడం వల్ల ఇక్కడ లాండ్ పూలింగ్ విజయవంతం కాలేదు. ధోలేరా స్మార్ట్ సిటీ కింద లాండ్ పూలింగు స్వచ్ఛంద స్వభావం గురించి ప్రభుత్వం చెప్పుకుంటున్న విషయాలు సరయినవనుకుంటే చాలా అస్పష్టంగానూ, నిజం కాదనుకుంటే పూర్తిగా ప్రమాదకరంగానూ ఉంటాయి. పట్టనాభివృద్ధి అనే కారట్ వెనుక భూసేకరణ అనే బెదిరింపు కర్ర ఉన్నది.

(ప్రీతి సంపత్, సిమి సున్నీ: Dholera the Myth of Voluntary Land Pooling)

ఢోలేరా ప్రాంతంలో లాండ్ పూలింగ్ వైఫల్యాన్ని పత్రికలు ప్రచురించాయి. అటువంటి ఒక రిపోర్టు 21 జనవరి, 2016 న హిందుస్తాన్ టైమ్స్‌లో వచ్చింది. ఢోలేరా రైతుల మాటలు చాలా సముచితమైనవి. ఢోలేరా ప్రాంతంలోని సరసస్లా గ్రామ వాస్తవ్యుడు రూప్ సంగ్‌భాయి ఇలా అన్నాడు. 'లాండ్ పూలింగు చివరికి రైతును ఎవరికో బానిసను చేస్తుంది. తమ భూములమ్ముకున్నవారు ఇప్పుడు ఇతర రైతుల పొలాల్లో కూలి చేస్తున్నారు లేదా కర్మాగారాల్లో పనిచేస్తున్నారు.' 2007 లో ప్రారంభించిన ఢోలేరా స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజిన్ ప్రాజెక్టు 2016 నాటికి కూడా ముందడుగు వేయలేదు.

భారతదేశంలో లాండ్ పూలింగ్ విషయంలో సాధారణ అనుభవం ఇలా ఉండగా, 2014 లో కొత్త రాష్ట్రం ఏర్పడగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శివరామకృష్ణన్ కమిటీ సిఫారసులకు వ్యతిరేకంగా, సాధ్యతా విశ్లేషణనుగాని, పర్యావరణంపై పడే ప్రభావాన్ని అంచనా వేయడంగాని చేయకుండానే, హరితక్షేత్ర రాజధాని అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌తో వచ్చింది. కొత్త నగరం అభివృద్ధికి మొదటిదశ పదేళ్లలో 2025 వరకు 37,578 ఎకరాల భూమి కావాలి. మూడు దశలు పూర్తయ్యేసరికి అవసరమైన మొత్తం భూమి లక్ష ఎకరాలు. ప్రారంభంలో హరితక్షేత్ర అమరావతీ నగరం నిర్మాణం కొరకు. 25 గ్రామాలలో అవసరమైన భూమిని లాండ్ పూలింగ్ పద్ధతిపై సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాజధానీనగర నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం విలువైన సాంద్ర వ్యవసాయ భూములు. కృష్ణానదిని ఆనుకొని ఉన్న భూములు సంవత్సరం పొడవునా పంటలు పండుతాయి. కృష్ణానదికి దూరంగా ఉన్న భూములు కూడా పత్తి, మిర్చి వంటి వాణిజ్యపంటలు పండించడానికి అనుకూలమైన విలువైన భూములు. ఈ ప్రాంతంలో భూముల ధరలు చాలా ఎక్కువ. ఇంత విశాలమైన భూపరిమాణాన్ని సేకరించడానికి – ముఖ్యంగా నూతన భూసేకరణ చట్ట నేపథ్యంలో – కావలసిన నిధులను ప్రభుత్వం ఎన్నిటికీ సమకూర్చుకోలేదు. ఈ చట్టం భూయజమానులకు సముచితమైన పరిహారాన్ని నిర్దేశిస్తుంది. జీవనోపాధికోసం తమ భూములపైనే ఆధారపడే రైతులకు సమగ్రమైన సహాయాన్ని, పునరావాస పాకేజీని నిర్దేశిస్తుంది. 'అమరావతి' అనే ఈ హరితక్షేత్ర మహారాజధానీనగర నిర్మాణానికి భూసేకరణకు, లాండ్ పూలింగును ప్రత్యామ్నాయ మార్గంగా ప్రభుత్వం భావించింది.

మనం ఇంతకుముందే చూశాం, లాండ్ పూలింగ్ పట్టణ మౌలిక సదుపాయాలను పునఃప్రణాళికీకరించడానికో, పరిసరప్రాంతాలను నివాసభూములుగా చేయడానికి చిన్నచిన్న భూశకలాలను సేకరించడానికో పనికివస్తుంది, అటువంటి సందర్భాల్లోనే విజయవంతమవుతుంది. భారీ స్థాయిలో లాండ్ పూలింగును ఉపయోగించి భూసేకరణ చేసే ప్రయత్నం గుజరాత్‌లోని ధోలేరాలో మాత్రమే జరిగింది. అదొక పెద్ద వైఫల్యంగా మిగిలింది. ఈ ఉదాహరణను ముందుంచుకొని కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'అమరావతి' అనే రాజధానీనగర నిర్మాణనికి భూసేకరణకు భారీ స్థాయి లాండ్ పూలింగ్ పద్ధతిని ఎంచుకుంది.

మనం ముందుగా చూసినట్లు లాండ్ పూలింగ్ పద్ధతి లాండ్ పూల్ చేసిన భూయజమానులు స్వచ్ఛందత, ప్రశంసల మీద ఆధారపడి ఉంటుంది. సామాజిక, భౌతిక మౌలిక సదుపాయాల అభివృద్ధి అనంతరం తమ భూమి విలువ పెరుగుతుందన్న ఆశతో, అభివృద్ధి రుసుముల కింద భౌతిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి డబ్బు చెల్లించడానికి ఇష్టపడతారు. ప్రాజెక్టులో ఇష్టపూర్వకంగా భాగస్వాములవుతారు. ఇక్కడ అమరావతి హరితక్షేత్ర నగరంలో భారీపరిమాణంలో లాండ్ పూలింగ్‌కి ప్రభుత్వం చేసిన ప్రయత్నం పూర్తిగా స్వచ్ఛందత మీద ఆధారపడలేదు. మభ్యపెట్టడం, బెదిరింపు, బలాత్కారాల వ్యూహాలతో ఈ ప్రయత్నం జరిగింది (శ్రీరామచంద్రయ్య, 2016). లాండ్ పూలింగుకు రైతులు లొంగేట్లు చేయడానికి భారీస్థాయిలో ఉపయోగించిన పరోక్ష బలాత్కారపు తొలి సాధనం భూసేకరణ చేస్తామన్న బెదిరింపు. ప్రీతి సంపత్, సన్నీలు పేర్కొన్నట్లుగా స్వచ్ఛందత అన్న కారెట్ వెనుక భూసేకరణ బెదిరింపు అనే నిర్బంధ కర్ర ఉంది. తాము ఇంత భారీ పరిమాణంలో భూసేకరణకు వెళ్లినట్లయితే హరితక్షేత్రనగర నిర్మాణానికి భూసేకరణ చేయడానికి కావలసిన వనరులు తమ వద్ద లేవని తెలిసింది ప్రభుత్వానికి మాత్రమే. రైతులకు ఈ ప్రభుత్వ సమస్య తెలియదు కాబట్టి లాండి పూలింగ్ ప్రక్రియ కింద తమ భూముల్ని పూల్ చేయకపోతే తమ తలపైన భూసేకరణ అనే డెమొకిల్స్ ఖడ్గం వేలాడుతూ ఉందని ప్రభుత్వం రైతులకు చూపించింది. దీనికి తోడుగా ప్రభుత్వం వ్యూహాత్మకంగా పథకం వేసి వేలాదిమంది పోలీసులను రైతులపై బలాత్కారానికి ఉపయోగించిందనీ, శాసనపరమైన చర్యలతోపాటు ఆ ప్రాంతంలోని రైతులు ఈ ప్రాజెక్టు కోసం లాండ్ పూలింగుకు అంగీకరించే విధంగా ఒక మైండ్‌గేమ్‌కి పాల్పడిందనీ శ్రీరామచంద్రయ్య తన వ్యాసం 'Making of Amaravathi:

A Landscape of Speculation and Intimidation' లో పేర్కొన్నారు. లాండ్ పిలింగ్ కోసం భూములు లాక్కొనే భయం కల్పించే మైండ్ గేమ్‌తో పాటు, అధికారపార్టీకి బలమైన సమర్థకులైన పెద్ద రైతులు, ఆబ్సెంటీ భూమి యజమానుల కోఆప్షన్ కూడా ఉంది. ఈ పథకం పనిచేయడానికి ప్రభుత్వం ఒక హైప్ సృష్టించింది. ప్రతిపాదిత రాజధానీనగరం గురించీ, రాజధానీ నగర అభివృద్ధిలో భాగస్వామిగా సింగపూర్ ప్రభుత్వాన్ని నియమించుకోవడం గురించీ ఎక్కువ చేసి చెప్పుకోవడం ఈ హైప్‌లో భాగం. నిరంతరంగా భూముల విలువల్ని పెంచుతూ భవిష్యత్తులో తమకు వచ్చే లాభాల విషయంలో రైతులకు నమ్మకం కలిగిస్తూ ఒక అనిశ్చిత పరిస్థితిలో ఈ హైప్ సృష్టించే వ్యూహాన్ని అవలంబించినట్లు శ్రీరామచంద్రయ్య పేర్కొన్నారు. విదేశీ ప్రతినిధి వర్గాలు, భవిష్యత్తులో పెట్టుబడులు పెట్టేవారు, వచ్చిన పెట్టుబడుల వంటి సమర్థక పద్ధతుల ద్వారా నిరంతరాయంగా హైప్ సృష్టించడం జరిగింది. దీనివల్ల ఈ ప్రాంతంలో ఊహాకల్పనాత్మక ఆసక్తులను సజీవంగా ఉండవచ్చు, తద్వారా భూమి ధరలు పడిపోకుండా చూడవచ్చు. ఫలితంగా రైతులు అమరావతి భవిష్యత్తుపై నమ్మకం కోల్పోకుండా ఉంటారు.

దీనికి అదనంగా లాండ్ పూలింగ్ పద్ధతికి వ్యతిరేకంగా ప్రతిఘటనలను అణచడానికి అనేక బలాత్కారపు చర్యలను ప్రభుత్వం తీసికొన్నది. తన అవసరాలకనుగుణంగా లాండ్ పూలింగ్ జరిగేటట్లు చూసుకొన్నది. కొన్ని పంచాయితీలు భూసేకరణను వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానాలు ఆమోదించాయి. అటువంటి సందర్భాలలో ఒకదానిలో పంచాయతీ కార్యదర్శి తీర్మానంపై సంతకం చేశాడు. అప్పటినుండి ఇటువంటి పంచాయతీ తీర్మానాలపై సంతకం చేసి వాటికి ఆధికారిక హోదా ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రైతులతో అనేక సమావేశాలు జరిపాడు. వాళ్లు లాండ్ పూలింగులో తమ భూములను ఇచ్చినట్లయితే వారిని జిఎంఆర్ వంటి పారిశ్రామిక వేత్తలను చేస్తానని వాగ్దానాలు చేశాడు. అవసరమైన భూములను రైతులనుండి సంగ్రహించడానికి బెదిరింపులు, బలాత్కార పద్ధతులను ఉపయోగించారు. డిసెంబరు 2014 లో ఒక రాత్రి కృష్ణానదీ సమీపగ్రామంలో అరటి తోటలకు నిప్పంటించారు. లాండ్ పూలింగుకు అత్యంత తీవ్రమైన ప్రతిఘటన కృష్ణానదికి ఆనుకొని ఉన్న గ్రామాలలో ఎదురయింది. ఇక్కడ సంవత్సరం పొడవునా వ్యవసాయం ముమ్మరంగా సాగుతుంది. భూముల

ధరలిక్కడ అత్యధికం. ఇక్కడ లాండ్ పూలింగును వ్యతిరేకించే కొందరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఇది ప్రభుత్వమూ, పాలక పక్షమూ (శ్రీరామచంద్రయ్య, 2016) చేసిన దుశ్చర్య అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తూ కాలిపోయిన తోట యజమాని నిర్భయంగా నిలిచాడు. ఈ సంఘటనలో అరెస్టు అయిన యువకుడు అదే ప్రాంతానికి చెందిన, లాండ్ పూలింగ్‌ను క్రియాశీలంగా వ్యతిరేకిస్తున్నవాడు. గ్రామంలో పోలీసులను పెట్టకముందు ఉన్నతస్థాయిలో పథకం వేసి చేసిన అరెస్టు ఇది అన్న శంకకు ఇది ఆస్కారమిచ్చింది. ఈ భయోత్పాతాన్ని కొంతకాలం సాగనిచ్చారు. ఈ సమయంలో దాదాపు 8 బెటాలియన్ల పోలీసునిక్కడ దించారు. ఆ సమయంలో తెచ్చిన లాండ్ ఆర్డినెన్సు క్రింద భూసేకరణ జరుగుతుందన్న బెదిరింపు ప్రచారం చేశారు. చట్టంలోని కొన్ని భద్రతా నిబంధనలను తొలగించడం ద్వారా రైతులు లాండ్ పూలింగ్‌లో తమ భూములను దఖలు పరిచేవిధంగా ఈ ఆర్డినెన్సు ద్వారా బలవంతం చేశారు. వాళ్లు లాండ్ పూలింగ్ పద్ధతిలోకి రాకపోయినట్లయితే వారి భూములను 'గ్రీన్ బెల్ట్' కింద ప్రకటించడం జరుగుతుందనీ, వాళ్ల భూములకు ఎటువంటి విలువా పొందరనీ అదే సమయంలో ఒక బెదిరింపును కూడా ప్రచారం చేశారు. ఈ బెదిరింపు కారణంగా లాండ్ పూలింగును వ్యతిరేకించిన ఒక చిన్న మహిలా రైతు తాను లాండ్ పూలింగుకు వ్యతిరేకం కాదనీ, తన భూమిని వశపరచడానికి సిద్ధంగా ఉన్నాననీ ప్రకటించింది (శ్రీరామచంద్రయ్య, 2016).

లాండ్ పూలింగుకు రైతుల అంగీకారం సంపాదించడానికి ఇద్దరు మంత్రులు అక్కడే కాంపు వేసి తమ పూర్తికాల బాధ్యతగా ఈ గ్రామాల్లో పనిచేశారు. వారు తమ పొలాలు సాగుచేయకుండా వాటికి విద్యుత్తును నిలిపివేశారు. ఆ తరువాత కూడా అక్టోబరు 2015 లో కూడా రైతులు లాండ్ పూలింగు చేసేటట్లుగా బలవంతపెట్టడానికి వారి చెరకు తోటలను తగలపెట్టించారు. 08.12.2015 న లింగాయపాలెం గ్రామంలో అరటితోటలను బుల్ డోజర్‌తో నేలమట్టం చేయించారు. లాండ్ పూలింగులో చేరడానికి నిరాకరించిన ఈ రైతుకు 24 లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. ఆ విధంగా అమరావతిలో లాండ్ పూలింగు స్వచ్ఛందరీతిలో జరగలేదు. ఈ భూములు చాలా సారవంతమైనవి. ముమ్మరంగా వ్యవసాయం జరిగే భూములివి. ఢోలేరా రైతుల్లాగానే తమ పొలాలను వశపరచి చివరికి మరెక్కడో కర్మాగారాలలో పనిచేయడం ఈ రైతులకు ఇష్టంలేదు. అయితే పెద్ద రైతులు, ఆబ్సెంటీ భూయజమానులు కూడా

ఉన్నారు. వీళ్ల పిల్లలు చదువుకొని ఎక్కడెక్కడో స్థిరపడిపోయారు. ముఖ్యంగా తరువాతి తరంలో తమ భూములను సాగుచేసుకోవడంలో ఆసక్తిలేనివారి కుటుంబాలు, లాండ్ పూలింగులో తమ భూములను ఇవ్వడానికి ఇష్టపడ్డారు.

అందువల్ల శ్రీరామచంద్రయ్య గమనించినట్లు అమరావతి ఒక ఊహా కల్పనాత్మక నగరం. ఇక్కడ ఒక హరితక్షేత్ర నగరనిర్మాణానికి కావలసిన భూమిని, ప్రభుత్వం వ్యూహాత్మకంగా పన్నిన 'మైండ్ గేమ్' వ్యూహంతోనూ, ఊహాకల్పన, బెదిరింపు, బలాత్కారం, కో ఆప్షన్‌లపై ఆధారపడి పూల్ చేయడం జరిగింది.

# 11. ప్రపంచ బాంకు – అమరావతి

స్పెషల్ కాటగిరీ స్టేటస్‌కు బదులుగా భారతప్రభుత్వం ప్రకటించిన స్పెషల్ పాకేజ్ స్కీము నుండి ప్రయోజనం పొందే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సస్టెయినబుల్ కాపిటల్ సిటీ డెవలప్ మెంట్ ప్రాజెక్టుకు ప్రపంచబాంకు ఋణానికి వెళ్లింది. వాస్తవానికి స్పెషల్ కాటగిరీ స్కీములో ఇఎపి ప్రాజెక్టుకు అప్పుగా కాక గ్రాంటురూపంలో సహాయం చేసే కొన్ని వాగ్దానాలున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా రోడ్ల మౌలిక సదుపాయాలు, వరదల తగ్గింపు చర్యలు, సాంకేతిక సహాయం ఉంటాయి. ఈ ప్రాజెక్టు అవుట్ లే రూ॥ 5000 కోట్లు. ఇందులో రూ॥ 2000 కోట్లు ప్రపంచ బాంకునుండి అప్పుగా, రూ॥ 1000 కోట్లు ఆసియా అభివృద్ధి బాంకు (ఎడిబి) నుండి అప్పుగా, తక్కిన మొత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి రావాలి. ఈ ప్రాజెక్టుకు ప్రపంచబాంకు నుండి అప్పు తీసుకునే విషయంపై స్థానిక ప్రజలకు ఎన్నో అభ్యంతరాలున్నాయి. ప్రపంచబాంకు నియమాలు, హద్దులను ప్రభుత్వం పాటించకుండానే అమరావతి ప్రాజెక్టుతో ముందుకు వెళ్లింది. అందువల్ల ప్రపంచబాంకు ఒక ఇన్‌స్పెక్షన్ టీమును ఏర్పరచాలని నిర్ణయించింది. ఈ టీము తమ ఇన్‌స్పెక్షన్ రిపోర్టులో అనేక విషయాలను పేర్కొంది. ఆ ప్రాంతంలోని ప్రజలు లాండ్ పూలింగ్ స్కీము విషయంలో తమతో వారి అనుభవాలను పంచుకున్నారని ఈ జట్టు తెలిపింది. లాండ్ పూలింగు కిందికి రాకపోయినట్లయితే, వారి భూములను భూసేకరణ పద్ధతిలో తీసివేసుకోవడం జరుగుతుందనే బెదిరింపుతో లాండ్ పూలింగ్ స్కీములో చేరేటట్లు బలవంతపెట్టినట్లు అక్కడి ప్రజలు తమకు తెలిపినట్లు ఈ జట్టు నివేదికలో చెప్పింది. అమరావతి ప్రాంతంలో భూమి ధరలు పెంచనందున భూసేకరణ కింద తమకు అందే పరిహారం తక్కువగా ఉంటుందని రైతులు భయపడుతున్నారు. అధికారులనుండి, గుర్తు తెలియని వ్యక్తులనుండి తమకు బెదిరింపులు వస్తున్నాయని కూడా రైతులు తెలిపారు. రాష్ట్ర

ప్రభుత్వంతో సహకరించకపోయినట్లయితే లాండ్ పూలింగ్ లాభాలు వారికి లభించవని కమ్యూనిటీ సభ్యులే బెదిరిస్తున్నారనీ, అంటే వాగ్దానం చేసిన హెల్త్ బెనెఫిట్లు వంటివి అందవన్నమాట. జారీచేసిన హెల్త్ ఇన్సూరెన్సు కార్డులను ఆసుపత్రులలో అంగీకరించరు. వాళ్ల భూములకు హద్దులు నిర్ణయించి తిరిగి ఇవ్వరు. బలహీనవర్గాల పట్ల వివక్ష చూపుతున్నారు. ఇటువంటి లాండ్ పూలింగులో చేరని రైతులకు, విద్యుత్ కనెక్షన్లు కత్తిరించేస్తారు. వాళ్లు తమ భూములను దాదాపు ఒక సంవత్సరం పాటు సాగు చేసుకోలేకపోయారు. తక్కువ జీతాల కూలి పనివారి జీవన ప్రమాణాలు కూడా లాండ్ పూలింగ్ స్కీం అమలు తర్వాత పడిపోయాయనీ, భూమిలేని వాళ్లు తమకు వాగ్దానం చేసినట్లుగా స్వీయ ఉపాధి, విద్యావిషయకమైన ఫీజులు చెల్లింపు మొదలైనవి లభించలేదనీ ఇన్స్పెక్షన్ కమిటీ ముందు రైతులు చెప్పుకున్నారు. రైతులు వ్యక్తం చేసిన భయాలను, వారి జీవనోపాధుల దైన్యాన్ని ఇన్స్పెక్షన్ జట్టు గమనించింది. రైతులు తమ అనుభవాలు చెప్పుకున్నారు. తమ భూములు పోయిన తర్వాత తాము మరో ఉపాధిని స్వీకరించలేమని చెప్పుకున్నారు. స్థానిక కూలిరేట్లు అక్కడ చాలా ఎక్కువగా ఉన్నాయని, రోజుకు 800 రూ॥ల కూలిరేటు ఉందని, ఆ విధంగా నెలకు సగటున 19,000 రూ॥ల ఆదాయం ఉంటుందని, కాని ప్రస్తుతం పింఛను నెలకు 2500 రూ॥లు మాత్రమే వస్తున్నదని వాళ్లు వాపోయారు.

మొత్తం అనైచ్ఛిక పరిస్థితిలో (involuntary situation) లాండ్ పూలింగ్ ఒక ఎంపిక అని ఇన్స్పెక్షన్ టీము ప్రత్యేకంగా పేర్కొన్నది. భూసేకరణ ప్రత్యామ్నాయం ఉన్నప్పుడు లాండ్ పూలింగ్ స్వచ్ఛంద ప్రక్రియ అనడం కష్టమని ఇన్స్పెక్షన్ టీమ్ అభిప్రాయపడింది. భూమిని సొంతానికి ఉంచుకోవడమనే ప్రశ్నే తలెత్తినప్పుడు ఒకే ఎంపిక ఉంటుంది కాబట్టి అది అనైచ్ఛిక పునరావాసమేనని చెప్తూ ఇన్స్పెక్షన్ పానెల్ ఇలా ముగించింది. అభ్యర్థనలు హానికారక సమర్థమైన ముఖ్యమైన అంశాలను లేవనెత్తుతున్నాయి. అట్లాగే నిబంధనలకు కట్టుబడకపోవడం కూడా. అందువల్ల బాంకు విధానాలకు కట్టుబడకపోవడంతో సహా ఈ అన్ని అంశాలపై మరింత సమగ్రమైన దర్యాప్తు అవసరం ఉంది. ముఖ్యంగా అనైచ్ఛిక పునరావాసం, పర్యావరణ సంబంధమైన సమస్యలు, సంప్రతింపులు, భాగస్వామ్యం, సమాచార వ్యక్తీకరణల విషయంలో ఈ పరిశీలన అవసరమని తేల్చింది.

# 12. స్విస్ ఛాలెంజి – సింగపూరు సంబంధం

**కొ**త్త రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రణాళిక వేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర మాస్టర్ ప్లాను, వివరణాత్మక మాస్టర్ ప్లానుల రచన కోసం సింగపూరు ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. ప్రారంభిక సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను సింగపూరు ప్రభుత్వం ఉచితంగానే తయారుచేసింది. కాని వివరణాత్మక మాస్టర్ ప్లాన్ కోసం రాష్ట్రప్రభుత్వం సింగపూరు ప్రభుత్వానికి సంబంధించిన సుర్బానా సంస్థకు 12 కోట్ల రూపాయలు చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి, స్టార్టప్ ఏరియాలో సీడ్ కాపిటల్ సిటీ నిర్మాణంలో సింగపూరు కంపెనీలకు కాంట్రాక్టు ఇవ్వడంలో అనుసరించిన మొత్తం పద్ధతిని, ప్రక్రియను పరిశీలిస్తే, ఆ కంపెనీలకు కాంట్రాక్టు కట్టబెట్టాలని ముందే నిర్ణయించుకున్నట్లు, తాము ముందే నిర్ణయించుకున్నట్లు సింగపూరు కంపెనీలకు ప్రాజెక్టు నివ్వడానికి కావలసిన ఔపచారిక ప్రక్రియను నిర్వహించినట్లు అనిపించక మానదు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి రాష్ట్రప్రభుత్వం స్విస్ ఛాలెంజి పద్ధతిని ఎంచుకుంది. కాని దాన్ని కూడా ఉన్నదున్నట్లుగాకాని, ప్రక్రియ విధివిధానాలను సక్రమంగా అనుసరించకుండా వక్రమార్గంలో ఈ సింగపూరు కంపెనీల కన్సార్టియంకు అనుచిత ప్రయోజనం చేకూరేటట్లుగా, వారికే కాంట్రాక్టు దక్కేటట్లుగా సదుపాయం కల్పించడం జరిగింది. ఈ స్విస్ ఛాలెంజి పద్ధతిని అమలుచేసిన ప్రక్రియపై కూడా ఎన్నో ఆరోపణలు వచ్చాయి. ముందు సింగపూరు కన్సార్టియం తమ ప్రతిపాదనను సమర్పించడానికి అనుమతించారు. ఇది అంగీకరించిన స్విస్ ఛాలెంజి నియమాలకు విరుద్ధం. ఇతరులు తమ కౌంటరు ప్రతిపాదనలు సమర్పించడానికి అతి తక్కువ సమయం ఇచ్చారు. అసలు కాంట్రాక్టే సింగపూరు కంపెనీలకే లభించే విధంగా తయారుచేయబడింది. మధ్యవర్తిత్వం లండన్‌లో జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాల చట్టం రాజీ చర్యలకు

ఈ స్థానాన్ని ఎంచుకుంది. సింగపూరు కంపెనీలు చెల్లించవలసి కనీస గ్యారంటీలకు ఎటువంటి ఏర్పాట్లు కల్పించలేదు. ఈ కంపెనీలకు భూమిని రాయితీ ధరలలోకాని, ఉచితంగా కాని ఇవ్వాలి. కేవలం నామమాత్రపు ఆదాయపు వాటానే ఊహించారు. సింగపూరు కంపెనీలకు చూపించిన అనుచిత పక్షపాతం, మనకు కంటికి కనిపించే దానికంటే భిన్నంగా కనిపించని దేదో ఉందన్న అనుమానాన్ని కలిగిస్తుంది.

సింగపూరు ప్రభుత్వం అంతరంగ పరిపాలనలో స్వచ్ఛపాలనను అందిస్తుంది. కుటుంబ పాలనావ్యవస్థలో ఉక్కుహస్తంతో, అంతర్గత పాలనలో ఉన్నతస్థాయి నిజాయితీతో నడుపుతాయి. కాని ఈ ద్వీప రాజ్యపు అంతర్జాతీయ వ్యవహారాలలో విభిన్నవిధానాన్ని అనుసరిస్తుంది. 2006 లో మోర్గన్ స్టాన్లీ ప్రధాన ఆర్థికవేత్త ఆండీజీ ఇలా అన్నారు, 'అవినీతిపరులైన ఇండోనీసియన్ వ్యాపారస్థులు, ప్రభుత్వాధికారులకు మనీ లాండరింగ్ కేంద్రంగానే వాస్తవానికి ప్రధానంగా సింగపూరు దేశ సాఫల్య సంపాదన జరిగింది.' అమెరికా అంతర్జాతీయ మాదక పదార్థాల నియంత్రణ నివేదిక, 2011 కఠినమైన బాంకు రహస్యచట్టాలు, సింగపూరును విదేశీ అవినీతి అధికారులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుస్తున్నాయని పేర్కొన్నది. ఒక అంతర్జాతీయ అలీన నెట్ వర్కు అయిన టాక్స్ జస్టిస్ నెట్ వర్కు నివేదికలో 2013 లో ఆర్థిక రహస్య సూచిలో సింగపూరు ఐదవ స్థానంలో ఉన్నట్లు పేర్కొంది. అంటే ధనవంతులైన వ్యక్తులు తమ డబ్బును దాచుకోవడానికి ఇదొక ప్రధాన కేంద్రమని అర్థం. సింగపూరు దేశీయంగా చట్టపరమైన నియమాలను కఠినంగా పాటిస్తూ విదేశీ చట్టభంగాలను పట్టించుకోదన్నమాట. ఫెయిర్ అబ్జర్వర్‌లో మీడియా అస్కర్ వ్యాసంలో 'ధనిక ఇండోనీసియన్లు తమ సేవింగ్సును దాచుకోవడానకి అతివ్యూహాత్మక స్థానంగా సింగపూరు తయారయింది. దీనికి కారణం రహస్యాన్ని భద్రంగా కాపాడే నియమాలు' అని పేర్కొనడం జరిగింది. ఇటువంటి అవిశ్వసనీయచరిత్ర ఉన్న దేశాన్ని భాగస్వామిగా ఎందుకు ఎన్నుకున్నారు? సింగపూరు కంపెనీలకు కాంట్రాక్టులు కట్టబెట్టడంలో అనుచితమైన పక్షపాతం ఎందుకు చూపించారు? వంటి ప్రశ్నలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎప్పుడో ఒకప్పుడు సమాధానం చెప్పవలసి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మాణంలో ఈ దేశాన్ని, ఈ దేశపు కంపెనీలను భాగస్వాములు చేయడానికి ఆ దేశపు నిజాయితీ ఎంత ఉన్నతస్థాయిలో ఉందో ఎప్పుడూ ఉదాహరణలు చెప్తుంటారు. సింగపూరుపై జస్టిస్ నెట్‌వర్క్

సమర్పించిన ఒక కథనాత్మక నివేదిక ఇలా వివరిస్తున్నది – దేశీయ చట్టాలను దృఢంగా గౌరవించి పాటించడం, అదే సమయంలో విదేశీ చట్టాల ఉల్లంఘనను, అక్రమ ధనాన్ని దాచుకోవడం వంటి కార్యక్రమాలనుండి ఏర్పడే 'మేము మీ డబ్బు దొంగిలించం, మీరు మరొకరి డబ్బు దొంగిలిస్తే మేము పట్టించుకోం' వాణిజ్య ఆదర్శంతో కూడిన లీ కువాన్ యూ నమూనాను వివరిస్తుంది. ఈ ద్వీపరాజ్యం ఉన్నతస్థాయి నిజాయితీని తన దేశీయ పాలనలో అవలంబిస్తుంది కాని, అంతర్జాతీయ వ్యవహారాలలో అలా చెప్పలేం.

ఇంకా సింగపూరు కంపెనీలలో ఒకటయిన సెంబ్ కార్ప్ బ్రెజిల్ పెట్రోబ్రాస్ కుంభకోణంలో ఆరోపణలనెదుర్కుంటున్నది. ఈ కంపెనీ కూడా కన్సార్టియంలో ఒకటి. సింగపూరు కంపెనీల కాంట్రాక్టు ఇచ్చేముందు ప్రభుత్వం ఈ కంపెనీల గురించి విచారించే జాగ్రత్తలేమీ తీసికోలేదు.

ఆ విధంగా సింగపూరు అవినీతి రహితమనే ప్రభుత్వవాదం, అత్యున్నతస్థాయి నిజాయితీ కలిగిన దేశం కాబట్టి దాన్ని నూతన రాజధానీనగర అభివృద్ధిలో భాగస్వామిని చేశామన్న వాదం చాలా సందేహాస్పదమయినది.

మరియొక ముఖ్య విషయం ఏమిటంటే ఏ ప్రదేశం ఈ సీడ్ కాపిటల్ కట్టడానికి సింగపూర్ కంపెనీలకు కేటాయింపబడిందో అక్కడ జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పుననుసరించి, రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ (State environment impact assessment authority) ఉత్తర్వుల మేరకు ఎటువంటి కట్టడాలూ చేపట్టే అవకాశం లేదు. హరిత ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం కృష్ణానది కరకట్ట లోపల ప్రాంతం ముంపు ప్రాంతంగా గుర్తించబడి ఎటువంటి కట్టడాలు చేపట్టడానికి వీలులేదు.

పర్యావరణ సంస్థ ఉత్తర్వు ప్రకారం కరకట్ట నుంచి మూడు కిలోమీటర్ల పరిధిలో కేవలం అటవీ సంబంధమైన మొక్కలను నాటడానికి హరిత, జల పరమైన కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశమున్నది. సింగపూర్ సంస్థలకు కేటాయించిన స్థలం సరిగా ఈ ప్రాంతంలోనే వస్తుంది. అటువంటి పరిస్థితులలో ప్రభుత్వం వారితో ఒప్పందం చేసుకొని ప్రాజెక్టు విషయంలో ముందుకెందుకు పోతున్నదో అర్థం కావడంలేదు. పైగా మధ్యవర్తిత్వం ఈ ఒప్పందం ప్రకారం లండన్ నగరంలో

ఉంటుంది. ప్రాజెక్టు మొదలుపెట్టకుండానే మన రాష్ట్రం మీద మధ్యవర్తిత్వ ఒప్పందం ద్వారా సింగపూరు కంపెనీలు నష్టపరిహారానికి కేసులు వేసే అవకాశం లేకపోలేదు. ఈ రకంగా నిజాలను దాచి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఎందుకు మభ్యపెడుతున్నదో అర్థంకావడం లేదు. ఇది మరొక ఐ.యమ్.జీ. భరత్ కేసులాగా తయారవు తుందనడంలో ఎట్లాంటి సందేహం లేదు.

# 13. అమరావతి – ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర నగరాలు

అమరావతి, దాని అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కొత్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఇతరనగరాల అభివృద్ధిని రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కుంటుపరిచే అవకాశం ఉంది. 'Capital cities Varieties and Patterns of Development and Relocation' అన్న తన పుస్తకంలో వాదిం రాస్‌మన్, కొన్ని ఆసక్తికరమైన పరిశీలనలు చేశాడు. తగినంత పరిమాణం కలిగిన బలమైన నగరాల నెట్‌వర్క్ ఉన్న దేశాలు, ప్రాంతాలలో రాజధానీనగరాలు స్వాభావికంగానే చిన్నవిగా ఉంటాయనీ, నగరాల నెట్‌వర్క్ చిన్నదిగా ఉండి నగరాలు పరిమాణంలోనూ, సంఖ్యలోనూ తక్కువగా ఉన్నప్పుడు రాజధానీనగరాల పరిమాణం పెద్దదిగా ఉంటుందనీ అతనంటాడు. మధ్యస్థాయి పరిమాణం గల అనేక పట్టణాల నెట్‌వర్కు, వైజాగ్, విజయవాడ, తిరుపతి అనే మూడు పెద్ద నగరాలు రాష్ట్రం మూడు ప్రాంతాలలోనూ ఉండడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అదృష్టం. ఇటువంటి బలమైన నగరాల నెట్‌వర్కు ఉన్న రాష్ట్రంలో ఒక భారీ పరిమాణం గల హరితక్షేత్ర రాజధానీనగరంపై ప్రత్యేక శ్రద్ధ శివరామకృష్ణన్ కమిటీ చెప్పినట్లు తేనెకుండ ప్రభావాన్ని చూపి, పెట్టుబడులు, నిధులు అన్నీ ఒకే చోట కేంద్రీకృతమై ప్రస్తుతం ఉన్న నగరాల విస్తరణకూ, ఆరోగ్యకరమైన అభివృద్ధికీ ఆటంకం కలిగిస్తుంది. ఇది ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంభమైంది. రాజధానీనగరం అమరావతిపై కేంద్రీకరించే మానసికస్థితి నుండి రాష్ట్రప్రభుత్వం బయట పడనట్లయితే ఇది ఇలా కొనసాగుతూనే ఉంటుంది. ఇది ఇలా ఉంటే మనం ఎంత శ్రమ పడినప్పటికీ అనేక ఇతర కారణాల మూలంగా రాజధాని ప్రాజెక్టు ముందుకు సాగకపోవచ్చు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నప్పుడు నాకిది ప్రత్యక్షానుభవమే. ఒకరోజు ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రతినిధి, నేను విజయవాడలో ఉన్నప్పుడు నాకు ఫోను చేసి దక్షిణ కొరియా రాయబారి ప్రతినిధి నన్ను కలుసుకోవాలనుకుంటున్నాడనీ, తమకు ఎదురైన

ఒక ఇబ్బందిని వివరించదలచుకున్నాడనీ సమాచారమిచ్చారు. వాళ్లకు నేను సమయమిచ్చాను. వాళ్లు నన్ను కలుసుకున్నారు. ఆ సంవత్సరం భారత – కొరియా పారిశ్రామిక సమావేశం నిర్వహించడానికి వైజాగ్‌ను వేదికగా ఎంపిక చేసుకున్నామనీ, కాని గౌరవనీయ ముఖ్యమంత్రి అది విజయవాడలో జరగాలని పట్టుపడుతున్నారని వాళ్లు చెప్పారు. గౌరవనీయ ముఖ్యమంత్రి అభ్యర్థనను మన్నించి తాము విజయవాడకు వచ్చామనీ, కానీ ఇటువంటి పెద్ద సన్నివేశాన్ని నిర్వహించడానికి తగిన వేదికగానీ, వసతికానీ విజయవాడలో లభించనందున, ఈ సమావేశాన్ని వైజాగ్‌లోనే నిర్వహించుకోవడానికి ముఖ్యమంత్రిగారిని ఒప్పించడానికి నన్ను సహాయం చేయమనీ వాళ్లు కోరారు. తదనుగుణంగా నేను ముఖ్యమంత్రిని కోరాను, ఆయన వైజాగ్‌లో సమావేశ నిర్వహణకు అంగీకరించారు. ఆ విధంగానే దాని నిర్వహణ జరిగింది. పెట్టుబడులు, నిధుల ప్రవాహానికి గమ్యంగా అమరావతిపై అతి శ్రద్ధ తక్కిన రాష్ట్రానికీ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో ఉన్న ఇతర ప్రధాన నగరాలకూ ఘోరమైన ఫలితాలనివ్వవచ్చు. ఇటీవలే రాష్ట్రప్రభుత్వం ప్రపంచబాంకును 2000 కోట్ల అప్పు అడిగింది, అమరావతీ నగర అభివృద్ధికి దాన్ని గ్రాంటుగా అడిగింది. ఈ నిర్దిష్ట మొత్తాన్ని రాష్ట్రవిభజన ఫలితంగా కేంద్రప్రభుత్వం ఇవ్వవలసిన ప్రత్యేక కేటగిరీ స్టేటస్‌కు బదులుగా ప్రకటించిన ప్రత్యేక పాకేజీలో భాగంగా రాష్ట్రప్రభుత్వం కేంద్రప్రభుత్వాన్ని అడిగింది. అసలు రాష్ట్రం మొత్తం అభివృద్ధి కోసం అన్నిప్రాంతాలకూ ఈ నిధి అందడం సముచితం. కాని భారతప్రభుత్వం లేదా ఇతర మల్టీలేటరల్ ఏజెన్సీలనుండి వచ్చి ఇటువంటి నిధులను ఒకే ఒక స్థలానికి వాడడం ఎంతవరకు సమంజసం? ఏ రాష్ట్రమయినా తన అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసేటప్పుడు రాష్ట్రానికి ప్రత్యేకమైన సమస్యలను దృష్టిలో పెట్టుకుంటుంది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే రాష్ట్ర వైశాల్యం ఎక్కువ. తత్ఫలితంగా విభిన్న ప్రదేశాలలోని అభివృద్ధి కేంద్రాలు మూడు ప్రధాన ప్రాంతాలలోనూ సహజమైన పెద్దనగరాల అభివృద్ధికి కారణమయ్యాయి. రాష్ట్రంలో ప్రాంతీయాభివృద్ధి సమతుల్యతను సాధించడానికి రాష్ట్రప్రభుత్వం ఆయా ప్రాంతాల సముచిత అభివృద్ధికి కృషి చేయడం అత్యవసరం. ఒక లక్ష్యాత్మక ఫార్ములా ఆధారంగా తనకు అందిన నిధులన్నిటినీ సమానంగా పంపిణీ ఈ ప్రాంతాలన్నిటికీ జరిగేటట్లు చూడాలి. అన్ని నిధులనూ ఒకే చోట కేంద్రీకరించే ప్రయత్నం అంతరాలు పెరగడానికి తోడ్పడి, భిన్నప్రాంతాల మధ్య సందేహాలకు, ద్వేషానికి తావిస్తుంది.

# 14. చైనా ఘోస్ట్ నగరాలు – నేర్చుకోవలసిన పాఠాలు

**చై**నా ఎంత వేగంగా నగరాలు నిర్మించిందంటే, జనం వాటిలోకి తరలిరావడానికి సమయం చాల లేదు. డిమాండు ననుసరించి పట్టణ ప్రాంతాలను క్రమంగా విస్తరించడానికి బదులు, చైనా పూర్తిగా కొత్తనగరాలను అన్నిటినీ ఒక్కసారిగా నిర్మించాలని తలపెట్టిందని ఆండ్రూ టరంటోలా తన వ్యాసంలో రాశాడు. ఇందులో ఒక లాభం ఉంది సెంట్రల్ ప్లానింగ్, సమగ్ర పట్టణ ప్రణాళికలకు అవకాశం ఏర్పడుతుంది. కాని మొత్తం ప్రాజెక్టే ప్రమాదంలో పడింది, ఎందుకంటే జనం ఆ నగరాలకు తరలడానికి ఇష్టపడలేదు. మొక్కజొన్న పొలాలలో నిర్మించిన న్యూ సౌత్ చైనా మాల్, దాన్ని ప్రారంభించిన దశాబ్దం తర్వాత కూడా 99% జనావాస రహితంగానే ఉండిపోయింది. దీన్ని 2005 లో 8,92,000 చదరపు మీటర్ల బిల్డప్ ఏరియాలో నిర్మించారు.

**తియాందు చెంగ్**

హాంగ్ ఝూన్‌లో కొత్తగా నిర్మించిన తియాందు చెంగ్ నగరంలో జనమే లేరు. ఈ నగరంలో ఐఫెల్ టవర్‌కి ప్రతిరూపం ఉండడం విశేషం. 2003 లో సెంట్రల్ మంగోలియాలో ఉత్తర చైనా దుబాయిగా పిలిచే కాంగ్ బాషి రియల్ ఎస్టేట్ స్పెక్యులేషన్‌కు బలిపశువయింది. రియల్ ఎస్టేట్ స్పెక్యులేటర్లు ఈ నగరంలో చేరి సముచితమైన మార్కెట్ ధరలకంటే చాలా అధికంగా కిరాయిలు పెంచారు. ఇది పౌరులు నగరంలో నివసించడానికి రాకుండా అడ్డుపడింది. 10 లక్షల జనాభా కోసం నిర్మించిన నగరంలో ఇప్పుడు 30,000 జనాభా మాత్రమే ఉంది.

## ఝెంగ్ దాంగ్ నూతన ప్రాంతం

ఝెంగ్ దాంగ్ నూతనప్రాంతంలో గోధుమ పొలాల్లో శాన్ ఫ్రాన్సిస్కోకు రెండు రెట్లుండే మహానగరాన్ని నిర్మించారు. ఈ ప్రాంతంలో జనాభా పెరిగినప్పటికీ కొత్తజిల్లా ప్రాంతంలో పెరగలేదు. ఈ నగరాన్ని ఎవరికోసం నిర్మించారో వారు కిరాయిలు భరించే స్థితిలో లేరు.

## చెంగ్ గాంగ్

కుమ్మింగ్‌లో వెల్లువెత్తుతున్న జనాభా కోసం చెంగ్ గాంగ్ నూతన ప్రదేశాన్ని నిర్మించారు. పూర్తిగా ఉపయోగానికి సిద్ధంగా ఉంది కాని జనం లేరు. మీరు నగరాన్ని నిర్మించినంత మాత్రాన దానిలో నివసించడానికి జనం వస్తారని లేదు.

కొత్త హరితక్షేత్ర నగరాల నిర్మాణంలో చైనా ప్రయోగం సరైన ప్రణాళిక, వాస్తవికమైన జనాభా అంచనాలు లేకుండా నగరాలు నిర్మించడం విఫలం కాక తప్పదని నిరూపిస్తుంది. అవి అవసరమైన జనాభాను ఆకర్షించలేవు. అతి స్పెక్యులేటివ్ కార్యకలాపాలు కొన్నిసార్లు వ్యతిరేకఫలితాలనిస్తాయి. ఏ జనాభా కోసం నగరం నిర్మించారో దాన్ని వారికే అందుబాటులో లేని ధరలు నిర్ణయించిన ఫలితమిది. అమరావతి నిర్మాణంలో చైనీయ అనుభవాల నుండి పాఠాలు నేర్చుకోవాలి, ఎందుకంటే అమరావతి నిర్మాణం, వలసవచ్చే ప్రజల విషయంలో అవాస్తవికమైన అంచనాలపై ఆధారపడి జరుగుతూ ఉంది. అమరావతి నగరనిర్మాణం ప్రారంభం కాకముందే అది అతి స్పెక్యులేటివ్ కార్యక్రమాలకు బలి అయింది. అత్యంత ఆశావహమైన అభివృద్ధి అంచనాల పరంగా కూడా అది కొనసాగగలిగింది కాదు.

# 15. ముగింపు/ఉపసంహారం

ఈ పుస్తకంలో మనం ఇంతరవరకు ప్రాచీనకాలంలో ఆంధ్రుల రాజధానీనగరాలతో ప్రారంభించి ఆధునికకాలం వరకు, మరింత నిర్దిష్టంగా స్వాతంత్ర్యానంతరం కర్నూలు నుండి హైదరాబాదు ద్వారా 2014 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని ప్రకటించడానికి దారితీసిన ప్రక్రియ వరకు చరిత్రను పరిశీలించాం. 1953 లో రాజధానిని కర్నూలులో నిర్ణయించిన నాయకత్వశైలికీ, 2014 లో అమరావతి ఎంపికలో నాయకత్వశైలికీ తారతమ్యం చూశాం. రాజధానీనగర స్థలాల ఎంపికలో సైద్ధాంతిక నేపథ్యాన్ని చారిత్రిక దృక్కోణంలో పరిశీలించాం. వివిధ ఖండాలలో రాజధానీనగరాల స్థాపనలో అంతర్జాతీయ అనుభవాలను, స్వాతంత్ర్యానంతరం మన దేశంలో రాజధానీనగరాల ఏర్పాటు అనుభవాలను, 21వ శతాబ్దంలో ప్రజల డిమాండుపై రాష్ట్రాలను విభజించడం వల్ల కొత్తగా ఏర్పరచవలసి వచ్చిన రాజధానుల అనుభవాలను పరిశీలించాం. అమరావతికి నిర్దిష్టమైన, ప్రత్యేకమైన సమస్యల దృష్ట్యా లాండ్ పూలింగు, మల్టీ లేటరల్ ఏజెన్సీలనుండి ఆర్థిక సహాయం, కొన్ని విదేశాలు, కంపెనీలకు ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి రాజధానీనగరం అమరావతి నిర్మాణానికి ఆహ్వానించిన ప్రభుత్వ ప్రయత్నాలు మొదలైనవాటి గురించి గత అధ్యాయాలలో చర్చించాం.

కొత్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని స్థలనిర్ణయానికి సముచితమైన వ్యూహం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేకదృష్టితో నిర్దిష్ట ప్రమాణాల ఆధారంగా జరగవలసి ఉండింది. అన్నిటికంటే ముఖ్యమైనది ఆంధ్రప్రదేశ్‌లోని భిన్న ప్రాంతాలు అంటే, రాయలసీమ, మధ్య కోస్తా, ఉత్తర కోస్తా ప్రాంతాల విశిష్టలక్షణాలు దృష్టిలో పెట్టుకొని అన్నిప్రాంతాల ఆసక్తులూ, ప్రయోజనాలను పరిగణలోకి తీసుకొని రాజధానీనగరాన్ని ఒక తటస్థ ప్రాంతంలో ఏర్పాటుచేయడంపై ప్రజాభిప్రాయాన్ని నిర్మించవలసి ఉండింది. అప్పుడు

మాత్రమే అది ప్రజల రాజధాని అవుతుంది. అందరికీ ఆమోదయోగ్యమవుతుంది. దీర్ఘకాలం మనగలుగుతుంది. రాజధానీనగర స్థలనిర్ణయంలో అటువంటి ప్రజాభిప్రాయ నిర్మాణ ప్రయత్నమే జరగలేదు. రాజధాని నిర్మాణానికి ఏకపక్ష నిర్ణయం మాత్రమే జరిగింది. రెండో ముఖ్యమైన అంశమేమిటంటే ఆంధ్రప్రదేశ్‌లోని మూడు భిన్నప్రాంతాలలో మూడు పెద్ద నగరాలున్నాయి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్టణం. ఈ మూడు పెద్ద నగరాలకు తోడు రాష్ట్రమంతటా వ్యాపించి ఉన్న పట్టణకేంద్రాల నెట్‌వర్క్ కూడా ఉంది. ఇటువంటి నెట్‌వర్కులు ఎక్కడెక్కడ ఉంటాయో, అక్కడ రాజధానీనగరం చిన్నదిగా ఉండి, ప్రధానంగా పరిపాలన రాజధానిగా వ్యవహరిస్తుందని వాదిం రాస్‌మన్ అభిప్రాయపడ్డాడు. రాష్ట్రానికి ఉన్న ఈ ప్రత్యేకతను దృష్టిలో పెట్టుకొని ఒక తటస్థప్రదేశంలో రాజధానీనగర స్థలాన్ని సంప్రతింపులు, ప్రజాభిప్రాయ సేకరణల ద్వారా అన్నిప్రాంతాల వారికీ ఆమోదయోగ్యమైన చోట, ఎవరూ మరొకవర్గం కాని, ప్రాంతం కాని తమపై ఆధిపత్యం చలాయించదన్న విశ్వాసం ఏర్పడేటట్లు తెర వెనుక ప్రయత్నం జరుగవలసింది. మూడు పెద్ద నగరాలు, బలమైన పట్టణాలు రాష్ట్రమంతా వ్యాపించిఉన్న నేపథ్యంలో మనం అవలంబించవలసిన నమూనా పరిపాలనా రాజధానిగా సమర్థంగా పనిచేసే చిన్నపట్టణం. ఇతర ప్రధాన నగరాలు, పట్టణాలను వాణిజ్యపరంగా అభివృద్ధి చేయాలి. రాష్ట్రం పెరుగుదల దృష్ట్యా ఇటువంటి నమూనా రాష్ట్ర లక్ష్యాలకు అనుగుణంగా, ఆదర్శవంతంగా పనిచేసేది.

ఏ రాజధానీనగరాన్నయినా నిర్మించాలని ప్రణాళిక వేసుకున్నప్పుడు ఆలోచించవలసిన ఒక ముఖ్యమైన అంశం ఎంత ఖర్చవుతుంది, ఆ నిధులు ఎక్కడినుండి వస్తాయి అన్నది. కొత్తరాజధానీనగర పథకం ఆ దేశం లేదా రాష్ట్రం జిడిపితో సమనిష్పత్తి కలిగి ఉండాలి. ఒక అంచనా ప్రకారం రాజధాని నిర్మాణ వ్యయం ఆ దేశ లేదా రాష్ట్ర జిడిపిలో 3 నుండి 12% వరకు ఉండవచ్చునంటారు. రాజధానీనగర నిర్మాణ ప్రారంభానికి ముందే తగిన ఆర్థిక ప్రణాళికను రచించుకోకపోయినట్లయితే, రాజధానీనగరనిర్మాణం ప్రారంభమే కాకపోవచ్చు, ఒకవేళ ప్రారంభమయినా నిధుల కొరత వల్ల ఆగిపోవచ్చు, జాప్యం జరగవచ్చు. కొత్త రాజధానులు నిర్మించుకున్న కొన్ని దేశాలలో ప్రత్యేక కారణాలవలన నిధులకొరతలేదు. మలేసియాలో రాజధానీనగర నిర్మాణంలో ప్రభుత్వ పెట్రోలియం గుత్తాధికార సంస్థ నిధులిచ్చింది. నైజీరియాలో

కూడా రాజధాని అబూజా నిర్మాణానికి పెట్రోలు ఉత్పత్తుల నుండి నిధులు ప్రవహించాయి.

అవసరమైన వనరులు ఏర్పాటు చేసుకోకుండా కొత్త రాజధానీనగరానికి పూనుకున్న బ్రెజిల్ వంటి దేశాల్లో, రాజధాని నిర్మాణం ఒత్తిడే దేశంలో భారీ ఆర్థిక సంక్షోభానికి కారణమై, దేశపాలన మిలిటరీ చేతిలోకి వెళ్లిపోవడానికి దారితీసింది. అమరావతికి కూడా ఒక మహానగరంగా లక్ష కోట్లకు పైగా భారీ అంచనాలతో పథకం రచించారు. దాన్ని అవసరమైన నిధుల ఏర్పాటు లేకుండానే కేవలం పరిపాలన రాజధానిగా కాక మహానగరంగా ఉద్దేశించారు. ప్రభుత్వ భవనాలు, కనీస మౌలిక సదుపాయాల కల్పనకు మాత్రమే నిధులివ్వడానికి కేంద్రప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇటువంటి భారీ ప్రాజెక్టుకు వనరులను సేకరించగలమన్న ప్రభుత్వ విశ్వాసం వాస్తవాలపై ఆధారపడింది కాదు. ఒకవేళ నిధులు గ్రాంటుగా రాకపోతే అప్పుగా తెచ్చుకోవాలంటే ప్రాజెక్టు వాణిజ్యపరంగా లాభదాయకమై ఉండాలి. రాష్ట్రప్రభుత్వం ముందుకుపోతున్న పద్ధతిని చూస్తే పరిపాలన రాజధానిగా కాక, మహానగరంగా తగిన్ని ఆర్థికవనరులను ఏర్పాటు చేసుకోకుండా నిర్మించడానికి పూనుకోవడం నిధుల కొరతవల్ల నిర్మాణమే ప్రారంభం కాకపోవడానికో, లేకపోతే నిర్మాణ సమయంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులలో చిక్కుకు పోవడానికో దారితీస్తుంది. నిర్దిష్టంగా నిధుల వాగ్దానాలు లేకుండా ఇటువంటి భారీ ప్రాజెక్టుకు పూనుకోవడం వల్ల కలిగే మరో ప్రభావం, అసలు రాష్ట్ర ఆర్థిక వనరుల పైనే పెద్ద బరువై కూర్చుని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు, నగరాల అభివృద్ధిని కుంటుపరచవచ్చు.

ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో రామచంద్రయ్య తన వ్యాసంలో అమరావతిని ఒక స్పెక్యులేటివ్ నగరంగా అభివర్ణించాడు. 2035 నాటికి అమరావతి జనాభా 45 లక్షలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. కో ఆప్షన్, బలాత్కారం, మోసం, బెదిరింపుల ద్వారా రైతులనుండి 30,000 ఎకరాల భూమిని సంగ్రహించారు. లాండ్ పూలింగ్ పద్ధతి ద్వారా భూసేకరణ జరిపారు. వాళ్లకు అభివృద్ధి చేసిన ప్లాట్ల కేటాయింపు ద్వారా భారీగా లాభాలు చేకూరుతాయనే ఊహలు కల్పించారు. రాజధాని ప్రాంత రైతులతో తన సమావేశాలలో ముఖ్యమంత్రి, రైతులు తమ భూములు వదలుకున్నట్లయితే వారిని జిఎంఆర్‌లుగా మారుస్తానని వాగ్దానం చేసినట్లు రామచంద్రయ్య పేర్కొన్నాడు. నలభైలక్షల జనాభా అమరావతి నగరానికి వలస

రావడానికి, అవకాశాల కల్పనకు అవసరమైన పెట్టుబడుల స్థాయిని అంచనావేయడం జరగలేదు, దానికి అవసరమైన నిధులు వచ్చే మార్గాన్ని ఏర్పరచలేదు. ఇటువంటి బలహీనమైన పునాదుల మీద పెట్టుబడులు, పెట్టుబడుల మూలాలు, అక్కడ జరగబోయే కార్యకలాపాలు మొదలైనవాటిని సమగ్రంగా అధ్యయనం చేసి ప్రణాళికీకరించి వివరించకుండా నిర్మించిన నమూనా, దాని సొంత బరువు కిందే కూలిపోయే అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలోని భూముల ధరలకు సంబంధించి ప్రస్తుతం స్పెక్యులేటివ్ కార్యకలాపాలు సాగుతున్నాయి. కాని వాస్తవాలు వెలుగు చూచి చేసిన వాగ్దానాలను సాధించడం అసాధ్యమని తెలిసిననాడు ధరలు కుప్పకూలి స్థానిక వ్యవసాయ సమాజంలో ఆందోళన తలెత్తక తప్పదని స్పష్టమవుతున్నది.

వాదిం రాస్‌మన్ అభిప్రాయంలో ఒక విజయవంతమైన రాజధాని స్థలం ఎంపిక ప్రక్రియ భిన్న ప్రాంతాలు, ప్రజల ప్రయోజనాలను ప్రతిబింబించాలి, భాగస్వాములైన వారందరూ నిర్ణయ ప్రక్రియలో పాలు పంచుకోవాలి. ఈ కోణం నుండి చూసినప్పుడు అమరావతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భిన్నప్రాంతాల మధ్య సర్దుబాటుగా కాని, ఏకాభిప్రాయం వల్ల కాని ఏర్పడిన నిర్ణయం కాదు. దీనికి సంబంధించినంతవరకూ ఈ నగర పునాదులు బలహీనమైనవి, అస్థిరమైనవి. విస్తృతమైన చర్చలు, సంభాషణలు జరిపి, సంప్రతింపులు, ఏకాభిప్రాయ సేకరణ ప్రక్రియల ద్వారా అన్నిప్రాంతాల వారినీ కలుపుకొని ఏర్పరచినప్పుడు మాత్రమే ఇటువంటి రాజధానీనగరాలు స్థిరంగా ఉండగలుగుతాయి, దీర్ఘకాలం మనగలుగుతాయి. ఏకాభిప్రాయసాధన, సంప్రతింపులు, భిన్న వర్గాల మధ్య అభిప్రాయభేదాల తొలగింపు, రాజధానీనగర స్థలాన్ని ఒక సమైక్యతబిందువుగా ఉపయోగించడం వంటి లక్షణాలతో నిర్మించిన రాజధానుల మంచి ఉదాహరణలు మనకెన్నో దొరుకుతాయి. ఈ దిశలో అత్యంత విజయవంతమైన తొలి ఉదాహరణగా మనం వాషింగ్టన్ డిసిని తీసికోవచ్చు. ఈ ఉదాహరణ మరెన్నో ఆంగ్లో శాగ్జన్ దేశాలకు ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, కెనడా వంటి వాటికి తమ రాజధానీనగర స్థలాల ఎంపిక ప్రక్రియలో ఆదర్శంగా నిలిచింది. వీటి రాజధానులు కూడా సంప్రతింపులు, సర్దుబాట్లు, రాజీల ప్రక్రియ ద్వారా ఏర్పడినవే. ఈ అన్ని దేశాలలోనూ రాజధానీనగరం దేశంలోని భిన్నప్రాంతాలకు ఆమోదయోగ్యమైన తటస్థ ప్రాంతాలలోనే ఉంది. ఈ అన్నిచోట్లా అది ఆ దేశ ప్రధాన ఆర్థిక కేంద్రబిందువు కంటే చిన్నదిగానే ఉంది.

భారతప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ సిఫారసులో దేనినీ రాష్ట్రప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. వాటిలో తమకు అనుకూలమైన చోట, అవసరమైనంత వరకు యథాలాపంగా పేర్కొనడం మాత్రమే చేసింది. ఈ కమిటీ నివేదిక కోసమే ఎదురుచూస్తున్నట్లుగా, ఆగస్టు చివరలో కమిటీ నివేదిక సమర్పించగానే సెప్టెంబరు మొదటివారంలో ప్రభుత్వం రాజధానీనగర స్థలాన్ని ప్రకటించింది. ఒక వ్యూహాత్మక చాణక్యరీతిలో రాజధానీనగర అంశాన్ని శాసనసభలో ప్రవేశపెట్టి, శాసనసభ తీర్మానాన్ని రాజధానీనగరాన్ని విజయవాడ నగర పరిసరాలలో ఏర్పాటు చేసేటట్లుగా తీసికొని, ప్రభుత్వం తాను ముందే ఎంచుకున్న స్థలంలో రాజధానీనగరాన్ని ప్రకటించింది.

వాదిం రాస్‌మన్ రాజధానీనగరాల స్థలాల నిర్ణయం విషయంలో అనుకూల విషయాలనూ, ప్రతికూల కారణాలనూ, రహస్య అజెండాలనూ వివరంగా వర్ణించాడు.

అనుకూల వ్యూహాలు ప్రాంతీయ సర్దుబాట్లమీద ఆధారపడి ఉంటాయి, రాజధానీనగరం ఒక తటస్థప్రాంతంలో ఏర్పడడానికి దారితీస్తాయి. రాజధానీనగరాన్ని అభివృద్ధి చెందని ప్రాంతంలో ఏర్పరచడం ద్వారా రాజధానిస్థలమూ, ఆ ప్రాంత అభివృద్ధికి ఒక సాధనమయ్యేట్లుగా ఈ నిర్ణయం ఉంటుంది. దీన్నే ఫార్వర్డ్ థ్రస్ట్ కేపిటల్ సిద్ధాంతం అంటారు. పక్షపాతం లేకుండా ఉండడం గుర్తింపు, ఆర్థిక పరిపాలనాసామర్థ్యం వంటి కారణాల వల్ల కూడా రాజధానీనగర స్థలనిర్ణయం ఉంటుంది.

ప్రాచీనకాలం నుండీ భూశకునశాస్త్రం, జ్యోతిషశాస్త్రం రాజధానీనగరాల స్థలాల ఎంపికలో ప్రధానపాత్ర వహించాయి. ఆ విధంగా స్థానిక జ్యోతిషశాస్త్ర సూత్రాలమీద ఆధారపడి నిర్మించిన రాజధానీనగరం మయన్మార్‌కు చెందిన నేపీడా. భూశకునశాస్త్రానికే భారతీయరూపం వాస్తు. జ్యోతిషశాస్త్రంతో కలిసి వాస్తు కృష్ణానదీతీరంలో అమరావతి రాజధానీనగర స్థలనిర్ణయంలో ప్రధానపాత్ర పోషించింది. అయితే ఈ ఎంపికకు కారణంగా దీన్ని బయటికి పేర్కొనలేదు. అంతవరకూ ఇది రాజధానీనగరాన్ని ప్రస్తుతస్థలంలో ఏర్పరచడంలో ఉన్న రహస్య అజెండా.

ఇక రాజధానీనగరాల ఏర్పాటులో రహస్య అజెండాలు ఇలా ఉంటాయి. ఇక్కడ ఒక పరిపాలకుడు ఏ జాతికి చెందినవాడు అన్నది ప్రధానమవుతుంది. అతనికి

విధేయంగా ఉన్న జాతి ప్రాబల్యం కలిగిన ప్రాంతంలో రాజధాని ఏర్పాటు జరుగుతుంది. అది ఒక నిర్దిష్ట తెగ, జాతికి అనుకూలంగా ఉంటుంది. ఇటువంటి సందర్భంలో తెగ సమైక్యత, పక్షపాతబుద్ధి అన్న సూత్రంపై ఆధారపడి నిర్ణయం జరుగుతుంది. ఇటువంటి దేశాలలో పాలకవర్గం తమ ప్రభుత్వ అధికారస్థానాన్ని తమ సొంత జాతిప్రాబల్యం ఉన్న ప్రాంతానికి తరలిస్తుంది. ఇక్కడ దేశ నిర్మాణ లక్ష్యాలను ప్రోత్సహించడానికి బదులుగా, తమ విధేయులను నియమించుకోవడానికి పథకం పన్నుతారు. ఇటువంటి సందర్భంలో రాజధానీనగరం ఇతర తెగలనుండి దూరమవుతుంది. అన్ని వర్గాల సమైక్యత ఆధారంగా రాజధాని ఉండదు. అనుకూలవ్యూహాలలో ఒక ఏకాభిప్రాయానికి వచ్చే ప్రయత్నం, తక్కిన వర్గాలను తమలో కలుపుకుపోయే పద్ధతి ఉంటుంది. కాని నకారాత్మక వ్యూహాలలో తక్కినవాళ్లని వేరుగా ఉంచే వ్యూహాలు ఒకే రాజకీయ సామాజిక వర్గానికి పరిమితమై, తక్కిన వర్గాలను దూరం పెడతాయి. తెగలమధ్య ఘర్షణలు ఉన్న దేశాలలో ఇటువంటివి సాధారణం. అట్లాగే, నిరంకుశపాలకులు ఉన్న దేశాలలో కూడా ఇది సాధారణం. రాస్‌మన్ ప్రకారం మహానగరాల నిర్మాణప్రయత్నాలకు దారితీసే కారణాలలో మొత్తం తామే సొంతం చేసుకోవాలనుకునే స్వార్థపరత్వమూ, తనంత గొప్పవాడు లేడని చెప్పుకోవడానికి ఇటువంటి పద్ధతులను ఎంచుకునే నాయకులు ఉంటారు.

గొప్ప కట్టడాలు నిర్మించడం ద్వారా ప్రజల మనస్సుల్లో శాశ్వతంగా నిలిచి ఉండాలనుకునేవాళ్లూ, తమ గొప్పదనాన్ని ప్రపంచమంతా పొగడాలనుకునేవాళ్లూ, మొత్తం తామే కబళించాలనుకునేవాళ్లూ ఇటువంటి ప్రయత్నాలు చేస్తారు. ఈ లక్షణాలన్నీ నిరంకుశపాలకుల ప్రత్యేక లక్షణాలు. ఈ లక్షణాలను రాజధానీనగరాల స్థలనిర్ణయాల వెనుక ఉన్న అదనపు కారణాలుగా గుర్తించవచ్చు. ఇటువంటి పాలకులు ఒక ప్రకటన చేసి, రాజధానీనగరాలను మహానగరాలుగా నిర్మించడం ద్వారా విశాల అంతర్జాతీయ రంగంలో తమకు ప్రాధాన్యం కల్పించుకోవడానికి కీర్తిని చాటడానికి ప్రయత్నిస్తారు. మలేషియాకు చెందిన మహమ్మద్ మహాతిర్, టర్కీకి చెందిన అతాతుర్క్, కజకిస్తాన్‌కు చెందిన నజర్ బయేవ్ ఇటువంటి నిరంకుశపాలకుల వర్గంలోకి వస్తారు. అమరావతి వంటి మహానగరాన్ని నిర్మించి, కాలమనే ఇసుకదారిలో తన అడుగుజాడలను వదలిపెట్టాలనుకునే ఇటువంటి పాలకులశ్రేణిలో తననుగూడా చేర్చుకోవడానికి శ్రీ చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుంది. కానీ వాళ్లకీ, తనకూ మధ్య ఒక ప్రధానభేదం ఉందనే విషయాన్ని ఆయన మరిచిపోతున్నట్లు

కనిపిస్తున్నది. టర్కీకి చెందిన అతాతుర్క్ పూర్తిగా భిన్నమైన కాలానికి చెందినవాడు. అతనితో పోల్చుకోవడం అంత బాగుండదు. మహమ్మద్ మహాతిర్ ఒక విధంగా అదృష్టవంతుడు. మలేషియా పెట్రోనాస్ రాజధానీనగరాన్ని మహానగరంగా నిర్మించడానికి అవసరమైన ఆర్థిక సహాయం చేసింది. కజకిస్తాన్ నజర్ బయేవ్ పెట్రోలు, ఇతర ఖనిజాల వంటి సహజవనరులలో ధనికమైన దేశానికి నాయకుడు. శ్రీ నాయుడుకు రాజధానీనగరాన్ని మహానగరంగా నిర్మించడానికి అవసరమైన ఇటువంటి వనరుల ఆధారం లేదు. అందువల్ల మహానగరాన్ని నిర్మించాలన్న ఆయన కల గానీ, కాలపు ఇసుకతిన్నెలమీద తన అడుగుజాడలను వదలిపెట్టాలన్న కోరిక గానీ నిజంగా సాకారం కాకపోవచ్చు. నిధుల కొరత వల్ల అసలు ఈ ప్రాజెక్టే ప్రారంభం కాకపోవచ్చు. లేదా ఆర్థిక సమస్యలతో నత్తనడక నడవవచ్చు.

ఒక రాజధానీనగర బలంకానీ, శక్తికానీ అది ఏ పునాదుల మీద నిర్మింపబడిందో ఆ పునాదుల మీద ఆధారపడి ఉంటుంది. ఏ రాజధానీనగరం భాగస్వాములైన అందరితోనూ విస్తారమైన చర్చలు జరిపి, ఏకాభిప్రాయ సాధన ద్వారాకానీ, సర్దుబాటు ద్వారాకానీ నిర్మితమవుతుందో ఆ రాజధానీనగరం విజయవంతంగా సుదీర్ఘకాలం నిలుస్తుంది. ఏకాభిప్రాయసాధన, సర్దుబాటు ప్రక్రియల ద్వారా ఏర్పడిన రాజధానీనగరాలకు వాషింగ్టన్ డిసి, కేన్ బెరా లను ఉదాహరణలుగా చెప్పవచ్చు.

ఈ సందర్భం దృష్ట్యా అమరావతి ఒక అనుకూల వ్యూహానికి సంబంధించిన ఏ లక్షణాలనూ ప్రదర్శించదు. అది ఒక తటస్థప్రదేశంలోనూ లేదు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలవారికీ అంగీకారయోగ్యమూ కాదు. భిన్నప్రాంతాల మధ్య ఒక సర్దుబాటు ఫార్ములాగా ఏర్పడినదీ కాదు. అది రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతంలోనూ లేదు. అందువల్ల ఒక ఫార్వార్డ్ థ్రస్ట్ కేపిటల్‌గా అభివృద్ధి చెందని ప్రాంతానికి ఒక అభివృద్ధి సాధనంగా ఉపయోగపడదు కూడా. రాజధానీనగరంగా అమరావతిని ప్రకటించేముందు ఒక స్థూలమైన ఏకాభిప్రాయాన్ని సాధించడానికి ఎటువంటి ప్రయత్నమూ జరగలేదు. దీనికి సంబంధించినంతవరకూ భిన్నభాగస్వాములకు ప్రాతినిధ్యం వహించే, భిన్నభాగస్వాములు అంగీకరించే తమదిగా భావించే, అందరినీ కలుపుకుపోయే రాజధానిగా దీన్ని వర్ణించలేను. మరోవైపు అమరావతి మనం ఇంతకుముందు రాజధానీస్థలాన్ని గురించి పేర్కొన్న అన్ని నకారాత్మక లక్షణాలనూ కలిగి ఉంది. ఒక డిస్‌ఎంబెడెడ్, ఎక్స్‌క్లూజివ్ రాజధాని లక్షణాలన్నీ దానికున్నాయి.

ఇటువంటి రాజధానీనగరాలకు మనకు ప్రాచీనకాలంలోనూ, ఉదాహరణలున్నాయి. మరీ ముఖ్యంగా ఆఫ్రికాలోని రాజధానీనగర స్థలాలకు సంబంధించి జాతి విధేయతలు, జాతిపరమైన పక్షపాతాలు అతి ప్రాధాన్యం వహించాయి. ఉదాహరణకు మలావీలో రాజధానీనగరం అప్పటి అధికారంలో ఉన్న రాజకీయ నాయకుని సొంత తెగప్రజలు ప్రబలంగా ఉన్న ప్రాంతంలో ఉంది. వాదిం రాస్‌మన్ పేర్కొన్నట్లుగా ఆఫ్రికాలో ఎందరో నియంతల విషయంలో బహిరంగంగా ప్రకటించినదాని వెనుక రహస్య ఎజెండాలున్నాయి. బహిరంగంగా చేసిన ప్రకటన స్వాతంత్ర్యం, వలసపాలన నుండి విముక్తి వంటివైతే, అధికారాన్ని తమ స్వీయ తెగ, వర్గంలోనే ఎప్పటికీ నిలుపుకోవాలన్న కోరికతో ప్రేరేపితులై ఈ నాయకులు, తమ రాజధానీనగరాలను తమకు అత్యంతవిధేయమైన ప్రాంతాలలో ఏర్పరుస్తారు. ప్రస్తుతమున్న అధికారకూటములకు ప్రత్యేక ప్రయోజనాలను కట్టబెట్టడం ద్వారా వారి విధేయతను నిలుపుకుంటారు. అమరావతిని రాజధానీనగరంగా ఎంచుకోవడంలో ప్రస్తుత రాజకీయ పాలకవర్గానికి కూడా ఇటువంటి ఆలోచనలే ప్రధానపాత్ర వహించినట్లు కనిపిస్తుంది. ఆఫ్రికాలో నియంతలలో సాధారణంగా కనిపించే లక్షణాలు ఒక ప్రజాస్వామ్యదేశంలో రాజధానీనగరాన్ని ఏర్పరిచే స్థలం ఎంపిక విషయంలో కీలకపాత్ర పోషించినట్లు కనిపిస్తుంది. పాలకవర్గానికి విధేయులైన ప్రజాబాహుళ్యమున్న ప్రాంతంలో ముందుగానే రియల్ ఎస్టేట్ ప్రయోజనాలను, భారీ వాణిజ్యప్రయోజనాలను స్థాపించిన ప్రాంతంలో రాజధాని స్థలం ఎంపిక జరిగింది. రాజధానీనగర స్థలనిర్ణయం విషయంలో రాష్ట్రవ్యాప్తంగా ఒక ఏకాభిప్రాయాన్ని సాధించే ప్రయత్నమేదీ జరగలేదు. పాలకతెగకు లాభదాయకంగా హఠాత్తుగా రాజధానీస్థలాన్ని ప్రకటించారు. సారవంతమైన సాగుభూములున్న కారణంగా ఈ స్థలం ఎంపిక ఏ మాత్రం తగినది కాదు. సారవంతమైన సాగుభూములున్న ప్రదేశంలో సాధారణంగా రాజధానీనగరాలను నిర్మించరు. దీనికి కారణం, భూసేకరణ, నిర్మాణం చాలా ఖర్చుతో కూడుకుని ఉండడం. ఇక్కడ రాజధానీస్థలాన్ని ఎంపిక చేసుకోవడం వెనుక ఒక రహస్య ఎజెండా కూడా ఉన్నట్లు కనిపిస్తుంది. ఇక్కడ రియల్ ఎస్టేట్, వ్యాపారప్రయోజనాలు ప్రాధాన్యం వహించాయి. ఒక మహానగరంగా రాజధానీనగరాన్ని నిర్మించడంలో, చరిత్ర ఇసుకతిన్నెలపై తన పాదముద్రలను వదిలి వెళ్లాలని భావించిన నాయకుని వ్యక్తిగతలక్షణం కూడా ఒక ముఖ్యపాత్ర పోషించి ఉంటుంది. ఇటువంటి డిస్‌ఎంబెడెడ్ ఎక్స్‌క్లూజివ్ రాజధానీనగరాలు సుదీర్ఘకాలం

మనలేవనీ, స్థిరంగా ఉండలేవని కూడా గమనించడం జరిగింది. ఇవి స్వల్పకాలికమైనవి. వీటి నిర్మాణం, నిర్వహణ చాలా ఖర్చుతో కూడినవి. ఇటువంటి రాజధానీనగరాల విషయంలో సిద్ధాంతరీత్యా ఊహించిన దానికంటే అమరావతి భవిష్యత్తు భిన్నంగా ఉండకపోవచ్చు.

రాజధానీనగర స్థలం ఎంపిక విషయంలో భారత ప్రభుత్వం నియమించిన కమిటీ చైర్మన్ శివరామకృష్ణన్ 2014 ఏప్రిల్ 20 వ తేదీన 'ది హిందూ' పత్రికలో ప్రచురితమైన 'ఐ ఆన్ కేపిటల్ లాస్ ఇన్ విజన్' అన్న వ్యాసంలో ఇలా పేర్కొన్నారు: 'రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం చంద్రబాబు నాయుడు రాజధానీనగర స్థలం సమస్యలో కూరుకుపోకుండా ఆంధ్రప్రదేశ్‌ను ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలపై కేంద్రీకరించడానికి కావలసినంత సమయం ఇచ్చింది. కానీ జరిగింది మాత్రం అదే... నాయుడు ముందున్న అతి ముఖ్యమైన సవాలు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రాష్ట్రవ్యాప్తంగా సమతులమైన అభివృద్ధిని సాధించడం. అంతే తప్ప కేవలం వి.జి. టిఎమ్ ప్రదేశం కాదు... శ్రీ నాయుడు తన అడుగులను వెనక్కు తీసుకోవడానికి ఇంకా సమయం ఉంది... సమస్య చరిత్రలో నిలిచిపోయే రాజధానీనగర నిర్మాణం కాదు, అది ముందెప్పుడో రావచ్చు. ప్రస్తుతం ముఖ్యమైనది ఏమంటే, ఈ రాజధాని ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్ రాజకీయశక్తినీ, ఆర్థికవనరులనూ తాకట్టు పెట్టే దాదాపు ఆత్మహత్యాసదృశమైన నిర్ణయం!

# References


1. Vadim Rossman: Capital Cities: Varieties and Patterns of Development and Relocation
2. Report of the expert committee appointed by the Ministry of Home Affairs Union of India to Study Alternatives for the New Capital for the State of Andhra Pradesh (Sivaramakrishnan committee report)
3. Ravi Kalia. Gandhinagar: Building National Identity and Postcolonial India.
4. Ravi Kalia. Bhubaneswar: From a Temple Town to a Capital City.
5. Ravi Kalia. Chandigarh: In Search of an Identity.
6. Ramachandraiah C. Where Andhra's Master Plan for New Capital Falters, *EPW* September 19, 2015.
7. Arun Kumar Undavalli. Capital Mess Called Bhramaravathi.
8. Sri Bagh pact
9. Ramachandraiah C. Making of Amaravathi Land Scape of Speculation and Intimidation, *EPW* April 23, 2016.
10. Devasahayam M.G. A Green field Capital, *The Hindu* December 27, 2015.

11. Aayush Ailawadi. The Big Land Pooling Experiment, *network 18,* October 24, 2015

12. Moushumi Das Gupta. Amaravathi To Naya Raipur: It takes more than construction to build new cities, *Hindustan times* August 5, 2017.

13. Nair Pratap. Notes from Raipur, *The Hindu,* March 18, 2017.

14. Personal Interview with Byjendra Kumar, Former Chairman, Naya Raipur Development Authority.

15. Kavitha sharma and others. Chandigadh Life Scape: Brief Social History of a Planned City.

16. Wright Tom. Why Delhi Move from Calcutta, *Wall Street Journal,* nov 11, 2011.

17. Malaysia Unloved Capital Begins to Show Cracks, *Dawn news paper,* 19-7-2017.

18. Kennard Matt and Claire, Provost. Burma Bizarre Capital, *Guardian* 19 March, 2015.

19. Nwafor J.C. The Relocation of Nigeria's Federal Capital. A Devise for Greater Territorial Integration and National Unity.

20. Why tax heavens cause poverty: Singapore the rise and rise of Asia's Switzerland, Tax Justice Network, Jan 3, 2014.

21. The Thousand Headed Snake: Forest Crimes, Corruption and Injustice in Indonesia. Environment Investigation Agency.

22. A narrative report on Singapore. Tax Justice Network, 7 Nov 2015.

23. Land Pooling and Reconstruction and Self Financing Mechanism for Urban Development, IDFC Paper 2010.

24. Preethi Sampath and Simi sunny. Dholera: The Myth of Voluntary Land Pooling.

25. Tangutoori Prakasham Pantulu and Tenneti Viswanadham. *Na jeevana yatra*.